శ్రీమతే రామానుజాయ నమః

# చతుస్సూత్రి - అనుబంధము

సర్వదేశదశాకాలేషు అవ్యాహతపరాక్రమా రామానుజార్యదివ్యాజ్ఞా వర్ధతాం అభివర్ధతామ్॥
రామానుజార్య దివ్యాజ్ఞా ప్రతివాసరముజ్జ్వలా దిగంతవ్యాపినీ భూయాత్ సా హి లోకహితైషిణీ ॥

అనుదినము మనం రామానుజుల దివ్యాజ్ఞ లోకహితైషిణి అని సర్వదేశదశాకాలములయందు వర్ధిల్లుతూండవలెనని మంగళాశాసన సమయంలో విన్నవించుతున్నాముగదా! భగవద్రామానుజుల దివ్యాజ్ఞను సంపూర్ణముగా ప్రతిపాదించే మహద్గ్రంథము భగవద్బాదరాయణుల బ్రహ్మసూత్రాలకి ఆయన అందించిన వ్యాఖ్యానం శ్రీభాష్యము. ఈ శ్రీభాష్య గ్రంథమునకు పునాది అని చెప్పబడునది చతుస్సూత్రి అనబడు మొదటి నాలుగుసూత్రముల వివరణము.

శ్రీభాష్యగ్రంథప్రారంభమునందు భగవద్రామానుజులు వేదాంతశాస్త్రప్రధానప్రతిపాద్యమైన ప్రాప్యప్రాపక-భూతమగు భగవత్తత్త్వమును సంగ్రహముగా నిరూపిస్తూ ఈ క్రింద చెప్పబడిన మంగళశ్లోకమును అనుగ్రహించేరు.

శ్లో॥ అఖిలభువనజన్మస్థేమభంగాదిలీలే
వినతవివిధభూతవ్రాత రక్షైకదీక్షే ।
శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా ॥

ఈ శ్లోకమునందు “లీలావిభూతిలోని సకలలోకములయొక్క సృష్టిస్థితిలయాదులను లీలగా గలవాడును, భక్తిప్రపత్తులతో తనను ఆశ్రయించిన సమస్తప్రాణిసముదాయమును రక్షించుటయే ఏకైకదీక్షగా కలవాడును, వేదాంతములయందు స్పష్టముగా ప్రతిపాదింపబడినవాడును పరబ్రహ్మమును అయిన శ్రీనివాసునియందు నాకు భక్తిరూపాపన్న ఉపాసనాత్మకరూపజ్ఞానము సిద్ధించుగాక” అని పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుని ప్రార్థించుచు శ్రీభాష్యగ్రంథముయొక్క సారాంశమునంతను మనకందించేరు. ఈ మంగళశ్లోకంలో విషయప్రయోజన-సంబంధనిరూపణము, గ్రంథారంభమున చేయు మంగళాచరణము, ప్రథమసూత్రార్థసంగ్రహము, బ్రహ్మలక్షణ నిరూపణము, చతుస్సూత్రిసంగ్రహము, ధ్యేయస్వరూపసంగ్రహము, ధ్యేయస్వరూపప్రతిపాదనము ప్రతిపక్ష నిరాసనము, స్వపక్షస్థాపనము, బ్రహ్మమీమాంసారంభవిశేషము మొదలైన అనేకవిషయములను అంతర్లీనంగా చొప్పిస్తూ మంగళశ్లోకాన్నందించి భగవద్రామానుజులు గ్రంథరచనకుపక్రమించేరు.

## భాష్యారంభసమర్థనము

భగవద్రామానుజులు తమ రెండవ శ్లోకంలో పూర్వాచార్యులను స్మరిస్తూ తమగ్రంథరచనావశ్యకతను, తత్ప్రయోజనమును తదధికారిలక్షణములను వివరిస్తున్నారు.

శ్లో॥ పారాశర్య వచస్సుధాముపనిషద్దుగ్ధాబ్ధిమధ్యోద్ధృతామ్
సంసారాగ్నివిదీపన వ్యపగత ప్రాణాత్మసంజీవినీమ్ ।
పూర్వాచార్య సురక్షితాం బహుమతివ్యాఘాతదూరస్థితామ్
ఆనీతాం తు నిజాక్షరైః సుమనసో భౌమాః పిబన్త్వన్వహమ్ ॥

ఉపనిషత్తులనే క్షీరసాగరముయొక్క మధ్యనుండి బైటకు తీయబడినదియు సంసారాగ్నియొక్క విజృంభణముచేత పరమాత్మసంబంధమును కోల్పోయిన జీవులకు ఉజ్జీవనహేతువైన భగవత్ప్రాప్తి అనెడి మోక్షమును కలిగించెడిదియు నగు పూర్వము బోధాయనాది మహర్షులచేత కాపాడబడినదియు విపరీతవ్యాఖ్యలకు దూరముగా నున్నదియు నా అక్షరములచేత తిరిగి తీసుకొనిరాబడినదియు పరాశరమహర్షిసుతులైన వ్యాసభగవానుల సూత్రామృతమును మంచిమనస్సుగల భూలోకవాసులు అనుదినమును ఆస్వాదింతురుగాక.

ఈ శ్లోకమునందు భగవద్రామానుజులు పూర్వాచార్యులను స్మరిస్తూ గ్రంథప్రాధాన్యతను వివరించేరు. తన శ్రీభాష్యప్రారంభంలో **"భగవద్బోధాయనకృతాం... తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యన్తే"** అనుచూ తన భాష్యగ్రంథము స్వకపోలకల్పితముకాదని పూర్వాచార్యుల హృద్గతాభిప్రాయము ప్రకారమే వివరిస్తున్నారని స్పష్టం చేసేరు.

## ॥ జిజ్ఞాసాధికరణము ॥ 1-1-1 ॥

### ॥ సూ ॥ అథాతో బ్రహ్మజిజ్ఞాసా ॥ 1-1-1 ॥

అంటే, **అథ**- అనంతరము, **అతః**- అందువలన, **బ్రహ్మజిజ్ఞాసా**- బ్రహ్మను గురించి తెలుసుకొన గోరుట. అనగా, (కర్మవిచారము) అనంతరము, (ఈ విచారమువలన పరిమితమును అశాశ్వతమును అగు, ఫలము మాత్రము లభించునని తెలుసుకొనిన) కారణముగా, పరబ్రహ్మముగురించి తెలుసుకొనుట(చేయవలెను) అంటే మొదట, సాంగముగా, వేద,వేదాంగ, వేదాంతములను అధ్యయనము చేసినతరువాత, కేవలకర్మలు అల్పమైన, అస్థిరమైన ఫలములనే ఇయ్యగలవని తెలుసుకొని; నిత్యమైనది, అనంతమైనది అయిన భగవత్ప్రాప్తిరూప మైన మోక్షఫలమును పొందవలెనని అభిలాషకలిగినవానికి అట్టి భగవానుని అనగా పరబ్రహ్మమును తెలిసికొనవలె నని కోరిక కలుగుతుంది గదా! ఇక్కడ **బ్రహ్మజిజ్ఞాసా** అంటే **బ్రహ్మణః జిజ్ఞాసా - బ్రహ్మజిజ్ఞాసా** - అనగా బ్రహ్మగురించి తెలిసికొనడమనే అర్థం చేసుకొనాలి. అంటే, తెలిసికొనడమనే క్రియకు తెలిసికొనబడే బ్రహ్మ అనే కర్మతో సంబంధము కర్మణి షష్ఠీ అను వ్యాకరణవిశేషముచేత అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు జగద్రక్షణ అంటే జగత్తుయొక్క రక్షణ అన్నప్పుడు జగత్తు రక్షించేకర్త కాదు, రక్షించబడే కర్మ. అలాగే ఇక్కడకూడా బ్రహ్మశబ్దాన్ని కర్మగానే పరిగణించాలి. ఇంకా వ్యాకరణంలోతులకి వెళ్తే **"ప్రతిపదవిధానాత్ షష్ఠీన సమస్యతే"** అను సూత్రము ప్రకారము ఇలాంటి సమాసము చెయ్యవచ్చా అంటే **"కృద్యోగాచ్చ షష్ఠీ సమస్యతే"** అను మరియొక సూత్రము చేత అటువంటి సమాసము సమంజసమే అని సమాధానము. ఇక్కడ బ్రహ్మశబ్దముచేత స్వరూపమును బట్టియు, గుణములనుబట్టియు అంతులేని అతిశయముగల పురుషోత్తముడు చెప్పబడుచున్నాడు. కాని, గుణలేశ-మాత్రమువలన కొంతమంది వ్యక్తులను బ్రహ్మశబ్దముచేత సంబోధించుటకూడ లోకవ్యవహారముగా కనబడు చున్నది. అయితే, ఆ సందర్భాలలో బ్రహ్మశబ్దము ఔపచారికము. కాని ప్రస్తుతము బ్రహ్మశబ్దము అముఖ్యార్థముగా చెప్పబడిన పరబ్రహ్మభిన్నమైన వ్యక్తులయందు అన్వయించదు.

ఈ సందర్భములో బ్రహ్మజిజ్ఞాసావిషయము తెలిపే ఉత్తరమీమాంసాశాస్త్రము, ధర్మజిజ్ఞాసావిషయము తెలిపే పూర్వమీమాంసాశాస్త్రముకూడా, ఏకశాస్త్రమునకు సంబంధించినవేనని శ్రీభాష్యవివరణమును అందించిన శ్రుతప్రకాశికాచార్యులు వివరించారు. అంటే పూర్వోత్తరమీమాంసలకు కర్తృభేదము, విషయభేదము, ప్రయోజనభేదము, అధికారిభేదము, కలదని, అందువలన అవి రెండును ఏకశాస్త్రముకాదని చెప్పెడి కొన్నిమతములవారికి శ్రుతప్రకాశికాచార్యులవారు ఇట్లు చెప్పబడిన ఈ భేదములను పరిగణించనక్కరలేదని,

కవిత్రయము పూర్తిచేసిన మహాభారతము, కర్తృభేదమున్నను ఒక్కటే గ్రంథమైనట్లు, వేదములో మొదటి భాగమైన పూర్వమీమాంసలో భగవదారాధనారూపములైన కర్మలు వివరింపబడగా, ఆరాధ్యమైన భగవత్స్వరూపమును నిరూపించేది రెండవభాగమైన ఉత్తరమీమాంస కనుక, విషయభేదము లేదనియు, పూర్వమీమాంస ఐహికమును, పారలౌకికమును అయిన అల్పానిత్యఫలములను చెప్పగా, ఉత్తరమీమాంస ఆయాకర్మలు ఫలాభిసంధిరహితముగా భగవదుపాసనాపరముగా ఆచరించుట మోక్షసాధనమని చెప్పుటవలన ప్రయోజనసంబంధమున్నదనియు, ఈ రకముగా కేవలకర్మల అల్పాస్థిరఫలత్వమును గ్రహించినపిదప బ్రహ్మవిచారమును ప్రారంభించిన వేదాధ్యయనాధికారియే ఉభయమీమాంసలకు అధికారియగుటచేత అధికారిభేదముకూడ లేదనియు, ఈ కారణాలవల్ల పూర్వోత్తరమీమాంసలు ఒకే శాస్త్రమునకు సంబంధించినవనియు వివరించిరి.

ఇక ముందు శ్రీభాష్యమునందు, అంతకుముందు చెప్పబడిన వివిధమతములు, అభిప్రాయములు, ముందు చెప్పబడి, అటుపిమ్మట వాటిని సవరిస్తూ తమ ప్రతిపాదన నిరూపించబడుతున్నది. ముందు చెప్పబడిన మతములు అభిప్రాయములను పూర్వపక్షమని, తదుపరి భగవద్రామానుజులచే ప్రతిపాదించబడినదానిని సిద్ధాంతమని అంటారు. ఈ సూత్రంలో పూర్వపక్షము, లఘుపూర్వపక్షము, మహాపూర్వపక్షమనియు, సిద్ధాంతము లఘుసిద్ధాంతము, మహాసిద్ధాంతమనియు రెండు రెండు భాగములుగా విభజించబడియున్నది. లఘుపూర్వపక్షము లఘుసిద్ధాంతము స్థిరమును అనల్పమును అగు ఫలమును పొందుటకుసాధనమును గురించియు, మహాపూర్వపక్షము, మహాసిద్ధాంతమును తత్సాధ్యమును గురించయు వివరించుని పెద్దలు చెప్తారు. వీటి సారాంశము సంగ్రహంగా ఇప్పుడు మనం చూద్దాం.

## లఘుపూర్వపక్షము

కేవలకర్మలు అనిత్య, అల్పఫలదములు కనుక మోక్షసాధనములు కావు. "తత్త్వమసి" మొదలైన మహావాక్యములే మోక్షసాధకములు. అట్టివాక్యార్థజ్ఞానమువలన నిర్విశేషచిన్మాత్రమైన పరబ్రహ్మజ్ఞానము కలిగి అంతకుముందు అనాదిగా, ఆవరించియున్న అవిద్యయు, భేదవాసనయు పూర్తిగా తొలగి ఉన్నదొక్కటే పరమార్థము, రెండవ పదార్థము ఏమియు లేదు అన్న ఐక్యజ్ఞానము సుప్రతిష్ఠితము అవుతుంది. ఇట్టి వేదాంతజ్ఞానమునకు పూర్వముండవలసినది కర్మానుష్ఠానము కాదు. ఇందులకు నిత్యానిత్యవస్తువివేకము, శమదమాదిసాధనసంపత్తి, ఇహాముత్రఫలభోగవిరాగము, ముముక్షుత్వము అనబడు సాధనచతుష్టయము నాలుగు ఆవశ్యకము.

**నిత్యానిత్యవస్తువివేకము**– ఏది నిత్యవస్తువు, ఏది అనిత్యవస్తువు అనే విషయం తెలుసుకొని వాటిని విభజించి చూడటం అనగా, పరబ్రహ్మము ఒక్కటే నిత్యవస్తువని, తదితరములన్నీ అనిత్యములనీ, తెలుసుకొనడం.

**శమదమాది సాధనసంపత్తి**– శమము అనబడు బాహ్యేంద్రియనిగ్రహము, దమము అనబడే అంతరింద్రియనిగ్రహము, ఏకాగ్రత, మొదలైనవి సిద్ధించునప్పుడే బ్రహ్మజిజ్ఞాసాధికారము కలుగుతుంది. ఇదే శమదమాదిసాధనసంపత్తి,

**ఇహాముత్రఫలభోగవిరాగము**: ఈ లోకమునందును, స్వర్గాదిలోకమునందును, కలుగు ఫలములను అనుభవించుటయందు పూర్తిగా వైరాగ్యము కలుగుట ఇహాముత్రఫలభోగవిరాగము అనబడును

**ముముక్షుత్వము** – మోక్షముపై దృఢమైన అభిలాషకలిగియుండుట ముముక్షుత్వము.

ఈ రకముగా, కేవలకర్మలు అనిత్యములు, అల్పములు అగు ఫలములనే ఇచ్చుటచేత, వాటిని త్యజించి, సాధనచతుష్టయము పూర్వవృత్తముగా తత్త్వమస్యాదివాక్యార్థజ్ఞానముచేత భేదవాసనారాహిత్యము, ఐక్యజ్ఞానము కలిగి, బ్రహ్మానుభవము సిద్ధించుటయే పరమార్థము.

**లఘుసిద్ధాంతము**:– ఇంతవరకు చెప్పబడిన లఘుపూర్వపక్షము భగవద్రామానుజులచేత లఘుసిద్ధాంతములో సంస్కరింపబడుచున్నది.

అవిద్యానివృత్తివలన మోక్షము కలుగునని అంగీకరించినను, ఆ కేవలవేదాంతవాక్యార్థజ్ఞానము అవిద్యా నివర్తకము కాదు. ఐక్యజ్ఞానము కలిగినంతమాత్రమున ప్రత్యక్షముగా అనువర్తించు భేదజ్ఞానము నివర్తనము కాదు. ఉదాహరణకు చంద్రుడొక్కడే అని జ్ఞానము కలిగినను కంటిని నొక్కియుంచినప్పుడు కలుగు ఇద్దరు చంద్రులు కనబడకపోరు. కనుక, పూర్వపక్షమునందు చెప్పబడిన వాక్యార్థజ్ఞానముకంటే భిన్నమగు జ్ఞానము, ఉపాసనము, ప్రధానమైనది. ఇదే విషయాన్ని "విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత" "ఓమిత్యాత్మానం ధ్యాయథ", "ఆత్మానమేవ లోకముపాసీత", "ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మన్తవ్యః నిదిధ్యాసితవ్యః" మొదలుగా అనేకములైన ఉపనిషద్వాక్యములు వక్కాణించుచున్నవి. ధ్యానమనగా, తైలధారవలె నిరంతరాయమైన స్మృతిపరంపర. ఇది సిద్ధించుటకు భగవద్రామానుజులు సాధనసప్తకము అనగా, వివేక, విమోక, అభ్యాస, క్రియా, కల్యాణ,అనవసాద, అనుద్ధర్షములను సాధనసప్తకమును వివరించేరు.

**వివేకము:** జాతినిబట్టిగాని, వ్యక్తినిబట్టిగాని, దుష్టపదార్థసంసర్గనిమిత్తమునుబట్టిగాని, మలినముకాని ఆహారముతో దేహశుద్ధిని కాపాడుకొనుట వివేకము.

**విమోకము:** కామముచేత ఫలముపై, వ్యసనరూపమైన అత్యాసక్తి లేకుండుట విమోకము.

**అభ్యాసము:** జ్ఞానములకు ఆలంబనమైన వ్యక్తియొక్క స్వరూపమును మాటిమాటికి భావించుచుండుట అభ్యాసము.

**క్రియ:** తన శక్తికి తగినట్లు వర్ణాశ్రమధర్మములైన పంచమహాయజ్ఞాదులను చేయుచుండుట క్రియ.

**కల్యాణము:**– సత్యము, ఆర్జవము, దయ, దానము, అహింస, అనభిద్య అనునవి కల్యాణములు.

**అనవసాదము:** దేశకాలములు అనుకూలముగా లేకున్నను, సంపూర్ణమైన ఉత్సాహమును కలిగియుండుట

**అనుద్ధర్షము:** సంతోషహేతువస్తుసంస్మరణముచేత అతిసంతోషము లేకుండుటయే అనుద్ధర్షము.

ఈ విధముగా, చిత్తశుద్ధులే కర్మాచరణమునకు ఆవశ్యకమని, వాక్యార్థజ్ఞానముకాక, భగవదుపాసనమే మోక్షసాధనమని, మోక్షమునకు కర్మాంగకభక్తిరూపజ్ఞానము ఆవశ్యకమనియు, ఈ కనబడు ప్రపంచమంతయు మిథ్యాభూతమనియు, వేదాంతవాక్యజన్యకేవలతత్త్వజ్ఞానము తన్నివర్తకమనియు, చెప్పెడు పూర్వపక్షవాదము అసంబద్ధమని భగవద్రామానుజులు తమ లఘుసిద్ధాంతమునందు వివరిస్తారు.

## మహాపూర్వపక్షము

ఇంతకు ముందు లఘుపూర్వపక్షమునందు మిథ్యాభూతప్రపంచప్రాతిభాసికత ఈ కనబడుతున్నప్రపంచము మిథ్యయనీ, ఇలా కనబడుటకు కారణము అవిద్య అని తత్త్వమసిమొదలైన వేదాంతవాక్యముల అర్థజ్ఞానముచేత అవిద్య నివృత్తి అగునని, తత్కారణముగా, యజ్ఞాదికర్మల అవసరం లేకుండా బ్రహ్మాయే సత్యమనెడు జ్ఞానానుభవము కలుగునని, అందువలన కర్మలతో అవసరములేదని సాధనాచతుష్టయముమాత్రమే తత్పూర్వవృత్తమని తెలుసుకొని యున్నాము. ఈ వాదమునందు అవిద్య అన ఏమియో, మిథ్యలక్షణమేమియో, నిర్విశేషచిన్మాత్రమని చెప్పబడుతున్న బ్రహ్మము ఎట్లు అర్థము చేసుకొనబడవలెనో, భేదము, విశేషము మొదలగునవి అయథార్థములెట్లగునో , వీటికి శ్రుతిప్రమాణములేవియో వివరించబడలేదు. ఈ వివరములు మహాపూర్వపక్షమునందు అందించబడుతున్నవి.

ఛాందోగ్యమునందు సద్విద్యాప్రకరణములో "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్", "ఏకమేవ అద్వితీయం" అను వాక్యములున్నవి. ఈ "సదేవ..." ఇత్యాదివాక్యములు ఉద్దాలకుడను మహర్షి, పన్నెండు సంవత్సరములు వేదాధ్యయనము చేసి తిరిగివచ్చిన తనకుమారుడైన శ్వేతకేతువును ఉద్దేశించి, పలికిన వాక్యములు. వేదాధ్యయనము చేసి వచ్చిన శ్వేతకేతు తీరు చూచి, ఆయన తండ్రి ఉద్దాలకుడు శ్వేతకేతువునకు జ్ఞానబోధ చెయ్యవలెనని తలంచి "దేనిని గురించి వింటే, సర్వము వినినట్లగునో, దేనిని గురించి మననము చేసినచో సర్వము మననము చేసినట్లగునో, సర్వము తెలుసుకొనినట్లగునో, ఆ ఆదేశమునుగురించి నీ ఉపాధ్యాయుని అడిగేవా" అని ప్రశ్నించేడు. తెల్లబోయిన తన కుమారుని తీసుకొని ముందుగా కుమ్మరివద్దకు పోయి, మట్టినుండి కుండలు, మున్నగునవి తయారగుటను చూపించి, "యథా సోమ్య ఏకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞానం స్యాత్", "వాచారమ్భణం వికారో నామధేయం", "మృత్తికేత్యేవ సత్యమ్" అని కుండ మొదలైన మృణ్మయవస్తువులు, వాటి నామధేయములు, ఇవన్నియు, వాగ్వ్యవహారమునుబట్టి వచ్చినవే. మట్టియే అసలు సత్యము. అనగా స్వల్పకాలము మాత్రముండి, తదుపరి గతించు ఈ ఆకారభేదములకంటే, పేరులకంటే, చిరస్థాయిగను ఉన్న మృత్తికయే సత్యము, అని ఉద్దాలకుడు తన కుమారునికి వివరించెను. ఇదే విధముగా, ఆ పిమ్మట, బంగారపు వస్తువులు చేయు ప్రదేశములకు, ఇనుపవస్తువులు తయారుచేయు ప్రదేశములకు, శ్వేతకేతువును తీసుకొనిపోయి, బంగారమే సత్యమని, ఇనుముమాత్రమే సత్యమని, వరుసగా, స్వర్ణమిత్యేవ సత్యం, లోహమిత్యేవసత్యం, అని శ్వేతకేతువునకు వివరించేడు. దీనిని బట్టి సంతతము మారుచుండు ఈ కనబడు ప్రపంచమంతా సత్యము కాదని, ఈ సృష్టికి పూర్వము సచ్ఛబ్దవాచ్యమైన బ్రహ్మమే యున్నదని అది ఒక్కటే ఉన్నదని అది అద్వితీయము అనగా ద్వితీయశబ్దవాచ్యమైన మరేమియు లేదని "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవ, అద్వితీయం" (ఛాం,6-2-1) అని ఉద్దాలకునిచే ఈ రకముగా చెప్పబడిన వాక్యమునకు సచ్ఛబ్దవాచ్య బ్రహ్మమే కలదని, దానికి ఆ బ్రహ్మవంటి సజాతీయములుకాని, వేరొకరకమైన విజాతీయుములుగాని, లేవనియు, ఒక చెట్టునందు కనబడు ఆకులు, పువ్వులు, కాయలువంటి స్వగతభేదములుకూడ బ్రహ్మయందు లేవని ఈ వాక్యములకు అర్థముగా పూర్వపక్షము చెప్పబడింది. ఈ రకంగా, బ్రహ్మమొక్కటియే సత్యమని, అట్టి బ్రహ్మములు అనేకములు లేవని, ఆ బ్రహ్మముకంటే, విజాతీయమైన అసత్పదార్థములు లేవని, ఆ బ్రహ్మకు స్వగత భేదములు లేవని, ఆ బ్రహ్మము నిర్విశేషచిన్మాత్రమని పూర్వపక్షియొక్క అభిప్రాయము.

## శ్రుతిస్మృతిపురాణవాక్యములచే పూర్వపక్షసమర్థనము.

ఇదే విషయము అనేకములైన ఉపనిషదాదివాక్యములు బోధించుచున్నవని పూర్వపక్షము వివరించుతుంది. ఈ క్రింద కొన్ని వాక్యములు ఉదాహరణము కొరకు ఈయబడినవి.

అథపరా యయా ...పరిప్రచ్ఛన్తి ధీరాః (ముం.-1-1-1) అపరవిద్యచేతనే అక్షరశబ్దమాత్రమైన బ్రహ్మము లభ్యమగును. వానికి పేరు, రంగు లేదు, అదృశ్యమైనది, పాణిపాదములవంటి అవయవములు లేవు. అది అంతటికి ఆధారము. సూక్ష్మమై అంతటను వ్యాపించి ఉంటుంది.

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ (తై.ఆనం.) ఈ బ్రహ్మ, మిథ్యాభూతబ్రహ్మముకంటె భిన్నము, జడము కాదు, పరిచ్ఛేదము లేనిది.

నిష్కలం, నిష్క్రియం, శాన్తం,నిరవద్యం, నిరఞ్జనమ్ (శ్వే.6-19) బ్రహ్మకు అవయవములుకాని, చలనము కాని, ఆకలిదప్పులవంటివి కాని కర్మసంబంధముకాని దానివలన కలుగు భ్రమలు కాని లేనిది.

యస్యామతం తస్యమతం మతం యస్య న వేద సః (కేన. 2-3) బ్రహ్మ తెలుసుకొనుటకు అతీతమైనది,

నదృష్టేర్ద్రష్టారం, పశ్యేః నమతేర్మన్తారం మన్వీథాః (బృ. 5-4-2) ఈ బ్రహ్మ జ్ఞాతకాదు, మననము చేయువాడు కాదు

ఆనందో బ్రహ్మ (తై. భృ. )ఆనందమే బ్రహ్మము. అనగా ఆనందము కలిగినదని అర్థము కాదు.

ఇదం సర్వం యత్, అయమాత్మా, (బృ. 5-4-6) ఈ కనబడునంతయు, బ్రహ్మమే అనగా బ్రహ్మము తప్ప వేరొకటి లేదు.

నేహ నానాస్తి కిఞ్చన(బృ. 6-4-19) నానావిధములైన భేదములేవియును లేవు.

యత్ర హి ద్వైతమివ భవతి ... తత్ కేన కం విజానీయాత్. (బృ. 4-4-14) ఎవనికి ఈ ప్రపంచములో సర్వము బ్రహ్మమే తప్ప బ్రహ్మభిన్నము కాదని తోచునో అపుడు ఎవడు ఎవనిని చూచును. అనగా, బ్రహ్మతప్ప వేరొటి లేదని అర్థము.

యదా హ్యేవైష ఏతస్మిన్ దరమన్తరం కురుతే, అథ తస్య భయం భవతి. (ఐ. ఆ. 7) ఎప్పుడైతే, ఏకమైన బ్రహ్మమునందు భేదములున్నట్లు కనిపించునో, అప్పుడు అట్టివానికి భయము కలుగును.

న స్థానతోపి ఉభయలిఙ్గమ్ సర్వత్ర హి((బ్ర. సూ. 3-2-11) బ్రహ్మమునందు సాకారము, నిరాకారము అను స్వరూపమే లేదు, అది నిర్విశేషమే

మాయామాత్రం తు కార్.... ((బ్ర. సూ. 3-2-3) స్వప్నపదార్థములన్నియయు మాయామాత్రములు, అసత్యములే.

అనృతేన హి ప్రత్యూఢాః (ఛాం. 8-3-2)అవిద్యవలన బ్రహ్మనుండి జనులు దూరమగుదురు.

ప్రత్యస్తమితభేదం.... (వి. పు 6-7-53) సజాతీయ, విజాతీయ,స్వగత భేదరహితమని ఉన్నది అనదగిన జ్ఞానమాత్రమైన బ్రహ్మ, వాక్కులకందనిది.

జ్ఞానస్వరూపమత్యన్తనిర్మలం పరమార్థతః (వి. పు. 1-2-6) జ్ఞానస్వరూపమైన బ్రహ్మము అత్యన్తనిర్మలము. అనగా సర్వవిశేషరహితము. అదియే పరమార్థసత్యము.

పరమార్థః త్వం ఏవ ఏకః,నాన్యః అస్తి(వి. పు. 1-4-32) నీవే పరమార్థతత్వము వేరొకటి ఏదియు లేదు.

యదేతత్ దృశ్యతే మూర్తం ఏతత్ జ్ఞానాత్మనః తవ భ్రాన్తిజ్ఞానేన పశ్యన్తి జగద్రూప మయోగినః (వి. పు. 1-4-39) ఈ కనబడుచున్నదంతయును నీ జ్ఞానస్వరూపము. అయోగులు భ్రాన్తిచే ఈ జగత్తును పరమార్థమని తలుచుచున్నారు.

తస్యాత్మపరదేహేషు ...(వి. పు-2-14-31) ఆ జ్ఞానమే స్వపరసర్వదేహములయందు వ్యాపించియున్నది. ఆ జ్ఞానమంతయు ఒకటియే. తద్భిన్నముగా జీవుడు లేడు. కనుక, భేదభావముతో చూచువారు సత్యమును గుర్తించినవారు కాదు.

వేణురంధ్రవిభేదేన...భేదః ...(వి. పు. 2-14-32) ఒకే వాయువు వేణువు రంధ్రములలో ప్రవేశించినపుడు భేదమును కలిగినట్లు ఒకే జ్ఞానము శరీరభేదమును బట్టి దేవమనుష్యాది భేదములను పొందుచున్నది

విభేదజనకే....(వి. పు. 6-7-96) భేదభ్రమను కలిగించు అజ్ఞానము నశించిపోగా, తనకును, బ్రహ్మమునకును నిజముగా లేని భేదమును ఎవడు కల్పించును.

నతదస్తివినా యస్య... మయా భూతం జనార్దన (భ. గీ-10-39) నేను తప్ప చరాచరాత్మకమైన ఈ ప్రపంచమేమియు నిజముగా లేదు.

తేషాం సత్యానాం సతాం..(ఛాం-8-3-1) ఈ బ్రహ్మను అవిద్య ఆచ్ఛాదించి యున్నది,

నాసదాసీత్ నోసదాసీత్ కదానీం...(యజురా-2-8-9) అసత్తుగాని, సత్తుగాని లేదు. అవిద్యయే ఉండెను. ఆ అవిద్యచే ప్రళయమున బ్రహ్మము ఆచ్ఛాదితమై యుండెను.

మాయాంతు ప్రకృతి విద్యాత్ ... (శ్వే.4-9)ఈ ప్రకృతిని మాయ అనగా, మిథ్యయని గుర్తించవలెను. మహేశ్వరుడు కూడ మాయచేత ఆవృతమైనవాడే.

ఇన్ద్రోమాయాభిః పురురూప నీయతే .. (బృ-4-5-19)అవిద్యచేత బ్రహ్మము బహురూపములను కలిగినదయ్యెను.

అనాది మాయయా సుప్తః యథా జీవః ప్రబుధ్యతే. (మాం.1-16)అనాదియగు మాయచేత సుప్తప్రాయుడైయున్న జీవుడు క్రొత్తరూపమును గుర్తించునపుడు జీవునికి జ్ఞానానుభవము కలుగును.

జ్ఞానస్వరూపో భగవాన్... (వి.పు.2-12-39) బ్రహ్మము జ్ఞానమాత్రస్వరూపమే. పర్వతసముద్ర భూమ్యాదిభేదములు అవిద్యాకల్పితములు.

యదాతు శుద్ధం నిజరూపి సర్వకర్మత్యజే జ్ఞానం అపాస్తదోషం... (వి.పు.2-12-40)ఎప్పుడు అవిద్యావిముక్తమైన బ్రహ్మము తన వాస్తవ స్వరూపమును తెలుసుకొనునో, అప్పుడు దేవమనుష్యాదివస్తుభేదములు భాసించవు.

తస్మాత్ నవిజ్ఞానమ్ ఋతే అస్తికిఞ్చిత్.. (వి.పు.2-12-43)విజ్ఞానముకంటే వేరైనది ఎప్పుడును ఎక్కడను వాస్తవముగ లేదు

జ్ఞానం విశుద్ధమివ ... (వి.పు.2-12-44)జ్ఞానరూపమగు బ్రహ్మమే వాసుదేవశబ్దవాచ్యము. నిర్వికారమైనది, తద్భిన్నమైనది ఏదియును లేదు.

సద్భావ ఏవం భవతః ...(వి.పు.2-12-46) జ్ఞానరూపధర్మమే సత్యము, తదితరమంతయు అసత్యము. ఇట్లు భాసించుటకు కారణము అవిద్య.

బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి (ముం.ఉ.3-2-9) బ్రహ్మమును తెలుసుకొనిన బ్రహ్మమే అగును.

భిద్యతే హృదయగ్రంధిః.....(ముం.2-2-9) బ్రహ్మమును తెలుసుకొనునప్పుడు హృదయమునకావరణమైన అవిద్య నశించును.

యదాహ్యేవైష... (తై.ఆ.7)బ్రహ్మమునందు ఐక్యబుద్ధిని పొందినచో సంసారభయము పోవును

నపశ్యో మృత్యుం పశ్యతి (ఛాం.7-26-2)బ్రహ్మజ్ఞాని అవిద్యను పొందడు

నపునః మృత్యవే తదేకం పశ్యతి - బ్రహ్మైక్యజ్ఞానముచేత తిరిగి అవిద్యను పొందడు.

అథ యోఽన్యాం దేవతాం ... (బృ.3-4-10)దేవతలు వేరువేరు అని ఉపాసించువాడు జ్ఞానరహితుడు.

అకృత్స్నో హ్యేషః (బృ.3-4-7)సర్వము ఆత్మయే.

తత్త్వమసి (ఛాం.6-8-7)ఆ బ్రహ్మమే నీవు

త్వం వా అహమస్మి - (జా.ఉ)నీవు నేను అను భేదము లేదు.

ఆత్మేతు ఉపగచ్ఛతి - (బ్ర.సూ.4-1-3)ఆత్మయే బ్రహ్మము.

ఈ విధముగా అనేకశ్రుతిస్మృతిపురాణవాక్యములు పరబ్రహ్మమొక్కటే సత్యమని తద్భిన్నమంతయు మిథ్యయని, ఆ బ్రహ్మమే ఆత్మ, జ్ఞానము, సత్ మొదలైన శబ్దములచే తెలుపబడుచున్నది అని పూర్వపక్షము.

కాని మనకు ప్రత్యక్షముగా ఈ వస్తుజాతమంతయు కనబడుటకు కారణము త్రాడును చూచి, పాము అనుకొనినట్లు కల్పితము. ఇటువంటి భ్రమ కలగటానికి అధిష్ఠానము అనబడు త్రాడుపై పాము అనెడి అధ్యాసము కల్పించబడుటవల్ల కలిగిన భ్రాన్తిజ్ఞానము అని గుర్తించవలెను. అదే త్రాటిని చూసి పాము అనుకొనినట్లు బ్రహ్మమును జగత్తుగా మనమందరము భ్రమిస్తున్నామన్నమాట. త్రాడును పాము కాక, త్రాడే అని జ్ఞానము కలిగిన తరువాత, త్రాడు పాము అనే భ్రాంతిజ్ఞానము ఎలా పోతుందో అదే విధంగా ఈ సర్వము బ్రహ్మమే అని జగత్తుగా కనబడడం అయథార్థజ్ఞానమేనని మనం అర్థం చేసుకొనవలెను. త్రాడు,పాములను అభేదముగా గుర్తించటానికి శాస్త్రపరిభాషలో బాధితార్థసామానాధికరణ్యమని అంటారు. అంటే, నేను భ్రమపడిన సర్పము ఈ త్రాడే అయినట్లు ఈ కనబడుతున్న జగత్తు అంతా బ్రహ్మమే అని అర్థం చేసుకొనవలెను.

సామానాధికరణ్యము అనగా, ఒక వాక్యములో ఒక పదసముదాయములో పదాలన్నింటికీ ఒకే అర్థమునకు పర్యవసించేటట్లు చెయ్యటం. దీనికే “భిన్నప్రవృత్తినిమిత్తానాం శబ్దానాం ఏకస్మిన్నర్థే వృత్తిః సామానాధికరణ్యం” అని నిర్వచిస్తారు. ఈ సామానాధికరణ్యము లో వివిధములైన రకాలున్నాయి. ఒకే వస్తువును రెండు పర్యాయపదములతో చెప్పినప్పుడు దానిని ఐక్యసామానాధికరణ్యమని అంటారు. ఉదా:: కోకిలయే పికము.

విశేషణవిశేష్యములు ఒకే వస్తువునందు పర్యవసించుట ఒకవిధమైన సామానాధికరణ్యము. నల్లకలువ, తెల్లబట్ట మొదలైనవి ఈరకమైన సామానాధికరణ్యమునకు చెందుతాయి. పైన చెప్పబడినట్లు కనబడుచున్న జగత్తే బ్రహ్మము అని చెప్పుటను అపవాదసామానాధికరణ్యము అని కూడ అంటారు. అంటే ఇక్కడ జగత్తు మిథ్య అని అర్థం చేసుకోవాలి. మిథ్య అంటే “మొదట ఉన్నట్లు భాసమానమై పిదప యథార్థమగు జ్ఞానముచేత నివర్తింపబడుట లేదా తొలగిపోవుట”. పై ఉదాహరణములో ఈ జగత్తంతా కనబడుతూ ఇదంతా అయథార్థమని తెలిసిన తరువాత ఇది జగత్తు అనే జ్ఞానము నివర్తింపబడితే అప్పుడు జగత్తుని మిథ్య అంటాము. ఇట్టి అయథార్థజ్ఞానము కలుగుటకు కారణము అవిద్య అనబడు దోషము. అవిద్య అనగా, స్వరూపతిరోధానము చేసి, అనగా, “యథార్థజ్ఞానము కలుగకుండునట్లు చేసి వివిధములైన, విచిత్రములైన విక్షేపములను అనగా – నానావస్తుభ్రమను కలిగించునది”. ఈ అవిద్య సత్ అనిగాని, అసత్ అనిగాని, నిర్వచింపరానిది. ఎందుకంటే, యథార్థజ్ఞానప్రాప్తికి ముందు అవిద్య ఉండును యథార్థజ్ఞానప్రాప్తి కలిగిన తరువాత అవిద్య ఉండదు. పైన ఉదాహరించిన శాస్త్రవాక్యాలు ఈ విషయాలనే నిరూపిస్తున్నాయి.

అయితే ప్రత్యక్షముగా భిన్నభిన్నములుగా కనబడుచున్న సమస్తప్రపంచవస్తువులను అయథార్థమని ఎట్లు విశ్వసించవలెను అని సందేహములు కలుగును. కాని ప్రత్యక్షమునందు గోచరమగు అనేకవిషయములు అయథార్థములని మనకు తెలుస్తూ ఉంటుంది. ఉదా: దీపజ్వాల ప్రత్యక్షమున ఒక్కటిగానే కనబడుతుంది. కాని యథార్థముగా ప్రతిక్షణము కొత్తక్రొత్త దీపజ్వాలలు పుట్టించబడి పూర్వజ్వాలలు నశిస్తోంటాయి. అయితే, మొదటి క్షణమున పుట్టిన దీపజ్వాల ఉత్తరక్షణమున పుట్టిన దీపజ్వాలకంటే భిన్నమైనదే కదా! ఇలాగే ముత్యపుచిప్ప వెండిగా తోచుట, జపా కుసుమము స్ఫటికమువద్ద ఉంచునపుడు స్ఫటికము ఎఱ్ఱగా కనబడుట, నీరు లేకున్నను, ఎండమావిలో నీరు కనబడుట, కొరివిని వేగముగా త్రిప్పినపుడు నిప్పుచక్రముగా కనబడుట, వేలితో నొక్కియుంచునప్పుడు ఒక చంద్రుడు ఇరువురు చంద్రులుగా కనబడుట మొదలైన సందర్భాలలోకూడా ప్రత్యక్షం అయథార్థజ్ఞానాన్ని ఇవ్వటం మనం చూస్తాం. అందువలన ప్రత్యక్షముగా తెలుసుకున్న విషయాన్ని శాస్త్రజ్ఞానముతో సమన్వయించుకొనవలసిన అవసరముంటుంది.

పైన చెప్పిన విషయాల్లో బ్రహ్మ ఒక్కటే సత్యమని, భేదభావము భ్రాన్తి అని, తెలుసుకున్నాం. కాని కొన్ని ఉపనిషద్వాక్యాలు ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే, ఋతం పిబన్తౌ సుకృతశ్చ

లోకే, గుహాం ప్రతిష్ఠే పరమే పరార్ధే ఛాయాతపౌ, మొదలైనవి జీవ బ్రహ్మలు రెండింటికీ భేదమును చెప్తాయి. ఇటువంటి శాస్త్రవాక్యాలని ఎలా అర్థం చేసుకోవాలి అని సందేహము కలుగును. దీనికి సమాధానముగా అపచ్ఛేదన్యాయమును వర్తింపజేసుకొనవలెనని పూర్వపక్షులు చెప్తారు. అపచ్ఛేదన్యాయమనగా, పూర్వము చెప్పబడిన విషయము ఉత్తరశాస్త్రమందు చెప్పబడిన విషయముచేత బాధింపబడుతుంది అంటే పూర్వము చెప్పబడిన విషయము పరిగణించనక్కరలేదన్నమాట. దీని ప్రకారము, జీవబ్రహ్మలగురించి ముందు చెప్పబడిన భేదశ్రుతులు, యః సర్వజ్ఞః సర్వవిత్, సత్యకామః సత్యసఙ్కల్పః అని పరమాత్మకు గుణములను, విశేషముల నాపాదించు వాక్యములు తరువాత చెప్పబడిన తత్త్వమసి, సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ మున్నగు ఐక్యజ్ఞానమును తెలుపు అభేదశ్రుతులు, నిర్గుణమ్, నిరఞ్జనమ్ అనుచు బ్రహ్మను నిర్విశేషమని చెప్పు వాక్యములు బాధిస్తాయి. ఏతావతా బ్రహ్మ ఒక్కటే సత్యమని, అది నిర్విశేషమని తెలుస్తున్నది. "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ", మున్నగు ఉపనిషద్వాక్యములందు సత్యము, జ్ఞానము, అనంతము బ్రహ్మకు విశేషణములు కాక స్వరూపబోధకమనియే తెలుసుకొనవలెను. అనగా, బ్రహ్మ సత్యమైనది, జ్ఞానము కలది, అనన్తమైనది అని కాక, అసత్యము కానిది, జడము కానిది, విచ్ఛేదము లేనిది అని అర్థం చేసుకోవడం వలన. ఇట్టి వాక్యాలుకూడా నిర్విశేషబ్రహ్మమునే బోధిస్తాయని తెలుస్తోంది. పుస్తకమున్న బల్ల, అన్నప్పుడు, పుస్తకము బల్లకు విశేషణమగునుకాని, పుస్తకము లేని బల్ల అన్నప్పుడు బల్ల అను వస్తువునకు విశేషణము చెప్పబడలేదుకదా! గంగలో పల్లె అన్నప్పుడు, గంగ ఒడ్డున పల్లె అని అర్థం చేసుకున్నట్లు సత్యం బ్రహ్మ అన్నపుడు కూడా, అసత్యము కానిది బ్రహ్మ అని చెప్పటంలో తప్పు లేదని పూర్వపక్షము అభిప్రాయము. ఇలా చెప్పడాన్ని లక్షణావృత్తి అని అంటారు. ఇంతకుముందు ప్రత్యక్షమునకు, శాస్త్రమునకు, విరోధము వచ్చినప్పుడు ప్రత్యక్షమును శాస్త్రముతో సమన్వయము చేసికొని అర్థం చేసుకోవాలని ఎందుకంటే ప్రత్యక్షమునందు అయథార్థజ్ఞానము సంభవమని అనుకున్నాము. ఇప్పుడు ప్రత్యక్షమును సమంగా అర్థం చేసుకుంటే శాస్త్రమునకు విరోధమే ఉండదని తెలుస్తుంది. ఘటము ఉన్నది, పటము ఉన్నది అని తెలుసుకుంటున్నప్పుడు మొదటగా 'ఉన్నది' అనిమాత్రమే తెలుస్తుంది. తరువాతి క్షణములో అది ఘటమనిగాని పటమనిగాని తెలుస్తుంది. ఎందుకంటే ఉన్నది అన్నవిషయము, అది ఘటము, లేదా పటము అన్న విషయము ఇవి రెండును ప్రథమక్షణముననే తెలుసుకొనుట సంభవము కాదు. అంటే, ప్రత్యక్షమున ముందుగా తెలిసినవిషయము ఉన్నది అని మాత్రమే. ఇదే స్వతస్సిద్ధమైనది. ఈవిషయాన్నే సదేవ అనే శ్రుతికూడా చెప్తున్నది.

భేదమను పదార్థము ఉన్నట్లు నిరూపించుటకు సాధ్యము కాదు. ఎందుకంటే భేదమనునది ఒక వస్తువుగా చెప్పలేము. ఈ భేదమనునది వస్తుధర్మమనికూడా చెప్పలేము. ఘటము, పటములకు భేదము, పటమునకు, వటమునకు భేదము ఇట్లు అనేకభేదములు కనబడుచున్నవి. కాని ఒక భేదము, మరియొక భేదము, సమానము కాక, ఆ రెండు భేదములకు మరియొక భేదము కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విధముగా, భేదము వస్తుస్వరూపము కాక, వస్తుధర్మమును కాక, అనిర్వచనీయమై అన్యోన్యాశ్రయదోషానికి దారితీస్తుంది. మన ఇల్లు పెద్దనాన్నగారింటి పక్కన, పెద్దనాన్నగారిల్లు మన ఇంటి పక్కన, అన్నట్లు ఉంటే ఏ ఇల్లు ఎక్కడుందో చెప్పటం కుదరదు గదా! ఇట్టి దోషాన్ని అన్యోన్యాశ్రయదోషమంటారు. అందువలన భేదం అనేపదాన్నికూడా, స్పష్టముగా నిర్వచించుట సాధ్యము కాదు. ఉదాహరణకు ఘటము పటముకన్న భిన్నము అని అన్నప్పుడు ఘటము తెలిసిన పిదపనే పటము భిన్నమని తెలుస్తుంది. అదే విధంగా, పటము ఘటముకంటే భిన్నమన్నపుడు పటము తెలియనిదే ఘటము తెలియదు. అలాగే ఘటము పటముకంటే భిన్నమన్నపుడు ఘటము తెలియనిదే పటము తెలియదు. ఈవిధముగా అన్యోన్యాశ్రయదోషము వస్తుంది. దీనినిబట్టి భేదము, భేదపదార్థము, మిథ్యయే అని తెలుస్తోంది.

## బ్రహ్మస్వరూపవివరణము.

బ్రహ్మము స్వతస్సిద్ధమైనది, స్వయంప్రకాశకమైనది. అనగా, సత్తామాత్రముచే (తాను ఉన్నంత మాత్రముచేతనే) స్వయముగా ప్రకాశించునది. ఇది అజడము. కుండ కనబడుచున్నది అని అన్నపుడు కనబడుట కుండప్రత్యేకత కాదు. స్వయంప్రకాశమైన జ్ఞాననిర్వాహమువలననే కుండప్రాకట్యము సిద్ధిస్తుంది. అలాగే, 'నేను సుఖముగా ఉన్నాను' అన్నప్పుడు కూడా ఆ సుఖానుభవము ఆత్మజ్ఞాననిర్వాహమే అవుతుంది. దీనినిబట్టి జ్ఞానముయొక్క స్వయంప్రకాశకత్వము అనుమానప్రమాణమువలన కూడ సాధించుట సంభవము. అనుమాన-ప్రమాణమంటే, పొగ ఉంటే నిప్పు ఉండాలికాబట్టి కొండమీద పొగ ఉండడంవల్ల నిప్పు ఉండి ఉంటుంది అని చెప్పడంలాంటిది అన్నమాట.

జ్ఞానము నిత్యమైనది అంటే దీనికి ముందులేదు, నాశముకూడ లేదు జ్ఞానము నిర్వికారమైనది. ఉత్పత్తి, నాశము, లేనందువల్ల ఉత్పత్తితోబాటు వచ్చు ఇతర భావవికారములకూడ దీనికి ఉండవు. జ్ఞానమునకు నానాత్వము లేదు. నానాత్వమునకు ఉత్పత్తికి విరుద్ధమైన అనుత్పత్తి ఉండడంవల్ల ఉత్పత్తిలేని వస్తువు ఏదియును నానాత్వము కలిగి యుండదు. జ్ఞానము సర్వవిధభేదములు లేనిది. జ్ఞానమే ఆత్మ, జ్ఞానమే బ్రహ్మము అని తెలుసుకొనవలెను.

జ్ఞాతృత్వము ఆత్మధర్మము కాదు. "అహం జానామి" నేను తెలుసుకొనుచున్నాను అన్నపుడు, ఆత్మకు జ్ఞాతృత్వమున్నట్లు తోచును కాని ఆ కర్తృత్వము అంతఃకరణమునకు చెందినది కాని ఆత్మకు చెందినది కాదు. ఎందుకంటే, గాఢనిద్రయందు, మూర్ఛయందు, అహం అను వ్యవహారము లేకున్నను, బాగుగా నిద్రపోయినాను, నన్ను నేను తెలుసుకొనలేకపోయినాను మొదలైన వాక్యములు వింటూంటాముకదా, ఇక్కడ స్వయంప్రకాశకమైన జ్ఞానము అంతఃకరణమునందు అభివ్యక్తమగుట, లేదా, అంతఃకరణమును ఆశ్రయణముగా కలుగుట సంభవమెట్లుగును అను సందేహము కలుగును. కాని సూర్యకిరణములచే ప్రకాశితమైన అరచేయి, ఆ సూర్యకిరణములకే అభివ్యక్తి లేదా ఆశ్రయముగా ఉన్నట్లు చూస్తున్నాం కదా!

ఉన్నది ఉన్నది అని చెప్పబడు ఎప్పుడూ మారకుండా ఉండేది, బ్రహ్మము, అంటే ఇప్పుడు కుర్చీగా, బల్లగా, మరునాడు కట్టెముక్కలుగా, తరువాత, బూడిదగా, ఆ పిదప, ఆ బూడిదతో చెయ్యబడిన ఇటుకగా, ఇలా అనుక్షణము వికారము చెంది, నిర్దిష్టస్వరూపములేని ఈ కనబడు పదార్థములు మిథ్యయే తప్ప బ్రహ్మము కాజాలవు. అనగా నిత్యము, శుద్ధము, బుద్ధము, అనగా స్వయంప్రకాశకము. ముక్తము అనగా భేదవాసన వాక్యార్థజ్ఞానముచే తొలగించబడినది అయిన బ్రహ్మస్వరూపమైన ఆత్మ ఒక్కటే ఉన్నది. వేదాంతవాక్యములచేత అవిద్యను పోగొట్టుకొని బ్రహ్మమగుటయే మోక్షము అనునది మహాపూర్వపక్ష సారాంశము.

# మహాసిద్ధాంతము

మహాపూర్వపక్షమునుండి ఆత్మైకత్వవిజ్ఞానము, ప్రాప్యము అయిన ఉపేయము, నిర్విశేషబ్రహ్మైక్యమని, ఉపాయములో వాక్యార్థతత్త్వజ్ఞానముచే నివర్తించునది భ్రాన్తిసిద్ధమైన మిథ్యాభూతప్రపంచభేదమని నిరూపించ బడింది. తమ మహాసిద్ధాంతములో భగవద్రామానుజులు మహాపూర్వపక్షం ఎందుకు ఆదరణీయం కాదో వివరిస్తున్నారు. పూర్వపక్షంలో మొదట శాస్త్రప్రమాణవాక్యములు ఉదాహరించి, వాటిపై తమ అభిప్రాయమును తెలిపి పిదప తమవాదమునకు ఊతముగా యుక్తులను ఇతరప్రమాణములను చూపియున్నారు. కాని మహాసిద్ధాంతములో భగవద్రామానుజులు యుక్తియుక్తముగా మహాపూర్వపక్షమునందలి విషయములను సంస్కరించి తదుపరి శాస్త్రప్రమాణవాక్యములను స్వరసముగా సమన్వయముచేసి చూపేరు. ఎందుకంటే, హఠవాదముతో తెలుపు స్వానుభవముకాక సర్వాంగీకృతమగు ప్రమాణము ఏదియును నిర్విశేషమునుకాని మిథ్యాజగత్తునుగాని బోధించదని భగవద్రామానుజుల అభిప్రాయము. ఒకవస్తువునకు ధర్మమును, ఒక ధర్మమునకు ఆశ్రయమైన పదార్థము ఉంటుందని మన అనుభవంలో తెలుస్తున్నదే. అందువలన నిర్విశేషమైన బ్రహ్మము ఒకదానికి ధర్మము కాదని, దానిలో ఏ ధర్మములు ఉండవని చెప్పితే, అది అప్రామాణికమే కాక, అట్టి బ్రహ్మము ఊహించుటకు కూడ సాధ్యముకాదు. స్వానుభవములోకూడ నాకిట్టి బ్రహ్మము అనుభవము కలిగినది అని చెప్పవలసినప్పుడు ఆ బ్రహ్మము సవిశేషమే అగును. ఏ శబ్దమైనా సవిశేషపదార్థమును బోధించుటయందే వర్తించును. అందువలన శబ్దము ఒకే పదరూపంలోకాని పదసముదాయమువలనగాని నిర్విశేషమును బోధింపదు. ఈ సందర్భంలో పూర్వపక్షమునందు ప్రత్యక్షముగా ముందుగా నిర్విశేషమైన 'ఉన్నది' అనిమాత్రమే తెలుస్తుందని, తదుపరి ఆ ఉన్నవస్తువుయొక్క విశేషములైన ఆకారలక్షణాదులు తెలుస్తాయని చెపుతారు. కాని ఒక వస్తువు ప్రథమముగా గ్రహింపబడేది దాని విశేషమును బట్టియే. అంటే, విశేషమును గ్రహించకుండా కేవలవస్తుగ్రహణము సాధ్యము కాదు. ఒక వస్తువుయొక్క ప్రత్యేకలక్షణాన్ని జాతి అంటారు. అయితే, కొంతమంది, జాతి వేరు, ఆకృతి వేరు, వ్యక్తివేరు, అని విభజిస్తారు. వాటి ప్రకారము జాతి ముఖ్యమని, ఆకృతి, వ్యక్తి అముఖ్యమని, అందువలన ఆయావ్యక్తులు నశించినా జాతిమాత్రం ఉంటుందని వారి అభిప్రాయము. కాని భగవద్రామానుజులప్రకారము ఆకృతి, జాతి, రెండును ఒకటే అనిన్నీ మొదటి చూపులోనే గ్రహింపబడతాయని స్పష్టీకరిస్తారు. ఇక్కడ ప్రథమవీక్షణంలో వస్తుమాత్రగ్రహణం కలుగుతుందని, దానిని నిర్వికల్పకమంటారని, తదుపరి ఆ వస్తువు జాత్యాదిరూపమైన అసాధారణరూపధర్మవిశిష్టముగానే గ్రహింపబడుతుందని, ఆ విశిష్టజ్ఞానము సవికల్పకమని చెప్పెడి కొందరి అభిప్రాయాలని భగవద్రామానుజులు అంగీకరించరు. ఎందుకంటే, ఒక వస్తువు, వాటి ధర్మము మొదటి వీక్షణములోనే తెలియబడతాయన్నమాట. ఈ కారణంవల్ల భేదము లేదని నిర్విశేషము సాధ్యమని చెప్పే పూర్వపక్షవాదము నిరాకరించినట్లైనది.

సర్వపదార్థములను భిన్నములు, అభిన్నములు కూడ అవుతాయని చెప్పే వారిని భేదాభేదవాదులు అంటారు. వీరి ప్రకారము ఒక పదార్థమునకు ఒకరూపమున భేదమును, ఒక రూపమున అభేదమును తెలుపవచ్చును. సర్వమును భేదములు అభేదములు కూడ అగునని వీరి మతము. ఉదాహరణమునకు సముద్రమునందలి నీరు తేటముగా కెరటములపై నురుగుగా కూడ కనబడును. మరల ఆ కెరటముల నురుగు కూడ సముద్రపు నీరుగా మారిపోవును. సముద్రపునీరుగా ఉన్నపుడు అభేదమును, సముద్రపునీరు కెరటముల నురుగుగా ఉన్నపుడు భేదమును మనము చూస్తున్నాము. అలాగే ఒక కుండలో ఆకాశము ప్రతిఫలించినప్పుడు, భిన్నత్వము కానవచ్చును.

కాని ఆ కుండ పగిలిపోయిన తరువాత, భిన్నత్వముండదు. ఈ రకముగా భేదాభేదములు, సంభవమని వీరి వాదము. భగవద్రామానుజులు ఈ వాదము సరి కాదని, మన సిద్ధాంతంలో వివరిస్తారు. ఎందుకంటే, సముద్రపునీరు దాని కెరటముల స్వభావము, కారణము, ప్రయోజనము వేరువేరవటంవల్ల అక్కడ భిన్నత్వము తెలుస్తున్నది. అలాగే కుండలో గాలి పరిమాణముగాని, దానిలో ఉండే ధూళికణాలుగాని బయటనుండే గాలి పరిమాణానికీ, ధూళికణాలకు వేరుగా ఉంటాయి. అందువలన భేదము అనేది, ప్రత్యక్షములో ఎప్పుడూ సంభవమే. అందువలననే గుఱ్ఱమును తెమ్మన్నప్పుడు తద్భిన్నమైన గాడిదను తీసుకువస్తే హాస్యాస్పదమే అవుతుంది. అందువల్ల అన్నివస్తువులు విశేషణములకు ఆశ్రయములే. ఇచ్చట మనము ఒక గంధమును గ్రహించినపుడు, దాని ఆశ్రయము, గ్రహించముకదా అని సంశయము. కాని, ఆ గంధము పూలనుండియా పెంటనుండియా అను విషయము ఆ గంధమునుండి గ్రహించవచ్చును. అంటే, ఆ గంధమువలన తదాశ్రయవస్తువు ఎట్టిదో కూడ గ్రహించబడుతున్నది అన్నమాట. పూర్వపక్షమునందు ఈ రోజు కుర్చీ, మరునాడు కఱ్ఱముక్కలు, ఆ తరువాత బూడిద, అటుపిమ్మట ఇటుకవలె మారుతున్నటువంటి స్పష్టమైన రూపములేని ఈ పదార్థములన్నీ అపరమార్థములు అనగా మిథ్య అని చెప్పబడింది. కాని, ఒకప్రదేశమునందు, ఒకకాలములో, ఒకస్వరూపముతోనున్న పదార్థము; వేరొక ప్రదేశమునందు, వేరొక కాలమునందు వేరొక ప్రయోజనముకలిగి, వేరైన స్వరూపలక్షణములతో ఉండుటవలన ఆ పదార్థము అపరమార్థమని చెప్పుట సమంజసము కాదు. అదే విధముగా, పాము,త్రాడు ఉదాహరణములో ముందుగా పాము గోచరించి, తరువాత త్రాడు కనబడినంతమాత్రమున పాము మిథ్య అని చెప్పలేము. ఎందుకంటే, పాము అక్కడ అప్పుడు ఉండకపోవచ్చు కాని పాము వేరొకప్రదేశమున, వేరొక కాలములో ఉండవచ్చును గదా! అందువలన పాము అనబడు వస్తువే అపరమార్థము, అనగా లేనిది అని చెప్పుట తప్పు. ఇక్కడ, జగత్తు మిథ్య అని చెప్పినప్పుడు, మిథ్యాత్వము తాను మిథ్యయై, ఇతరములకు ముఖ్యార్థము తెలుపుననుట కుదరదు. మిథ్యాత్వమే మిథ్య అయినపుడు, జగత్తు సత్యమై తీరును గదా! కనబడునదంతయు మిథ్య అని చెప్పుట తప్పు.

పూర్వపక్షమునందు, బ్రహ్మము జ్ఞానరూపము, స్వయంప్రకాశకము, కాని జ్ఞానగమ్యము – అనగా, జ్ఞానముచే తెలుపబడునది– కాదు అని చెప్పబడినది. అందువలన ఏదేన దృశ్యమైతే, లేదా తెలుసుకొనబడితే, అది మిథ్య అనియే, వారి అభిప్రాయము. ఇందులకు అద్రేశ్యమ్, అగ్రాహ్యమ్, అను శ్రుతిప్రమాణమును వారు ఉదాహరించారు. కాని, ఆత్మావా అరే ద్రష్టవ్యః, శ్రోతవ్యః మొదలైన , శ్రుతివాక్యములు దృశ్యత్వాన్ని తెలుపుతాయి. ఇందులకు పూర్వపక్షమునందు ఈ వాక్యములు అపచ్ఛేదన్యాయము ప్రకారము ప్రమాణము కాదని వాదిస్తారు. కాని ఈ వాదము అసమంజసము. బ్రహ్మము ఉపాసనాదృశ్యమని అనేకశ్రుతులు చెప్పియుండుటచేత, బ్రహ్మముకూడ నిత్యమగుటచేత దృశ్యములన్నియు మిథ్యయే అను వాదమును బట్టి బ్రహ్మము కూడ మిథ్య అనే చెప్పవలసి వస్తోంది. అంటే, ఇది హాస్యాస్పదము గదా!

జ్ఞానము సర్వదా స్వయంప్రకాశకము కాదు, పూర్వపక్షమునందు జ్ఞానము స్వయంప్రకాశకమని చెప్పబడినది. జ్ఞానము స్వయంప్రకాశమను విషయము అంగీకరించబడునదే. కాని బాహ్యవిషయములను ప్రకాశించజేయనపుడు, జ్ఞానములు స్వయంప్రకాశములు కావు. స్వయంప్రకాశం అంటే, మనము ఇంతకుముందు అనుకున్నట్లు తనసత్తచేత, తాను ప్రకాశితమౌతూ, ఇతరములను ప్రకాశింపజేయుట. కాని బాహ్యవిషయమును ప్రకాశింపజేయనపుడు ఈ స్వయంప్రకాశత్వము సంపూర్ణముగా సిద్ధించదు.

ఒక జ్ఞానము, మరొక జ్ఞానముచేత గ్రహింపబడినచో, అది జ్ఞానమే కాదు. ఎందుకంటే, జ్ఞానము జ్ఞాత కాదు అను పూర్వపక్షవాదముకూడ సరికాదు. ఒక ఆచార్యునివద్ద శిష్యుడు తమ గ్రహణముతో ఆచార్యులవద్ద జ్ఞానమును పొందుట, చూస్తున్నాము కదా!

జ్ఞానమునకు ఉత్పత్తి లేదు అనుట సరికాదు. జ్ఞానమునకు ఆశ్రయము ఆత్మ. కాని, జడపదార్థమైన అంతఃకరణము కాదు. అన్తఃకరణమున జ్ఞానము ఆశ్రయించుటగాని ప్రతిఫలించుటగాని జరుగదు. ఆత్మయందుండు జ్ఞానము ద్రవ్యమే గాని గుణము కాదు. దీనిని ధర్మిజ్ఞానమంటారు. ఆత్మనుండి అంతఃకరణముద్వారా ప్రసరించు, జ్ఞానమును ధర్మభూతజ్ఞానమని అంటారు. ఈ ధర్మభూతజ్ఞానమునకు సంకోచవికాసములు కలుగుతూ ఉంటాయి. అలాగే ఒకరికి గణితశాస్త్రజ్ఞానము ముందుగా ఉండకపోవచ్చు. వేరొకరి జ్ఞానమునుండి అట్టి గణితశాస్త్రజ్ఞానము, అతనికి సంక్రమించవచ్చు. ఈ రకంగా, జ్ఞానము, ఒకరినుండి వేరొకరికి కలుగుట సాధ్యము కనుక, అన్ని జ్ఞానములకు అన్ని సందర్భములలోను ఉత్పత్తి ఉండదని చెప్పలేము, జ్ఞానము కలుగుటకు తత్సంకోచమునకు, అనేక హేతువులు ఉండవచ్చు. నిద్రపోవుచున్నప్పుడుగాని, స్వప్నావస్థలోగాని, మూర్ఛవచ్చినప్పుడు గాని, మత్తుపదార్థము సేవించినప్పుడుగాని, పిచ్చి కలిగినప్పుడు గాని, ఆత్మనుండి జ్ఞానప్రసారములు వేరువేరుగా ఉంటాయి. ఉదాహరణమునకు గాఢనిద్రావస్థయందు ఇంద్రియములద్వారా ధర్మభూతజ్ఞానప్రసారము జరుగదు. ఈ విధముగా ధర్మభూతజ్ఞానమునకు సంకోచవికాసములు కలగవచ్చును.

అదే విధముగా ఘటమును తెలుపు జ్ఞానము ఘటజ్ఞానమని, పటమును తెలుపు జ్ఞానము పటజ్ఞానమని చెప్పుటవలన జ్ఞానమునకు నానాత్వము సంభవము.

జ్ఞానము నిర్వికారము కాదు. జ్ఞానమునకు ఉత్పత్తిలేదుగనుక వికారములు కూడ ఉండవని పూర్వపక్షము అభిప్రాయము. అదే పూర్వపక్షమందు, అవిద్య, మాయ, మున్నగు అనుత్పన్నపదార్థములజ్ఞానముకూడ చెప్పబడినది. అనుత్పన్నమై భావరూపమైన ఆ అవిద్యకు వేరొకతత్త్వజ్ఞానముచే వినాశముకూడ చెప్పబడినది. ఇట్లు మిథ్యాజ్ఞానము అవిద్య, వినాశమునందుట పూర్వపక్షమున చూసి యున్నాము. అంతే కాక అవిద్య, వాక్యార్థజ్ఞానము, అని రెండు జ్ఞానములు ఉండుట, ఒకటి వేరొకదానిచే వికారమును, నాశమును పొందుట చూచియున్నాము. ఇట్లు పూర్వపక్షవాదమునుండే జ్ఞానవికారవినాశములు చెప్పబడి ఉన్నాయి. అంతేకాక, రెండు జ్ఞానముల సంయోగము చేత మూడవ జ్ఞానము కలుగవచ్చు. ఉదాహరణకు సంగీతజ్ఞానము, సాహిత్యజ్ఞానము, కలసి వేరొక జ్ఞానము కలుగవచ్చును. పూర్వపక్షప్రకారము జ్ఞానమునకు ఆశ్రయము ఉండదు. కాని నేను ఈయనను తెలుసుకున్నాను అని చెప్పినప్పుడు నేను అని చెప్పబడు ఆత్మ జ్ఞానమునకు ఆశ్రయమౌతుంది. తెలుసుకొనుట, అనునది క్రియ అవటంవల్ల ఏదైనా క్రియకు ప్రారంభము, అంతము ఉంటాయి కాబట్టి జ్ఞానమునకు నిత్యత్వభంగము కలుగునని సందేహింపనక్కరలేదు. ఎందుకంటే, జ్ఞానం 'నేను'లో అనగా ఆత్మని ఆశ్రయించి ఎల్లప్పుడూ ఉంటుంది. ఇదే కారణంవల్ల ఇంతకుముందు చూడబడిన వ్యక్తి, మరల ఇప్పుడు కనబడితే ఆ వ్యక్తిని గురించిన జ్ఞానము మరల స్ఫురించుటకూడ ఆత్మను ఆశ్రయించియున్న జ్ఞానముయొక్క నిర్వాహమే. ఈ సందర్భంలో ఎనిమిది శ్లోకములతో భగవద్రామానుజులు అహమర్థమైన జ్ఞాతయే ప్రత్యక్పదార్థమైన ఆత్మ అనియు, కేవలజ్ఞానము ప్రత్యక్పదార్థమనుట కుదరకపోవుటయు, కేవలజ్ఞానము ఆత్మకాదనియు, కనుక జ్ఞానమే ఆత్మ అను పూర్వపక్షమున జ్ఞానమే ఆత్మ అనుటకు చెప్పబడిన కారణములన్నియును చెల్లవని ఎనిమిది శ్లోకములలో వివరించేరు. ఆ కారికల(శ్లోకాల)ను క్రింద ఉట్టంకించుచున్నాము-

శ్లో॥ "అహమర్థో న చేదాత్మా ప్రత్యక్త్వం నాత్మనో భవేత్,
అహం బుద్ధ్యా పరాగర్థాత్ ప్రత్యగర్థో హి భిద్యతే. 1

శ్లో॥ నిరస్తాఖిల దుఃఖో-హమ్ అనన్తానన్దభాక్ స్వరాట్,
భవేయమితి మోక్షార్థీ శ్రవణాదౌ ప్రవర్తతే. 2

శ్లో॥ అహ మర్థ వినాశ శ్చేత్ మోక్ష ఇత్యధ్యవస్యతి,
అపసర్పేదసౌ మోక్ష కథా ప్రస్తావ గన్ధతః. 3

శ్లో॥ మయి నష్టే అపి మత్తో అన్యా కాచిత్ జ్ఞప్తిరవస్థితా,
ఇతి తత్ప్రాప్తయే యత్నః కస్యాపి న భవిష్యతి. 4

శ్లో॥ స్వసమ్బన్ధితయా హ్యస్యాః సత్తా విజ్ఞప్తితాది చ,
స్వసమ్బన్ధ వియోగే తు జ్ఞప్తిరేవ న సిద్ధ్యతి. 5

శ్లో॥ ఛేత్తుశ్ఛేద్యస్య చాభావే ఛేదనాదేః అసిద్ధివత్,
అతో అహమర్థో జ్ఞాతైవ ప్రత్యగాత్మేతి నిశ్చితమ్. 6

శ్లో॥ 'విజ్ఞాతారమరే కేన', 'జానాత్యేవే'తి చ శ్రుతిః ।
ఏతద్యోవేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి చ స్మృతిః॥ 7

శ్లో.॥ నాత్మాశ్రుతేరిత్యారభ్య సూత్రకారోపి వక్ష్యతి ।
జ్ఞోత ఏవేత్యతో నాత్మా జ్ఞప్తిమాత్రమితి స్థితిమ్ ॥ 8.

అహంపదమునకు అర్థమైన జ్ఞాతృత్వముగల వ్యక్తి ఆత్మ కాని యెడల ఆత్మకు ప్రత్యక్పదవాచ్యత్వమే లేదనవచ్చును ప్రత్యక్పదార్థము పరాక్పదార్థమునకంటె అహం అను జ్ఞానమునుబట్టి వేరైనది.

1. నేను వీనిని తెలుసుకుంటిని అని అన్నప్పుడు ఇది అని చెప్పబడినదంతయు పరాక్పదార్థమని అది తెలిసికొనబడుటచే జడమని, స్వయంప్రకాశకమైనది జ్ఞానముమాత్రమే గనుక నేను అని చెప్పబడిన ఆత్మయు, దీనిని అని చెప్పబడిన పదార్థములన్నియు పరాక్పదార్థములని పూర్వపక్షము అభిప్రాయము. కాని అది సరికాదు. జ్ఞానము స్వశబ్దవాచ్యము కాదు. ఆత్మయే స్వశబ్దవాచ్యము. తనకు తాను ప్రకాశింపజేసికొనుట ప్రత్యక్పదార్థలక్షణముగనుక ఇది ఆత్మకే, అనగా అహమునకే చెందుతుంది. పరాక్పదార్థములన్నియు స్వేతరమైన ఆత్మకొరకు భాసించినవి. ఇందువలన అహంశబ్దవాచ్యము కాని జ్ఞానము ఆత్మకాదని స్పష్టమైంది.

2,3. నేను అనెడు ఆత్మ సర్వదుఃఖములను తొలగించుకొని పరిపూర్ణానందమును పొంది ముక్తుడను కాగలను అను అపేక్షతో మోక్షమును కోరి వేదాంతశ్రవణాదులయందు ప్రవర్తించును. అట్టి ఆత్మ అహం అను ఆత్మయొక్క వినాశమే మోక్షమని తెలుసుకొనినయెడల మోక్షప్రసక్తి యొక్క వాసనతోనే పక్కకు పోవును.

ఈ శ్లోకాల్లో నేను అనబడే ఆత్మవినాశమే మోక్షమని చెప్పితే ఎవడును కూడ అది వినటానికి దగ్గరకు కూడ రాడు. అని పరిహసిస్తున్నారు రామానుజులు.

4. నేను నశించిపోయినను నాకంటె వేరుగా ఒక నిర్విశేషచిన్మాత్రము ఉండును అంటే ఆ జ్ఞానమునకు ఎవరును ప్రయత్నించరు.

5. ఆ కేవలజ్ఞానమునకు ఉనికిగాని, విషయప్రకాశకత్వముగాని, ఆత్మకు చెందినదిగనే కలుగును గదా! అట్టి నేను అనబడే ఆత్మతో సంబంధమే తొలగిపోయినపుడు జ్ఞానము ఉండటానికి అవకాశమే లేదు (ఆశ్రయమే లేదు గనుక).

6. ఛేదించు పురుషుడును, ఛేదించబడు వస్తువును లేనపుడు ఛేదనమను క్రియే ఉండనట్లు ఇంతకుముందు చెప్పినట్లు అట్టి జ్ఞానముండుటకు అవకాశము లేదు కాబట్టి జ్ఞాతయు, నేను అనియు, ప్రత్యక్కనియు చెప్పబడు ఆత్మయే ఉంటుంది. కాని నశించదు.

7. విజ్ఞాత అయిన ఆత్మను గురించి తెలిసికొనుటకు మరొక సాధనమేమున్నది? అనగా ఆత్మయే స్వయంప్రకాశకమైన జ్ఞాత గనుక, ప్రమాణాంతరము అవసరము లేదని భావము. అటులనే మోక్షదశలోకూడ ఈ ఆత్మ జ్ఞాతృత్వమును కలిగే ఉంటుందని బృహదారణ్యకోపనిషద్వాక్యము.

8. బ్రహ్మసూత్రకారుడైన వేదవ్యాసుడే ద్వితీయాధ్యాయంలో నాత్మా శ్రుతేః అనుచు ఆత్మ నిత్యమని జ్ఞోత ఏవ అనగా జ్ఞాతృత్వము కలవాడని వివరించి యున్నాడు. ఇటులనే భగవద్గీతలో ఆత్మకు క్షేత్రస్వరూపమునెరిగిన క్షేత్రజ్ఞుడని క్షేత్రక్షేత్రవిభాగయోగములో చెప్పబడినది. లోకవ్యవహారములోకూడ నేను తెలిసికొనుచున్నాను అని చెప్పినప్పుడు 'నేను' అని చెప్పబడు ఆత్మకు ప్రత్యక్త్వమే చెప్పబడుచున్నది. కనుక కేవలజ్ఞానము ఆత్మకాదనియు, శ్రుతిస్మృతిసూత్రప్రామాణ్యమునుబట్టి, ప్రత్యక్షలోకవ్యవహారమునుబట్టి 'జ్ఞాతృత్వము కలదియే నేను అని చెప్పబడు ఆత్మ' అని భగవద్రామానుజులు ఈ ఎనిమిది శ్లోకాల్లో వివరించేరు.

నేను అని చెప్పబడు ఆత్మ దీపమువలె స్వయంప్రకాశస్వరూపమేకాని అన్యాధీనప్రకాశము కాదు. దీపమునకు దీపము ప్రభ ఉన్నట్లు ఆత్మకుకూడ ధర్మిజ్ఞానము ధర్మభూతజ్ఞానము ఉంటాయని తెలుసుకొనవలెను. ఈ విషయాన్ని శ్రుతులలో చాలాచోట్ల చూస్తాం. యథా సైంధవఘనః అనన్తరో అబాహ్యః కృత్స్నో రసఘన ఏవ", "ఏవం వా అరే అయమాత్మా అనన్తరో అబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ-(బృ. 6-5-13) అంటే ఎలా అయితే ఉప్పుగడ్డ లోపల. పైన, మధ్యనీ అంతటా కూడా ఉప్పదనంతో ఉంటుందో, అదే విధంగా ఈ ఆత్మ విజ్ఞానంతో నిండి ఉంటాడు. "అత్రాయం పురుషః స్వయం జ్యోతిర్భవతి" (బృ. 6-3-9)స్వప్నావస్థలోకూడ ఈ ఆత్మ స్వయంప్రకాశమే. "న విజ్ఞాతుః విజ్ఞాతేః విపరిలోపో విద్యతే" (బృ. 6-3-30) విజ్ఞాత అయిన ఆత్మకు విజ్ఞానమునకు లోపము ఎంతమాత్రమును లేదు. "అథ యో వేదేనం జిఘ్రాణీతి స ఆత్మా" (ఛాం. 8-12-5)ఎవరైతే నేను వాసన చూస్తున్నానని తెలుసుకుంటాడో అదే ఆత్మ; ఇలాగే కొన్ని చోట్ల జ్ఞానం ఆత్మకి గుణమని కూడా చెప్పేరు. కతమ ఆత్మా యోయం విజ్ఞానమయః, ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః (బృ6-3-3)- హృదయంలో ఉన్నది, ప్రాణంమధ్యలో ఉన్నది, విజ్ఞానమనే గుణము కలది, స్వయంప్రకాశకత్వము కలిగినది ఆత్మ. "ఏష హి ద్రష్టా స్ప్రష్టా శ్రోతా రసయితా, ఘ్రాతా, మన్తా, బోద్ధా, కర్తా, విజ్ఞానాత్మా పురుషః" (ప్ర. 4-9)ఈ ఆత్మయే చూచునది, స్పృశించునది, వినునది, ఆస్వాదించునది, వాసనచూచునది, మననము చేయునది, తెలిసికొనేది, చేయునది, ఇదే జ్ఞానస్వరూపుడైన పురుషుడు. "విజ్ఞాతారమరే కేన విజానీయాత కేనం కంపశ్యతి" (బృ. 4-4-14)స్వయంప్రకాశకమైన ఆత్మయే జ్ఞాత అయినందున ఆత్మస్వరూపజ్ఞానమునకై ఇతరాపేక్ష లేదు. జానాత్యేవాయం పురుషః- (బృ. 6-3-30)మోక్షదశలో కూడ ఆత్మ జ్ఞాతయే. "న పశ్యో మృత్యుం పశ్యతి" (ఛాం. 7-26-2)- ఆత్మజ్ఞానముకలిగినచో, మృత్యుశబ్దవాచ్యమైన సంసారము ఉండదు. రోగదుఃఖాదులకూడ

ఉండవు. "స ఉత్తమః పురుషః...(ఛాం. 8-12-3) పరమాత్మకు చెందిన ఆత్మ సంసారమును తలుచుకొనకుండ పరమాత్మను పొందును. "ఏవమేవాస్య పరిద్రష్టుః..." (ప్ర. 6-5)ఆత్మయొక్క పదహారు కళలు పరమాత్మను పొందిన తరువాత పోతాయి. కాని జ్ఞాతృత్వము స్వాభావికముగనుక అది పోదు. "తస్మాద్వా ఏతస్మాద్వా... (తై. ఆ. 1)మనోమయకోశముకంటే వేరై, దాని లోపలనుండునది విజ్ఞానముతో నిండిన ఆత్మ. ఈ ప్రమాణము లన్నియు ఆత్మ జ్ఞానమునకు ఆశ్రయమనియు, జ్ఞానము గుణముగా గలిగినదని, చెప్పుతున్నాయి. ఇంతకు ముందు పూర్వపక్షములో నేను లావుగా ఉన్నాను, అన్నప్పుడు లావుతనము, నేను అను ఆత్మకు చెందనట్లే, ఆత్మ నేను తెలిసికొనుచున్నాను అను లోకవ్యవహారవాక్యములో జ్ఞాతృత్వము ఆత్మకు చెందదని పూర్వపక్షవాదన. అందువలన జ్ఞాతృత్వము అంతఃకరణమునకు చెందినది. జ్ఞానత్వము - తెలిసికొనుట క్రియ కనుక పరాక్కగును. అని పూర్వపక్షవాదము. కాని ఇది సరి కాదు జ్ఞాతృత్వము జ్ఞానక్రియాశ్రయత్వము కాదు. అనగా, జ్ఞానము అనునది గుణము. తదాశ్రయమగుటయే జ్ఞాతృత్వము. ఆత్మ జ్ఞానాశ్రయమౌతుందికాని క్రియాశ్రయమవదు. నా జ్ఞానము పోయింది అన్నప్పుడు, ధర్మభూతజ్ఞానప్రసారమునందుగల వ్యాకోచసంకోచాల ప్రభావమువలన జ్ఞానము నష్టమగుటకాని వికారము చెందుట కాని జరగవచ్చు. కాని జ్ఞానరూపమైన ఆత్మ, తద్ధర్మమైన జ్ఞానము కూడ నిత్యములే. ఇక్కడ జ్ఞానమునకు ఆశ్రయముగా కాని దాని ఛాయ పడుటగాని, అంతఃకరణానికి సంభవమౌతుందా అని సంశయము. కాని జడపదార్థమైన అంతఃకరణమునందు జ్ఞానము ఉండుటగాని, లేదా, జ్ఞానసంపర్కము కలుగుటగాని జరగదు. ఇక్కడ సంపర్కము ఛాయాపత్తివలన కాని సంవహనమువలన కాని సంశ్లేషమువలనకాని జరుగుగకు వికల్పములు పరిశీలింపబడుచున్నవి. ఒకదాని ధర్మము రెండవదానిలో కలుగుట, ఛాయాపత్తి అనబడును. (జపాకుసుమములోని ఎఱ్ఱదనము స్ఫటికములో కనబడుట). సంవహనమనగా, ఒక ఇనుపగొట్టము యొక్క ఒకపక్క వేడి రెండవపక్కకు ప్రవహించుట. ఇక్కడ ఇనుపకణములు కదలిక లేకుండ, వేడిమాత్రమే ప్రసరించును. సంశ్లేషమునందు అట్లుకాక, సముద్రతీరమున ఒక కట్టెపుల్లను పాతినప్పుడు ఆ కట్టెపుల్లలో సముద్రమునుండి ఉప్పునీటి కణములు చేరటం వల్ల ఆ కట్టెపుల్లకు ఉప్పదనము సంక్రమిస్తుంది. దీనిని సంశ్లేషమని అంటారు. కాని జడపదార్థమైన అంతఃకరణమునకు జ్ఞానము వచ్చి చేరుట ఏవిధముగాను సంభవము కాదు. అదియును గాక, జ్ఞాన జ్ఞాతృత్వములు అపృథక్సిద్ధములు. విడదీయరానివి. అందువలన జ్ఞానము, జ్ఞాతృత్వము ఆత్మకే వర్తిస్తాయి తప్ప అంతఃకరణానికి వర్తించవు. అద్దమునందు ముఖము అభివ్యక్తమైనట్లు జ్ఞానము అంతఃకరణమునందు అభివ్యక్తమగుట సంభవమా అని మఱియొక సంశయము. కాని స్వయంప్రకాశకమైన ఆత్మయొక్క జ్ఞానము మరొకదానిచే ప్రకాశింపజేయబడుట, అందులను జడపదార్థమైన అంతఃకరణమునందు అభివ్యక్తమగుట అసమంజసము. చల్లారిన బొగ్గుకణికతో సూర్యుడిని ఎలా ప్రకాశింపచేయ సాధ్యముకాదో, జడమైన అంతఃకరణము స్వయంప్రకాశమైన జ్ఞానాత్మను ప్రకాశింప(తెలియ)చేయలేదు.

పూర్వపక్షమందు జ్ఞానము అజడముగనుక, ఆత్మకూడ అజడము గనుక జ్ఞానమే ఆత్మ అను అనుమానప్రమాణముచే నిరూపించబడి యున్నది. ఇక్కడ అజడము అనగా, తాను ఉన్నంతమాత్రముచే ప్రకాశితమగుట. అట్లైనచో దీపము మొదలైనవికూడ ఆత్మలే అవాలి. అట్లు కుదరదు కదా! అంతే కాక,అజడము అంటే తానున్న సమయంలో ప్రకాశము లేకుండ ఉండకూడదు కాని కొన్ని సమయములలో జ్ఞానప్రకాశము లేకుండుట లోకవ్యవహారములో మనం చూస్తూంటాము. ఇది పూర్వపక్షవాదమునకు మరియొక లోపము. పూర్వపక్షమునందు జ్ఞానము విషయశూన్యమైనది, ఆశ్రయము లేనిది, భ్రాన్తిచేత జ్ఞాతృత్వముగలదిగా కనబడుతుంది

అని చెప్పుకున్నాం. దీనికి ఉదాహరణముగా ముత్యపుచిప్ప వెండివలె కనబడుటను ఉదాహరణముగా చెప్పేరు. అంటే, ఇక్కడ ముత్యపుచిప్ప జ్ఞానము, వెండి నేను అన్న ఆత్మ అన్నమాట. కాని ముత్యపుచిప్ప ఉదాహరణలో భ్రాన్తిపోయినప్పుడు అధ్యాసమైన వెండి కనబడకుండ, అధిష్ఠానమైన ముత్యపుచిప్ప తెలుస్తూంటుంది. కాని జ్ఞానము, ఆత్మ సందర్భంలో జ్ఞానము ఆత్మకు విశేషణమైనందువలన ఆత్మ లేకుండిన జ్ఞానముకూడ ఉండదు. అందువలన ముత్యపుచిప్ప అనుమానప్రమాణముతో జ్ఞానమే ఆత్మ అని సాధించలేము. క్రియకు ముందువెనకలు ఉంటాయికాబట్టి కర్తృత్వము కాలముచేత పరిమితమైనందున, జ్ఞానమునకు కర్తృత్వ, భోక్తృత్వములు ఉండవని పూర్వపక్షము. కాని అహం జానామి – నేను తెలుసుకొనుచున్నాను, నేను ధ్యానము చేస్తున్నాను, అని చెప్పబడు లోకవ్యవహారమునందు జ్ఞానాశ్రయమైన ఆత్మకు కర్తృత్వమును అంగీకరించక తప్పదు. కర్తా శాస్త్రార్థవత్వాత్ మున్నగు బ్రహ్మసూత్రములలోగాని, స్వతః స్వకృతభుక్ పుమాన్ మొదలైన వాక్యములలోకాని ఈ విషయమే చెప్పబడినది. నిద్రాసమయములో ఆత్మ ఉండదు గనుక, ఆత్మ నిత్యత్వమునకు భంగము కలుగుటవలన ఆత్మ జ్ఞానము కానేరదు అని పూర్వపక్షులు అంటారు. కాని, నిద్రలోకూడ ఆత్మయొక్క అస్తిత్వ,నిత్యత్వములకు భంగము లేదు. కేవలము ధర్మభూతజ్ఞానప్రసారమునకు అంతరాయముగాని, సంకోచాదులుగాని కలుగవచ్చును అందువలననే నిద్రనుండి మేల్కొనినప్పుడు నేను సుఖముగా నిద్రించితిని అని అంటాం. అంటే నిద్రలోకూడ నేను అనబడే ఆత్మ ఉన్నదన్నమాట. అయితే, నిద్రనుండి లేచినతరువాత, నిద్రలో నాకేమియు తెలియలేదు అని అంటాం కదా! మరి అపుడు ఆత్మయందు జ్ఞానము లేనట్లేనా? అను ప్రశ్నకు ఇంతకుముందు అనుకున్నట్లుగా, ధర్మభూతజ్ఞానప్రసారమునకు కలుగు మార్పులే కారణము. నాకేమియు తెలియలేదు అన్నప్పుడు, ధర్మభూతజ్ఞానప్రసారము ఇంద్రియములద్వారా కలుగనందున పరిసరముల విషయవైశద్యము కలుగదు. కనుకనే లోకవ్యవహారమున నాకేమియు తెలియలేదు అని అనుట. పూర్వపక్షమునందు కలలో వస్తువులను అయథార్థములను చెప్పి, దానిద్వారా అనుమానప్రమాణముచేత జగత్తుకూడ అయథార్థమని సాధించటానికి ప్రయత్నంచేస్తారు. కాని భగవద్రామానుజులు కలలయందలి జ్ఞానముకూడ యథార్థజ్ఞానమే అని చెప్తారు. తానుమాత్రమే అనుభవించవలసిన కర్మఫలాలు తనచేత పరమాత్మ కలలయందు అనుభవింపచేస్తాడు. న తత్ర రథాః, మొదలైన శ్రుతివాక్యములు ఈ విషయాన్నే చెప్తాయి. పూర్వపక్షములో నిద్రాసమయమున, జ్ఞానరూపాత్మ కేవలసాక్షిరూపమని చెపుతారు. ఇదికూడ, అసమ్మతమే. లోకమునకాని శాస్త్రములకాని సాక్షిపదము జ్ఞానముకల జ్ఞాతనే బోధించునుగాని, కేవలజ్ఞానమును బోధించదు. అందువలన జ్ఞానము జ్ఞానాశ్రయముతో కలసియే ఉండక తప్పదు. మోక్షదశలో నేను అను ఆత్మకు, దేహసంబంధము అంతటితో తొలగిపోయినందున నిర్విశేషచైతన్యమే ఉంటుందను పూర్వపక్షవాదము కూడ తప్పు. భగవద్రామానుజులు ఇంతకుముందు చెప్పినట్లు మోక్షదశలో నేను అనేదే ఉండకపోతే అట్టిమోక్షము నాకెందుకు? మోక్షసమయమందు, ముక్తపురుషుడు పరమాత్మను అనుభవిస్తూ ఉంటాడని చెప్పబడియున్నది. (సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా) అందువలన, మోక్షసమయములోకూడ నేను అనబడు ఆత్మ ఉంటుంది. నిద్రలోకూడ ఆత్మ పరమాత్మను చేరి యుంటుంది. అని శ్రుతిప్రోక్తము. కనుక, నిద్రలోకూడ ఆత్మ ఉంటుంది.

పూర్వపక్షములో ప్రత్యక్షప్రమాణము దుర్బలమనీ, అందుచేత శాస్త్రప్రమాణములచేత అన్వయము చేసుకొనాలని, ప్రత్యక్షమునందు భాసించు సమస్తజగత్తునకు కారణము భేదవాసనాసంజ్ఞిత అని తెలుసుకొన్నాము. కాని ఇట్లు చెప్పుటకు శాస్త్రమునందు ప్రమాణమేమియు లేదు. అంతేకాక, శాస్త్రమును తెలుసుకొనిన భేదవాసన పోతుంది, భేదవాసన దోషమని తెలిసినతరువాత, శాస్త్రప్రామాణ్యత తెలుస్తుంది అని అంటే, మా ఇంటి విలాసం

తెలియాలంటే, మా పెద్దనాన్నగారి ఇంటి విలాసం తెలియాలి. అని అన్నట్లే. త్రాడు, పాము అన్న ఉదాహరణలో పాము లేదు, త్రాడు మాత్రమే ఉన్నదన్న విషయము, ఆ పదార్థము కదలదు, కరవదు అని చూసి నిర్ణయించుకున్న తరువాత కలుగుతుంది అంటే కేవల శ్రవణం వలనకాక, యథార్థమైన ప్రత్యక్షజ్ఞానంవలన కలుగుతుంది. అంటే, ప్రత్యక్షప్రమాణము మరొక యధార్థమైన ప్రత్యక్షప్రమాణముచేత త్రోసిరాజనబడుతోంది. కాని కేవలశ్రవణజ్ఞానమువలన కాదు. ఎందుకంటే, అది పాముకాదు అని చెప్పినవాడు అవ్యవస్థితచిత్తుడో ఇంద్రియలోపము కలవాడో కావచ్చును గదా! అందుచే మనకు ప్రత్యక్షము దుర్బలమని, శాస్త్రము ప్రబలమని తెలుపుటకు నిర్దుష్టప్రమాణమేమియు లేదు.

యథార్థజ్ఞానమును తెలుపుటకు, వేరొక వాక్యార్థజన్యజ్ఞానమును పరిగణించినపుడు రెండు జ్ఞానములు ఉంటాయి కాబట్టి అద్వైతభంగము కలుగునను వాదమునకు సమాధానముగా వ్యావహారికమందు వాక్యార్థజన్యజ్ఞానము పరిగణిస్తామని పారమార్థికదశయందు ఇట్టి జ్ఞానముండదని పూర్వపక్షి చెప్తాడు. అంటే, శాస్త్రములచేత మొదట అనిశ్చితమైన జ్ఞానమొకటి కలిగి, పిదప యుక్తులచేత ఇది వాస్తవము కాదని నిర్ధారించబడిన జ్ఞానము ఆ శాస్త్రప్రమాణమునుబట్టియే వ్యావహారికమంతయు మిథ్య అని చెప్పినప్పుడు ఆ విధముగా తత్త్వమును నిర్ధారింపలేము. అనగా అయథార్థమైన జ్ఞానము నిశ్చయజ్ఞానముకాదు. పొగమంచును చూచి పొగ అనుకున్నప్పుడు ఆజ్ఞానమునుండి నిర్ణయించబడిన నిప్పుయొక్క ఉనికి నిజముకాదు. కంటిక్రిందను నొక్కియుంచినపుడు వానికి వస్తువులు రెండుగా కనబడుట ఆ కంటిని నొక్కియుంచుట మానివేస్తే తప్ప వేరొకరు చెప్పటం వలన పోదు. పూర్వపక్షములో చెప్పబడిన అనేకదీపజ్వాలలు ఒకే దీపజ్వాలగా కనబడే జ్వాలాభేదోదాహరణమునందుకూడ జ్వాల దగ్గరగా పోయి బాగుగా పరిశీలించినపుడు ఒకతైలబిందువు తరువాత, వేరొక తైలబిందువు మండుట, అందువలన దీపజ్వాలలు ఒకదానితరువాత ఒకటి పుట్టుట గమనించగలము. అందువలన అక్కడకూడ దుర్బలమైన ఒక ప్రత్యక్షప్రమాణము ప్రబలమైన మరొక ప్రత్యక్షప్రమాణముచే తొలగించబడుతున్నదే తప్ప, శాస్త్రజ్ఞానమువలన కాదు. అయథార్థజ్ఞానమువలన పరమాత్మయైన బ్రహ్మముగురించి తెలుసుకొనవచ్చును అన్నవిషయం చెప్పటానికి అసత్యములైన కలలవలన తదనంతరము జరుగు సత్యములు తెలియుచున్నవికదా! అనగా, కలలో కనబడు అసత్యమైన ఏనుగు వలన నిజముగా పుత్రసంతానము కలుగవచ్చును కదా! అని పూర్వపక్షవాదన. అదేవిధముగా, మాయావియగు వ్యక్తి తన మాయచేత నిజమైన వస్తువును సృష్టించవచ్చునని పూర్వపక్షము. కాని భగవద్రామానుజులు కలలోని విషయమునుకూడ సత్యమేనని మాయ అంటే లేనిది కాక, అనూహ్యమైన విచిత్రశక్తియుక్తులని వివరిస్తారు. అంటే కలలో కనబడే ఏనుగు నిజమేతప్ప అసత్యము కాదు. బంగారము పొందినట్లు కలవచ్చినప్పుడు ఆసమయమందు ఆనందము కలుగుట క్రూరమృగముకనబడినపుడు భయముకలిగి చెమటపోయుట చూస్తాము గదా! అందువలన కలలో కనబడిన వస్తువులవలన అప్పుడు ఒక ప్రయోజనము కలుగుతోంది. అదేవిధముగా, త్రాడును పాముగా అనుకున్నప్పుడు భయాదులు కలుగుతాయి. అందువలన భ్రమజ్ఞానముకూడ సత్యమే అవుతుంది. ఇంద్రజాలికుడు మణిమంత్రాదిసామగ్రిచేతకాని, తన శక్తియుక్తులచేతకాని కలిగించు జ్ఞానములుకూడ మిథ్య అనరాదు. అదేవిధముగా, ఎండమావికాని, కొరివి త్రిప్పినపుడుకాని కన్ను నొక్కినపుడు ఇద్దరు చంద్రులు కనబడుటకాని జపాకుసుమముయొక్క రక్తవర్ణము స్ఫటికమందు అభివ్యక్తమగుటగాని, అద్దములో ప్రతిబింబము కనబడుటకాని, ఇవి అన్నీకూడ యథార్థమైన జ్ఞానములే. ఎందుకంటే, ఇవన్నీ యథార్థమైన కారణమువలన కలిగినవి యథార్థమైన ప్రయోజనమును తెలుపునవి యథార్థమైన విధివిధానము కలిగినవి.

పూర్వపక్షమునందు జడములైన రేఖలచేత అక్షరసంకేతికమైన జ్ఞానము పొందబడుచున్నదిగదా! అట్లే అయథార్థమైన వాక్యార్థజ్ఞానమువలన పారమార్థికసాధనము సంభవముకదా! అని వాదము. కాని ఇక్కడకూడ రేఖలుకాని, వాటిచే సంకేతికములైన అక్షరములుకాని యథార్థములే, కాని అయథార్థములు కావు. అందువలన పూర్వపక్షమున చెప్పబడు అయథార్థమునుండి యథార్థము సాధించవచ్చుని వాదము పని చెయ్యదు.

## స్ఫోటవాదము, తత్ఖండనము

అసత్యమైన శాస్త్రజ్ఞానముచేత సత్యమైన బ్రహ్మజ్ఞానము కలుగవచ్చునని తమ ప్రతిపాదనలను సమర్థించుకొనుటకు పూర్వపక్షులు స్ఫోటవాదమును చెప్పెదరు. అవ్యక్తమైన ఏకరూపశబ్దమొకటి కలదనియు, దానిలో క,గ మొదలైనవర్ణములు నాదాభివ్యక్తములై ఆరోపితములైనట్లు తద్విశిష్టమైన శబ్దము అర్థబోధకమని చెప్పెడిది స్ఫోటవాదము. అంటే విభువైన విశ్వమునందు శబ్దము ఏకరూపమే అవ్యక్తమై ఉంటుంది. దానియందు కత్వగత్వాది భేదములు కల్పితములైనపుడు ఆ శబ్దములు అక్షరములై, పదములై, వాక్యములై నానార్థబోధకములుగా అవుతాయి. అందువలన అవ్యక్తమైన శబ్దమునుండి అర్థవంతములైన అక్షరములు, వాక్యములు, శాస్త్రములు, వచ్చుచున్నవి కదా.

ఇట్లు చెప్పబడు పదములు, వాటిచే తెలుపబడు వస్తువులు అనిత్యములు అని పూర్వపక్షులు చెప్తారు. ఉదాహరణమునకు రాముడు అడవికి వెళ్ళెను అను వాక్యమునందు 'ము' అను అక్షరము పలుకబడినపుడు 'రా' అను అక్షరము నిర్గమిస్తుంది. అదేవిధముగా, డు అను అక్షరము చెప్పబడినపుడు రా, ము అను అక్షరములు రెండును నిర్గమిస్తాయి. ఇలా, పలికిన తరువాత ప్రతి అక్షరము ప్రతిశబ్దము ప్రతి పదము, కనబడకుండ పోతాయి. అందువలన ఆ పదాలచేత చెప్పబడిన వస్తువులు జ్ఞప్తులు కూడ కనబడకుండా పోయేవే. చివరికి మిగిలేది అవ్యక్తమైన ఆ స్ఫోటమొక్కటే. అంటే ముందుగా అవ్యక్తమైన స్ఫోటమునుండి వ్యక్తములైన పదములు, వాటిచేత చెప్పబడిన వస్తువులు వ్యక్తులు కనబడి పిమ్మట కనుమరుగై ఆ స్ఫోటమొక్కటే సత్యముగా ఉంటుంది. మిగిలిన రాముడు, అడవి మొదలైనవన్నీ అయథార్థాలే అన్నమాట– అన్నది సంగ్రహంగా ఈ వాదము. కాని ఈ వాదం సమంజసము కాదు. ఎందుకంటే రాముడు అడవికి వెళ్ళెను అన్నప్పుడు ము అన్న అక్షరము పలుకబడినపుడు రా అన్న అక్షరము నశించదు. అది మన బుద్ధిలోనే నిలచి ఉంటుంది. ఇలా, అన్ని అక్షరాలు, పదాలూ, వాక్యాలూ మన బుద్ధియందు సమన్వయమై అర్థవంతమైన విషయము తెలుస్తుంది. ఆ విషయం బుద్ధిలో నిలచి ఉంటుంది. అలా కాక, ఒక్కొక్క అక్షరం వస్తూపోతూ ఉంటే వినేవాడికి పిచ్చెక్కిపోతుందే తప్ప ఏమీ అర్థంకాదు. అందువలన అక్షరాలు పదాలు, వాక్యాలు, వాటిచేత బోధింపబడిన వ్యక్తి,వస్తు–విశేషాలు అన్నీకూడా యథార్థాలే అవుతాయి. అందువలన అవ్యక్తమైన స్ఫోటశబ్దమొక్కటే యథార్థమని చెప్పుటయు మిగిలిన వన్నియు అయథార్థములని చెప్పుట సరికాదు. పూర్వపక్షమందు చెప్పబడినట్లు భేదమే లేనప్పుడు అయథార్థానికీ కూడా భేదం లేదన్నమాట. అట్టిచో, పూర్వపక్షిచేత చెప్పబడిన జగత్తు అయథార్థము బ్రహ్మ యథార్థము అన్న విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అందువలన భేదము లేదనుట, ఏ ప్రమాణమువలన కూడా సమర్థించుట సాధ్యము కాదు.

## శ్రుతిపురాణఘట్టము.

ఇంతవరకు పూర్వపక్షములో ఛాందోగ్యమందలి సద్విద్యాప్రకరణములో చెప్పబడిన "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయం" మున్నగు వాక్యములలో బ్రహ్మైకత్వం సమర్థించబడింది. దాన్ని బట్టి బ్రహ్మ ఒక్కటే ఉన్నదని సజాతీయ,విజాతీయ,స్వగతభేదములు బ్రహ్మకు లేవని ఆ సందర్భంలో చెప్పబడింది. కాని, ఈ వివరణము సరికాదు. మృత్తికేత్యేవ సత్యమ్ అన్నవాక్యమునకు మట్టియే సత్యము, తదితరమంతా అసత్యమని చెప్పబడింది. కాని అదే అర్థమును చెప్పవలివచ్చినపుడు మృత్తికా ఏవ సత్యం అని ఉండవలెను. మృత్తికా ఇతి ఏవ సత్యమ్ అనే పదవిన్యాసమునుబట్టి అక్కడ చెప్పబడుతున్నది కార్యకారణసంబంధం. కుండ, పాలిక మొదలైన పదార్థములకు కారణమైనది మట్టియే. కార్యపదార్థములకు కారణమైనది మట్టియే అని ఈ వాక్యమునకు అర్థము. అదే విధముగా, ఏకమేవ, అద్వితీయం అను పదములకు బ్రహ్మకు విజాతీయ స్వగత భేదములు లేవని కాక, నిమిత్తకారణమే కాక, ఉపాదాన,సహకారికారణములుకూడ బ్రహ్మమే అని అర్థము. ఈ రాజు అద్వితీయుడు అన్నప్పుడు రాజు తప్ప ఆయన సేవకులు, పరివారము మొదలైనవేవీ లేవని అర్థముకాదు. ఆరాజువంటి రాజు మరొకడు లేడని అర్థము. సామాన్యముగా ఒక కారణము తెలిసినపుడు ఆ కారణముచే వచ్చిన కార్యములు తెలుస్తాయి. మనం చూసే కుండకు ఉంగరమునకు ఉపాదానకారణములు ఒకటి కావు. కాని సమస్తజగత్తునకు కారణము పరబ్రహ్మము ఒక్కటే. ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం అన్న శ్రుతివాక్యం ఈ విషయాన్నే తెలుపుతుంది. ఇదమగ్ర ఆసీత్ అను వాక్యమునందు 'అగ్ర' పదము సృష్టికి పూర్వము లేదా ప్రళయానంతరము అన్న విషయాన్ని తెలుపుతుంది. తరువాత సృష్టిప్రకరణములో చెప్పబడిన "బహుస్యాం ప్రజాయేయ" అన్నవాక్యము సృష్టికి పూర్వము ఒక్కటిగా నున్న బ్రహ్మ అనేకముగ అగుదునుగాక అని సంకల్పించెను అని చెప్పడంవల్ల ఆ పరబ్రహ్మము చైతన్యము కలదని, సృష్టికి కారణమని తెలుస్తోంది. అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి ఇత్యాదివాక్యాలలో ఆ పరమాత్మ జీవుడితోకూడ అంతఃప్రవేశము చేసి నామరూపనిర్వాహకుడని చెప్పుటచేత సమస్తజగత్తులోనున్న చేతనాచేతనములను పరబ్రహ్మ అంతర్యామియై ధారకుడై, శాసకుడై ఉన్న విషయం తెలుస్తోంది. ఇదే అర్థములో ఈ శ్రుతిలో ఉపసంహారవాక్యమైన తత్త్వమసి అను మహావాక్యము, నీవు ఆ పరబ్రహ్మాత్మకుడవే అన్న విషయాన్ని నిర్ధారిస్తున్నది.

పూర్వపక్షమునందు సదేవ అను శ్రుతివాక్యమునకు బ్రహ్మమునందు స్వగతభేదము లేనందున, అది నిర్విశేషమైనది అని చెప్పబడినది. కాని, ఈ ప్రకరణములో బ్రహ్మ సవిశేషమనియే చెప్పబడినది తప్ప నిర్విశేషమని కాదు. ఈ ప్రకరణప్రారంభంలో ఉత తమాదేశం అప్రాక్ష్యః అను వాక్యమునందు ఆదేశమనగా సర్వశాసనకర్తయైన పరబ్రహ్మమని అర్థము. శాసనకర్త అని చెప్పినపుడు బ్రహ్మ నిర్విశేషమని శ్రుతి చెప్పలేదుకదా. అదే విధముగా తదైక్షత, అనుప్రవిశ్య మొదలైన పదాలన్నీకూడా సవిశేషబ్రహ్మనే తెలుపుతాయి. సమస్తజగత్కారణత్వమును పరబ్రహ్మకు నిర్ధారించుటకు చెప్పబడిన ఈ ప్రకరణము శుద్ధబుద్ధస్వరూపమైన నిర్విశేషబ్రహ్మను తెలుపుట సాధ్యముకాదు.

# సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ వాక్యార్థము

తైత్తిరీయోపనిషత్తులో బ్రహ్మస్వరూపశోధకవాక్యమైన "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అను వాక్యమునకు పూర్వపక్షమునందు ఇక్కడ సత్యము, జ్ఞానము, అనన్తము బ్రహ్మకు విశేషణములు కావని, ఎందుకంటే వాటి అర్థము వరుసగా, అసత్యముకానిది, అజ్ఞానము కానిది, పరిచ్ఛేదము లేనిది అని చెప్పుకోవాలని వివరించేరు. లోకసిద్ధమైన ముఖ్యార్థమును వదలి, లక్షణావృత్తిననుసరించి వాక్యములో అన్నిపదములకు అర్థమును చెప్పుట సమంజసము కాదు. ఇచ్చట ఇంతకు ముందు చెప్పబడినట్లు సత్యము, జ్ఞానము అనన్తము అను పదములు బ్రహ్మకు విశేషణములై బ్రహ్మనే బోధిస్తూ విశేషణవిశేష్యసామానాధికరణ్యపద్ధతిలో బ్రహ్మని బోధిస్తాయి. అయితే, ఈ మూడు విశేషణములు ఒకే బ్రహ్మకు వర్తించునా, లేక వేరు వేరు బ్రహ్మములుగా అర్థం చేసుకోవాలా అని ఒక సంశయం. విశేషణములలో విరోధము లేనపుడు అవి అన్నియు ఒకే విశేష్యమును బోధించగలవు. కొమ్ములు లేని, కొమ్ములున్న ఆవు అన్నప్పుడు ఆ వాక్యములోని విశేషణములకు విరోధమున్నందున, అట్టి విశేషణములు ఒకే విశేష్యమును వర్ణించలేవు. నల్లని, సన్నని రాముడు అన్నప్పుడు విశేషణములయందు విరోధము లేనందున నల్లని, సన్నని అను విశేషములు రాముడు అను పదానికి వర్తించగలవు. అదే విధముగా సత్యం జ్ఞానం అనన్తం బ్రహ్మ అన్నప్పుడు సత్యము, జ్ఞానము, అనన్తము అను విశేషణములు బ్రహ్మయందు వర్తించుటలో అభ్యంతరము ఉండదు.

పూర్వపక్షులు ఈ వాక్యమునందు విశేషవిశేష్యసామానాధికరణ్యముకాక ఐక్యసామానాధికరణ్యమును చెప్పుదురు. అనగా, సత్యము, జ్ఞానము, అనంతము, బ్రహ్మ అను పదములన్నింటికీ అర్థము ఘటము, కుంభము, కుండ అన్నట్లు ఏకవస్తుబోధనపర్యాయపదములే కావలయును. కాని కుండను చెప్పవలసివచ్చినప్పుడు, నల్లని పెద్ద కుండ అని చెప్పకుండ, ఇది ఘటము, కుంభము, కుండ అని చెప్పినట్లైన అట్లుచెప్పుట దోషము. అందువలన ఇక్కడ ఐక్యసామానాధికరణ్యము వర్తించదు.

పూర్వపక్షమునందు బ్రహ్మ నిర్గుణమని బ్రహ్మయొక్క నిర్గుణత్వమును తెలుపు శ్రుతులే ప్రమాణమని, సగుణశ్రుతులు ప్రమాణములు కావని చెప్పబడెను. కాని సర్వశాఖ్యాప్రత్యయన్యాయముప్రకారము – అనగా అన్ని శ్రుతులను సమన్వయము చేసికొని తెలుసుకొనుటవలన పరబ్రహ్మ కల్యాణగుణములు కలవాడని, హేయగుణముల లేనివాడని తెలుస్తుంది. పూర్వపక్షమునందు అపచ్ఛేదన్యాయమును ఉట్టంకించి దాని ప్రకారము భేదశ్రుతులని సగుణశ్రుతులను పరిగణించకుండా నిర్గుణశ్రుతులనే పరిగణించాలని చెప్పబడినది. కాని అపచ్ఛేదన్యాయము అలా చెప్పదు. ఒక యజ్ఞములో యాదృచ్ఛికంగా రెండు దోషములు జరిగినప్పుడు రెండవ అపచ్ఛేదదోషమునకు ప్రాయశ్చిత్తము జరుపవలెనని అపచ్ఛేదన్యాయము చెప్పుతుంది. ఇక్కడ ఇది యాదృచ్ఛికంగా జరిగిన దోషములకు వర్తించును తప్ప అర్థసిద్ధమై స్వరూపప్రాప్తమైన ఏకశాస్త్రమునందు కొన్ని విషయములను మాత్రము గ్రహించి మరికొన్ని విషయములను తిరస్కరించవలెనని అపచ్ఛేదన్యాయము చెప్పదు. అట్టిచోట, ఉపక్రమాధికరణన్యాయము, మొదలైన న్యాయాలు వర్తిస్తాయి. ఉపక్రమాధికరణన్యాయప్రకారము, ఒక శాస్త్రమునందు ఉపక్రమోపసంహారములకు పరస్పరవిరోధము వచ్చినప్పుడు ఉపక్రమమునకే ప్రాబల్యముండునని గమనించవలెను. దాని ప్రకారము ముందు చెప్పబడిన సగుణవాక్యములకే ప్రాబల్యము అంగీకరించక తప్పదు. ఆ ప్రకారంగా బ్రహ్మ నిర్గుణుడు అంటే హేయమైనప్రాకృతగుణాలు లేనివాడని, నిరఙ్జనుడంటే సంసారాదులతో సంబంధము లేనివాడని.... ఈ రకంగా అర్థం చేసుకోవాలి.

ఉపాసనాసమయమందు పరబ్రహ్మను సగుణుడుగా పరిగణించాలని అది మోక్షసాధనయందు ప్రారంభదశ యని, తదుపరి చివరకు బ్రహ్మానుభవసమయమందు బ్రహ్మ నిర్విశేషమనే అని కొందరు పూర్వపక్షుల అభిప్రాయము. కాని ఇది సరికాదు. పరబ్రహ్మగుణములు స్వాభావికములుగాని సోపాధికములు కావు. ఎందుకంటే, శ్రుతులే ఈ విషయాన్ని వర్ణిస్తూ "స్వాభావికీ జ్ఞానబలక్రియాచ" (సు. )అని పరబ్రహ్మగుణములకు స్వాభావికత్వమును చెప్పేయి. అటులనే నాఽన్యో హేతుర్విద్యతే ఈశనాయ అను శ్రుతి బ్రహ్మకు నియన్తృత్వము అను గుణమును చెప్పి దానికి హేతువు ఉపాధి అనుచు ఏమియును లేదని నిర్దేశించుచున్నది.

సత్యకామః సత్యసఙ్కల్పః అని కల్యాణగుణములను నిరూపిస్తూ పరమాత్మకు అపహతపాప్మా... అని హేయగుణములులేనివాడు అని శ్రుతులు పరమాత్మని చెప్తాయి. "త ఇమే సత్యాః కామాః" మొదలైన శ్రుతి వాక్యములు ఆయనస్వరూపమువలె గుణములుకూడ సత్యములని అనగా, కల్పితములు సోపాధికములు అస్వాభావికములు కావని చెప్తున్నాయి.

పరబ్రహ్మలో ఆనందాది గుణముల అపరిచ్ఛిన్నత "తేయే శతం..." ఇత్యాది శ్రుతులు తెలుపుతాయి. కేవల ఉపాసనార్థశ్రుతిరూపముగానే కాక బ్రహ్మస్వరూపనిరూపకముగా చెప్పబడిన ఆనందాది గుణములు నిరూపితస్వరూపగుణములగా చెప్పబడిన జ్ఞానబలశక్త్యాదిగుణములు సోపాధికములు కావనే శ్రుతి చెప్తుతున్నది. గుణరహితుడు, గుణాతీతుడు, నిర్గుణుడు అని పరబ్రహ్మను వర్ణించు పదములు సత్త్వరజస్తమోగుణములు లేనివాడనే విషయాన్నే తెలుపుతాయి.

బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి అను వాక్యముకూడ జీవబ్రహ్మల ఐక్యమును చెప్పదు. దీనికి అర్థము బ్రహ్మమును తెలిసికొనినవాడు బ్రహ్మమువలె అవుతాడు అనగా, సత్యకామసత్యసంకల్పాది అష్టగుణావిర్భావము కలిగి పరమపదమునందు పరబ్రహ్మసన్నిధిలో పరబ్రహ్మగుణానుభవముచేత నిత్యనిరతిశయానందములను కలిగి ఉ ంటాడు అని అర్థము చెప్పుకోవాలి. అంటే బ్రహ్మ ఏవ అని కాక బ్రహ్మ ఇవ అని దీనికర్థం అన్నమాట. అంతేకాక బ్రహ్మ అంటే బృహద్ధాతువునుబట్టి వ్యుత్పత్త్యర్థమును తీసుకుంటే బ్రహ్మమంటే గుణవిభవైశ్వర్యాదివిషయాల్లో అత్యంతాతిశయము గలవాడు అని అర్థము గనుక బ్రహ్మమును తెలిసికొనినవాడు అత్యంతాతిశయమును కలిగి ఉంటాడు అనికూడా చెప్పుకొనవచ్చును. అంతే కాక లాక్షణికప్రయోగంవల్ల అర్థం వివరించుకుంటే బ్రహ్మను తెలిసికొనినవాడు బ్రహ్మ అంత అతిశయము కలిగినవాడు అవుతాడు అని చెప్పుటవలన ఇక్కడ ముక్తాత్మయొక్క అతిశయమే తెలియబడుతుంది తప్ప ఐక్యము కాదు. అనగా ఉదాహరణమునకు ఈ పిల్లడు సింహమురా అన్నపుడు ఆ పిల్లవాడి శౌర్యము యొక్క అతిశయముకదా చెప్పబడుతున్నది. అట్లు కాక, ఆ పిల్లవాడు సింహము అయిపోయెను అని కాదుగదా! అంతే కాక, ఐక్యము అని చెప్పినపుడు కూడ అక్కడ ఆయావ్యక్తుల అపృథక్సిద్ధసంబంధమే తెలుపబడుతుంది. శ్రీమద్రామాయణములో సుందరకాండయందు ఆంజనేయుడు సీతమ్మకు రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత అని చెప్పినప్పుడు వారు మైత్రివలన ఒకరిని విడచి మరొకరు ఉండలేని స్థితిమాత్రమే చెప్పబడుతుందితప్ప, వారిలో ఒకడు నాశనమైపోయి వేరొకరుమాత్రమే మిగిలియున్నారని అర్థము కాదు. పై కారణములవలన ఈ శ్రుతివాక్యము కూడ ఆత్మనాశమును కాక, ఆత్మకు బ్రహ్మతోగల అపృథక్సిద్ధిని ముక్తాత్మ అతిశయాన్ని తెలియజేస్తుంది.

# పరబ్రహ్మ జ్ఞానానందస్వరూపుడు, జ్ఞానగుణకుడు

పూర్వపక్షమునందు బృహదారణ్యకోపనిషద్వాక్యమైన న ద్రష్టేః ద్రష్టారం మతేః మన్తారం అను వాక్యమునకు జ్ఞానముకంటె, జ్ఞాతృత్వముగలవాడు మన్తృత్వము గలవాడు వేరొకడు లేదని జ్ఞాతృత్వము, మన్తృత్వము కల ఆత్మ లేదని చెప్తారు. కాని ఇది సరికాదు. ఈ శ్రుతివాక్యమునకు దర్శనక్రియకు కర్త అయినవాడును, మననక్రియకు కర్త అయినవాడును అగు జీవుని పరబ్రహ్మముగా ఉపాసించకుము అని అర్థమును చెప్పవలెను. పరబ్రహ్మ జ్ఞానాది గుణములు కలవాడని అందువలన సగుణమని ఇంతకుముందు వివరించుకున్నాము. అట్లే ఆనందో బ్రహ్మ మొదలైన శ్రుతులను బట్టి పరబ్రహ్మ ఆనందస్వరూపుడు అని తెలుస్తున్నది. అదే విధముగా "స ఏకో బ్రహ్మణ ఆనన్దః, ఆనన్దం బ్రహ్మణో విద్వాన్ అనియు బ్రహ్మణః ఆనన్దః = బ్రహ్మయొక్క ఆనందము అని నిర్దేశించబడుటవలన బ్రహ్మము ఆనందస్వరూపమాత్రమే కాదు, ఆనందధర్మము గలదికూడ అని తెలుస్తోంది. కనుక పరబ్రహ్మ జ్ఞానానందస్వరూపుడు, గుణకుడుకూడ.

పూర్వపక్షమునందు నేహ నానాస్తి కిఞ్చన, మృత్యోస్సమృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ అను ఉపనిషద్వాక్యములలో భేదమే లేదనియు బ్రహ్మము తప్ప నానాపదార్థములు వేరే లేవనియు, అట్లు భేదమును భావించినచో అతడు సంసారములోనే పడియుండునని మృత్యుసమానమైన దుఃఖములనే పొందుననియు సర్వము ఆత్మయే అయినపుడు ఒకరు చూచుట, ఒకడు చూడబడుట అను నానావిధభేదము లెక్కడివని భేదప్రపంచమును నిషేధిస్తున్నట్లు వ్యాఖ్యానించబడినది. కాని ఇది సరికాదు. అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్య అని ఛాందోగ్యములో చెప్పబడినట్లు జగత్తునందలి సమస్తచేతనాచేతనపదార్థములకు పరబ్రహ్మము అంతర్యామియై సమస్త చేతనాచేతనములకు, పరబ్రహ్మమునకు అపృథక్సిద్ధమైన శరీరశరీరి-సంబంధము ఉండుటవలన ఇక్కడ చెప్పబడినది విశిష్టాఽభేదమే అని అర్థము చేసుకొనవచ్చును. అందువలన పరబ్రహ్మాంతర్యామికము కాని తదత్యంతభిన్నమైన వేరొక పదార్థమేమియు లేదని ఈ శ్రుతులకు అర్థముతప్ప బ్రహ్మేతరమంతయును మిథ్య అని కాదు. ఇట్లు అభేదమును భాసించు శ్రుతిస్మృతిపురాణవాక్యములను భగవద్రామానుజులు ఈ శ్రుతిస్మృతిపురాణఘట్టములో సమన్వయము చేసి వివరించియున్నారు ఇందులో ముఖ్యమైన కొన్నివాక్యములు స్థాలీపులాకన్యాయముగా సంభాషణారూపమైన చతుస్సూత్రి సంగ్రహమున ఉట్టంకించబడినవి. ఇందు ఉపనిషద్వాక్యములే కాక, భగవద్గీతాశ్లోకములు, విష్ణుపురాణములోని శ్లోకములు ఉదాహరించబడి వివరించబడినవి. అందువలన ఆ విషయములు ఇచ్చట వివరించబడుట లేదు. జిజ్ఞాసువులు ఈ వివరములను అక్కడ చూసుకొనగలరు.

# సప్తవిధానుపపత్తులు

ఇంతవరకు పూర్వపక్షములో చెప్పబడినట్లు కర్మవిచారము, అవసరం లేదనీ, బ్రహ్మనిర్విశేషచిన్మాత్ర అనిన్నీ ఆ బ్రహ్మతప్ప ఈ కనబడుతున్న చేతనాచేతనమైన జగత్తంతా మిథ్యయేనని అట్లు తాను వేరుగా లేనను విషయము వాక్యార్థజ్ఞానమువలన కలిగి ఉన్నది బ్రహ్మయేనను అనుభవస్థితియే మోక్షమని, ప్రత్యక్షముగా కనబడు భేదము అంతా భ్రాన్తిమాత్రమేనని, చెప్పబడిన విషయాలనన్నింటినీ, యుక్తులతోటీ, తదుపరి శ్రుతి, స్మృతి పురాణముల ప్రమాణాలతోటి భగవద్రామానుజులు తన సిద్ధాంతమునందు సంస్కరించడం జరిగింది. భేదజ్ఞానమునకు కారణము అవిద్య అను దోషమనియు, ఇది వాక్యార్థజ్ఞానమువలన నివర్తించుననియు చెప్పిన పూర్వపక్షమునకు సమాధానముగా వాక్యార్థజ్ఞానమువలన అట్టి అవిద్యానివృత్తి సంభవముకాదనికూడ నిర్ద్వంద్వముగా సిద్ధాంతమునందు నిరూపించుట జరిగినది. ఇకపై ఈ అవిద్య అనునది ఉండుటకు అవకాశమే లేదని దీనికి ఎట్టి ప్రమాణమును లేదన్నవిషయము భగవద్రామానుజులు ఏడు విధములుగా నిరూపించుచున్నారు. వీటినే సప్తవిధానుపపత్తులు అంటారు. అనుపపత్తి అనగా నిరూపణమునకు సాధ్యము కానిది అని అర్థము. సర్వవిశేషరహితమై స్వయంప్రకాశకమైన కేవలజ్ఞానస్వరూపబ్రహ్మమునందు బహువిధభేదసంకులమైన ఈ జగత్తంతయు అవిద్యయను దోషముచేత కల్పితమైనది అనిగదా పూర్వపక్షము. దీనికి ప్రమాణముగా అనృతేన హి ప్రత్యూఢాః మొదలగు కొన్ని శ్రుతివాక్యములను వర్తింపించి ఈ అవిద్య అను దోషమును పూర్వపక్షులు సాధింప ప్రయత్నిస్తారు. తత్త్వమసి, సర్వం ఖల్విదం బ్రహ్మ మొదలగు వాక్యములచేత అంతయు బ్రహ్మయే అని అంగీకరిస్తే ఈ కనబడు జగత్తు బ్రహ్మకాకుండా భాసించడానికి ఏదో ఒక దోషము కారణముకావలెనను యుక్తివలన ఈ అవిద్య అను దోషమును పూర్వపక్షులు ఉట్టంకిస్తారు. ఇది బ్రహ్మమువలె త్రికాలాబాధితము కాని సత్యపదార్థము కానందున వేరొక బ్రహ్మముగా దీనిని అర్థం చేసుకొననక్కరలేదు గాబట్టి వారి అద్వైతవాదమునకు భంగము లేదని వారి సమర్థనము. ఈ అవిద్య కేవలము వారి అజ్ఞానముచే కనిపెట్టబడినది కాని అట్టి అవిద్య ఉండుటకు అవకాశము లేదని భగవద్రామానుజులు ఆశ్రయానుపపత్తి, తిరోధానానుపపత్తి, స్వరూపానుపపత్తి, అనిర్వచనీయానుపపత్తి, ప్రమాణానుపపత్తి, నివర్తకానుపపత్తి, నివృత్త్యనుపపత్తి అను ఏడు విధములైన దోషములను చూపి వారి వాదములను సరిచేయుచున్నారు.

## ఆశ్రయానుపపత్తి

ఈ అనుపపత్తియందు ఇంతకుముందు చెప్పబడిన అవిద్య దేనిని ఆశ్రయించి యుండునని భగవద్రామానుజులు ప్రశ్నించుచున్నారు. జీవుడే అవిద్యకు ఆశ్రయమైనచో జీవుడు అవిద్యచే కల్పితమైనందున జీవునికంటే పూర్వము అవిద్య ఉన్నదని చెప్పవలెను. కనుక జీవుడు అవిద్యకు ఆశ్రయము కాజాలడు. అట్లు కాక బ్రహ్మమే అవిద్యకు ఆశ్రయమని చెప్పినచో స్వయంప్రకాశకమైన బ్రహ్మమువద్ద అవిద్య, సూర్యునివద్ద చీకటివలె ఉండుటకు కాని సూర్యుని కప్పు చీకటివలె ఆవరించుటకు కాని అవకాశము లేదు. అందువలన అవిద్యకు ఆశ్రయము లేదు. ఈ సందర్భమున నాథమునులచే ప్రసాదించబడిన మూడు శ్లోకములు భగవద్రామానుజులు ఈ క్రింద ఉదాహరిస్తున్నారు.

శ్లో॥ జ్ఞానరూపం పరంబ్రహ్మ తన్నివర్త్యం మృషాత్మకమ్ ।
అజ్ఞానం చేత్ తిరస్కుర్యాత్ కః ప్రభుస్తన్నివర్తనే ॥

శ్లో॥ జ్ఞానం బ్రహ్మేతిచేత్ జ్ఞానమజ్ఞానస్య నివర్తకం ॥
బ్రహ్మవత్ప్రకాశత్వాత్ తదపిహ్యనివర్తకం ॥

శ్లో॥ జ్ఞానం బ్రహ్మేతి విజ్ఞానం అపిచేత్ స్యాత్ప్రమేయతా ।
బ్రహ్మణః అననుభూతిత్వం త్వదుక్త్యైవ ప్రసజ్యతే ॥

ఈ శ్లోకమునకర్థము 1. జ్ఞానరూపమైన పరబ్రహ్మమును ఆ జ్ఞానముచేతనే నివర్తింపబడవలసిన మిథ్యారూపమైన అవిద్య కప్పియున్నది అన్నచో ఇక దానిని తొలగించుటకు సాధ్యము. 2. బ్రహ్మము జ్ఞానస్వరూపమను జ్ఞానము అజ్ఞానమునకు నివర్తకమన్నచో అసలు జ్ఞానమున్న బ్రహ్మమే తనను ఆవరించిన అజ్ఞానమును తొలగించుకొనలేక పోయినపుడు ఈ జ్ఞానముమాత్రము అజ్ఞాననివర్తకమెట్లగును? 3.అనగా, స్వయముగా బ్రహ్మకే తన అజ్ఞానమును నివర్తించుకొనుట సాధ్యము కానిచో ఉపదేశజన్యజ్ఞానముకూడ అజ్ఞాననివర్తకము కాజాలదు. ఉపదేశజ్ఞానము వాస్తవమై బ్రహ్మము ఈ జ్ఞానమువలన తెలుసుకొనబడిన ఆ బ్రహ్మము కూడ జడమగును.

## తిరోధానానుపపత్తి

అవిద్య బ్రహ్మను ఆవరించును అనగా కప్పిపుచ్చును లేదా తిరోధానము చేయును అని అర్థము. బ్రహ్మకు ప్రకాశము కలుగకుండ నిరోధించుట అనగా ప్రకాశోత్పత్తి కలుగకుండ చేయుట లేదా ఉన్న ప్రకాశమునకు వినాశమును కలిగించుట అని రెండు వికల్పములు లేదా అవకాశములు ఇట్టి తిరోధానమునందు సంభవము. కాని ఉత్పత్తియగు ప్రకాశమును నిరోధించుట అనునది స్వయంప్రకాశకమైన బ్రహ్మకు కుదరదు. ఎందుకంటే ఆ ప్రకాశము నిత్యము ఉత్పత్తిలేనిదిగనుక. అట్లుకాక ఉన్న ప్రకాశమునకు వినాశము కలిగించవలెను అంటే బ్రహ్మము, ప్రకాశమును ఒకటే కాబట్టి (పూర్వపక్షిప్రకారము బ్రహ్మయందు స్వగతభేదములు లేవు గనుక బ్రహ్మయు, ప్రకాశమును ఒకటే కావలెను) ప్రకాశముయొక్క నాశమనగా ఆ బ్రహ్మయొక్క నాశమే అగును. ఇది కూడా మూలఘాతమే కదా! అందువలన అవిద్య బ్రహ్మను ఆవరించియుండుటకు అవకాశము లేదు.

## స్వరూపానుపపత్తి

ఈ అవిద్య స్వరూపము అస్తియా నాస్తియా అని ప్రశ్న. ఏదైనా, అస్తి అనగా పరమార్థము, నాస్తి అనగా అపరమార్థము అవాలి కాని మూడవ అవకాశము లేదు. ఈ అవిద్య పరమార్థమని అనుకొనినా బ్రహ్మము ఒక పరమార్థము, దానికి వేరుగా మరొక పరమార్థము అవిద్య అని చెప్పవలసివచ్చును. కాని పూర్వపక్షము ప్రకారము బ్రహ్మతప్ప వేరొక పరమార్థము లేదు. కనుక అవిద్య పరమార్థమగుటకు అవకాశము లేదు. అట్లు కాక అవిద్య అపరమార్థమని చెప్పినచో అది 1. జ్ఞాతృత్వము కల వ్యక్తి - 2.అతనికి జ్ఞానగోచరమైన జడపదార్థములు 3.భ్రమాత్మకనానాజ్ఞానపరంపర, ఈ మూడింటిలో ఏదో ఒకటి కావలెను. కాని అపరమార్థవస్తువులన్నింటికి ఒక కారణము కావలెను. ఆ కారణము అవిద్యకు కల్పకమైన మరొక దోషము అయినప్పుడు, దానికి కారణముగా వేరొక దోషము కావలెను. ఈవిధముగా ఇది యొక అంతులేని చిక్కుల గొలుసు అవుతుంది. ఇదే విధముగా ఈ అవిద్య పైన చెప్పబడిన నానాజ్ఞానపరంపర అయితే ఇట్టి జ్ఞానము కేవలజ్ఞానముకాక అవచ్ఛిన్నజ్ఞానము కావాలి. కేవలజ్ఞానము అవచ్ఛిన్నజ్ఞానమునందు ఉత్పత్తికాదు. అనగా, రెండు జ్ఞానములున్నచో అద్వైతభంగము. అట్లుకాక అపరమార్థమైన జ్ఞానమునుండి అవిద్య రాలేదు. అట్లుకాక అవిద్య జ్ఞాతయో, జ్ఞేయమో అయినచో దానిని సృష్టించుటకు వేరొక అవిద్య అవసరము, ఆ అవిద్యను సృష్టించుటకు మరియొక అవిద్య అవసరమౌతుంది.

ఇది కూడా ఇంతకుముందు అనుకున్నట్లు అంతులేని కథే అవుతుంది. ఈవిధముగా, ఈ అవిద్యాస్వరూపమును ఇదమిత్థమని చెప్పుటకు సాధ్యము కాదు.

## అనిర్వచనీయానుపపత్తి

అవిద్య సత్పదార్థమో, అసత్పదార్థమో కావలెను. ఎందుకంటే సదసద్భిన్నమైన వస్తువు ఏదియును ఏ ప్రమాణముచేతను కూడ గ్రహించబడలేదు. అది సత్పదార్థమే అయినచో బ్రహ్మ కంటే వేరొక సత్పదార్థము ఉండుటకు పూర్వపక్షముప్రకారము అవకాశము లేదు. అట్టి అసత్పదార్థము ఉత్పత్తి యగుటకు వేరొక సత్పదార్థము కావలెను ఇదికూడ ఒక అంతులేని కథగానే పరిణమిస్తుంది. ఇట్లు కాక, అవిద్యను సత్తు అసత్తు కాకుండా అనిర్వచనీయము అని చెప్పినప్పుడు అట్టి వస్తువును బోధించు ప్రమాణము ఏదియును ఉండదు.

## ప్రమాణానుపపత్తి

ప్రమాణానుపపత్తి అవిద్యను నిరూపించటానికి ముందు చెప్పబడినట్లు ప్రమాణములేమియు లేవని, దీనికి సమాధానంగా పూర్వపక్షి మనము అంగీకరించే ముఖ్యప్రమాణాలైన ప్రత్యక్ష, అనుమాన, శబ్దప్రమాణములతో అవిద్య ఉన్నట్లుగా నిరూపించవచ్చని చెపుతారు.

## ప్రత్యక్షప్రమాణముచే అవిద్యానిరూపణము, దాని ఖండనము

ఇంతకు ముందు సూర్యునివద్ద చీకటి ఉండనట్లు బ్రహ్మవద్ద అవిద్య ఉండలేదని అనుకున్నాము. ఎందుకంటే చీకటి అంటే వెలుతురు లేకపోవటం కాబట్టి సూర్యునివద్ద వెలుతురు లేకుండుట సంభవము కాదు కాబట్టి సూర్యుడివద్ద చీకటి ఉండదు అని ఇచ్చట అభిప్రాయము. కాని అవిద్య అనేది అభావరూపముగా తీసుకొనకుండా భావరూపంగా పరిగణిస్తే, జ్ఞానము అవిద్య కలిసి ఉండటానికి అభ్యంతరము లేదు, ఎందుకంటే నఞ్కారానికి ఆరు రకాలైన అర్థాలున్నాయి. వాటిని

తత్సాదృశ్యం అభావశ్చ, తదన్యత్వం, తదల్పతా,

అప్రాశస్త్యం, విరోధశ్చ నఞర్థాః షట్ప్రకీర్తితాః ॥ అని చెబుతారు. ఉదాహరణమునకు ఈ బ్రాహ్మణుడు అబ్రాహ్మణులతో కలసి భుజిస్తున్నాడు అన్నప్పుడు బ్రాహ్మణ, అబ్రాహ్మణులు కలసి ఒకచోట ఉండటం సంభవం అవుతోంది కదా! ఇదే విధంగా గజము ఉన్నది అంటే ఏనుగు ఉన్నదని అర్థం. గజాభావము అనగా ఏనుగు లేదనికాని, ఏనుగుకానిది వేరొకటి ఉన్నదనికాని అర్థమౌతుంది. ఏనుగు కాకుండా అక్కడ ఎలుక ఉంటే అప్పుడుకూడా గజాభావాన్నే చెప్పాలి. అలాంటప్పుడు, గజము, గజాభావము కలసి ఉండుట సంభవమే అవుతుంది. అదేవిధంగా, జ్ఞానము, జ్ఞానాభావము లేదా అవిద్య కలసి ఉండడం సంభవమే అవుతుంది. అందువలన మనం ఇంతకుముందు చెప్పుకున్నట్లు జ్ఞానస్వరూపమైన బ్రహ్మము, అజ్ఞానరూపమైన అవిద్య కలసి ఉంటా యనటంలో తప్పులేదు. అంటే గజము ఉన్నదంటే గజాభావము ఉన్నట్టే. అదే విధముగా, జ్ఞానం అనేది ఉంటే, జ్ఞానాభావంకూడా ఉండి తీరాలి. అందువలననే మనము నేను జ్ఞానిని, నేను అజ్ఞానిని అని వేరువేరు సందర్భాలలో వాడుతూంటాం. అంటే, జ్ఞానం ఉండడం, అజ్ఞానం ఉండడంకూడా ప్రత్యక్షానుభవంలో మనం చూస్తున్నాం. ఈ రకంగా, అవిద్యను ప్రత్యక్షప్రమాణముచేత నిరూపించవచ్చునని పూర్వపక్షము.

దీనికి సమాధానముగా భగవద్రామానుజుల సిద్ధాంతము సంగ్రహముగా క్రిందనీయబడినది.

పైన చెప్పినవిధముగా నేను జ్ఞాని, అని ఒకప్పుడు, నేను అజ్ఞాని అని మరొకప్పుడు చెప్పవచ్చును. కాని నేను జ్ఞానిని, అజ్ఞానిని. అనగా, జ్ఞానము, అజ్ఞానము కలసి ఉన్నట్లు చెప్పుట ఎంత సమంజసము? బ్రహ్మ

అంటే స్వయంప్రకాశము. అందువలన అవిద్య స్వరూపమును బ్రహ్మయే గ్రహించాలి కదా! దానికి వేరొక వాక్యార్థజ్ఞానముయొక్క సహాయము ఎందుకు కావలసి ఉంటుంది? దీనికి సమాధానంగా, బ్రహ్మ అవిద్యస్వరూపాన్ని తెలుసుకొనటం వల్ల దానిలో అవిద్య ఉన్నట్టుగా తెలుసుకొనవచ్చును. కాని ఆ అవిద్యను నశింపచేయుట, తొలగించుట చేయలేదు అని పూర్వపక్షిసమాధానం. అలా అన్నప్పుడు, ఆ జ్ఞానము లేదా బ్రహ్మము తనను తెలుసుకొంటూ, అవిద్యనికూడా తన స్వరూపముగా తెలుసుకొంటుందన్నమాట. బ్రహ్మమునందు స్వగతభేదాలు లేవుగనుక, అవిద్యను ఆ జ్ఞానము(బ్రహ్మము) తెలుసుకొనేవస్తువుగా ఎలా విడదీయగలము అని భగవద్రామానుజులు ప్రశ్నిస్తారు

దీనికి సమాధానముగా బ్రహ్మస్వయంప్రకాశము గనుక, దానిని తెలుసుకొనేందుకు వేరే ప్రమాణము అక్కరలేదు. అది అవిద్యకంటే వేరుగా ఉండగలదు అని నేను అజ్ఞానిని అన్నప్పుడు అవిద్య ప్రత్యక్షముగా గ్రహింపబడుతోందికదా! అని సమాధానము ఇచ్చుటకు పూర్వపక్షి ప్రయత్నము.

కాని మనం ఇంతకుముందు అనుకున్నట్లు, నేను జ్ఞానిని, అజ్ఞానిని అని ఒకే సమయమున అనుట ఎట్లు సమంజసము కాదో, బ్రహ్మ ఒకే సమయంలో జ్ఞానమును, అవిద్య అనబడు అజ్ఞానమును అనుభవించటం సాధ్యంకాదు.

దీనికి పూర్వపక్షము అధిష్ఠానము, అధ్యాస ఉదాహరణముగా చెప్పుతూ, ఒక తెల్లకాకితం బ్రహ్మ అనుకుంటే, దానిపై అవిద్య అనే జిగురుతో కూడిన రంగు అంటుకున్నట్లు, ఒక త్రాడుమీద పాము కనబడినట్లు, అవిద్య బ్రహ్మను ఆవరిస్తుంది అని చెప్తారు. అందువలన బ్రహ్మ నిర్విశేషమైనప్పటికీ సవిశేషముగా భాసిస్తుంది. అలాగే, అవిద్య, తెల్లకాకితంమీద ఒకచోట ఎరుపురంగు ఎక్కువగానూ, మరొకచోట నలుపురంగు ఎక్కువగానూ ఉన్నట్లు, ప్రపంచంకూడా, రకరకాలుగా జ్ఞానగుణభేదములతో అనేకచేతనాచేతనాలుగా భాసిస్తుంది. ఆ అవిద్య పరిమాణంలో తేడాలవలన ఈ చేతనాచేతనాల్లో భ్రమజ్ఞానముకూడ వేరుగా ఉండడం, ఉండకపోవడం ఉన్నట్లు అనిపిస్తుంది అని చెప్పుతారు.

దీనికి సమాధానంగా బ్రహ్మతో ఉండే అవిద్య దోషమా కాదా అని ప్రశ్న. దోషమే అయితే, అది బ్రహ్మలో ఉండటానికి అవకాశం లేదు. ఎందుకంటే, బ్రహ్మనిర్విశేషము, నిర్దోషము కనుక. అట్లుకాక, అవిద్య దోషమే అయితే బ్రహ్మకు జీవభావము, ఇతరములైన అపరమార్థభావాలు రావడానికి అవకాశం లేదు. ఈ అవిద్యను బ్రహ్మ గ్రహిస్తుందంటే గ్రహించిన తరువాత ఆవరిస్తుందా లేక ఆవరించిన తరువాత గ్రహిస్తుందా అని ప్రశ్న. బ్రహ్మ అవిద్యను ఆవరించకముందే గ్రహిస్తే, ఆవరించవలసిన అవసరమేమున్నది? ఆవరించిన తరువాత గ్రహిస్తుంది అంటే అట్లు గ్రహించడం సాధ్యం కాదు. అలా కాకుండా, అవిద్యబ్రహ్మను ఆవరించడం, బ్రహ్మ దానిని గ్రహించడం ఒకేసారి జరుగుతాయంటే, బ్రహ్మకు బ్రహ్మస్వరూపం ఉన్నంతవరకూ, అవిద్య గ్రహింపబడదు. అవిద్య కాకుండా, అవిద్యకు ముందర వేరొకటి ఆవరించి, అందువలన బ్రహ్మ అవిద్యని అనుభవించటం ప్రారంభించిందంటే, అవిద్యకంటే ముందు ఆవరించినది వేరొక అవిద్య అవాలి. దానికోసం మరొక అవిద్య అవసరమౌతుంది. ఇలా ఇది అంతులేని కథ అవుతుంది. అసలు బ్రహ్మ అవిద్యను అనుభవించటం ప్రారంభించింది అంటే బ్రహ్మనాశనం అయిపోయినట్లే. మరి బ్రహ్మస్వరూపం ఎన్నటికీ సిద్ధించదు. అట్లు కాక, వాక్యార్థజ్ఞానంవలన బ్రహ్మస్వరూపం సిద్ధిస్తుంది అంటే పచ్చకామెరలు వచ్చినవాడికి నీకు పచ్చకామెరలు లేవు అని చెప్పినప్పుడు, ఆ పచ్చకామెరలవ్యాధి తొలగిపోనట్లు కేవలవాక్యార్థజ్ఞానమువలన అవిద్య తొలగటం సంభవం కాదు. అట్లు కాక, బ్రహ్మను అవిద్య కొంతవరకు కప్పి బ్రహ్మ కొంతవరకు స్వయంప్రకాశముగా ఉన్నది అని వాదిస్తే బ్రహ్మలో

భాగాలు ఉండవు గనుక, కొంతభాగం ఆవరింపబడటం, కొంతభాగం స్వయంప్రకాశంగా ఉండటం కుదరదు. అసలు బ్రహ్మలో స్వయంప్రకాశకత సహజంగా ఉండకపోవడమే ఉండదు. అలా ఉండి ఉంటే మరి అవిద్య అవసరమే లేదు. బ్రహ్మకూడా మిథ్య అనియే చెప్పుకోవలసివస్తుంది.

దోషమైన అవిద్య బ్రహ్మను ఆవరిస్తే బ్రహ్మ మిథ్యే, జగత్తుకూడా మిథ్యే. ఏతావతా, సమస్తమూ శూన్యమే అన్న పరిస్థితి వస్తుంది. బ్రహ్మ స్వరూపము స్వయంప్రకాశకము అన్నప్పుడు ఈ స్వయంప్రకాశకత్వము అవిద్యవలన సంకోచించడం అసంభవము. అట్లు కాకున్న, అవిద్య ఆవశ్యకతయే లేదు. అంతేకాక, జ్ఞానం లేకపోవటం అన్నది ప్రత్యక్షప్రమాణంలో గోచరించదు. లేదు అజ్ఞానమే అన్నపుడు అక్కడ అజ్ఞానము అంటే, సంపూర్ణజ్ఞానము లేదా జ్ఞానవైశద్యములేకుండుట. అదే విధముగా అబ్రాహ్మణుడు అన్న ఉదాహరణములో అబ్రాహ్మణుడు అంటే బ్రాహ్మణజాతికి చెందని వేరొకమనిషి అని అర్థము. కాని అవిద్య అంటే అదేవిధముగా, అవిద్యను దోషపూరితజ్ఞానముగా స్వీకరించిననాడు, అట్టి దోషాన్ని స్వయంప్రకాశకమైన, అవిద్యాస్వరూపమును తెలిసిన. బ్రహ్మము గ్రహించలేదు. అందువలన అవిద్య భావరూపమైనను బ్రహ్మముతో కలిసి ఉండలేదు. ఈ విధంగా ప్రత్యక్షప్రమాణము ఎన్ని వికల్పములను పరిగణించినను అవిద్యను నిరూపించలేదు అని సిద్ధాంతము.

## అనుమానప్రమాణముచేత అవిద్యానిరూపణము, దాని ఖండనము

ఇదే విధముగా అవిద్యను  అనుమానప్రమాణముచేతకూడా నిరూపించవచ్చని పూర్వపక్షి క్రిందివిధముగా అంటాడు. ఇంతకు ముందు అనుకున్నట్లుగా, చీకటిని వెలుతురు లేకపోవటం అని కాక ఒక భావరూపముగా పరిగణించవచ్చు. అందువలననే దట్టమైన చీకటి, నల్లని చీకటి, అని చీకటిని చూచి వర్ణిస్తున్నాం. చీకటిని భావరూపం కాకపోతే ఇలా చూడడం వర్ణించటం కుదరదు. ఇప్పుడు చీకటిలో దీపం వెలిగిస్తే, ఆ చీకటి తొలగిపోవటంవల్ల వస్తువులు గోచరమౌతాయి. ఇదేవిధంగా బ్రహ్మ అంతకుముందు అప్రకాశమై ఉన్నది. దానికి కారణం దానితో ఉన్న అవిద్య. దీపం వెలిగించినతరువాత, చీకటి తొలగిపోయినట్లే వాక్యార్థజ్ఞానమువలన అవిద్య తొలగించబడుతుంది. ఈ విధముగా అవిద్యను అనుమానప్రమాణముతోకూడ ఋజువు చేయవచ్చునని పూర్వపక్షము.

కాని చీకటిని భావరూపవస్తువు అనుట సరికాదు. చీకటి అను వేరు పదార్థమేమియు లేదు. వెలుగు లేకపోవడమే చీకటి. అందువలన ఈ ఉదాహరణముచెల్లదు.

వాక్యార్థజ్ఞానమువలన బ్రహ్మ స్వయంప్రకాశమైనదని (అంటే, దీపమువలన వస్తువులు ప్రకాశమైనట్లుగా), అంతకుముందు బ్రహ్మ స్వయంప్రకాశకము కాదని, దానికి కారణము అవిద్య అని(అంతకుముందు వస్తువులు ప్రకాశితమగుటలేదని, దానికి కారణము అవిద్య అని అన్నట్లుగా అని) కదా పూర్వపక్షము. బ్రహ్మయొక్క స్వయంప్రకాశకత్వరూపాన్ని అవిద్య అని ఋజువు ఏమీ చూపబడలేదు.  అందువలన స్వయంప్రకాశకత్వము లేకుండా ఉండటానికి కారణము అవిద్యేనా అవచ్చు లేదా మరొక అజ్ఞానమేనా కావచ్చు, కొన్ని అజ్ఞానముల సంయోగమైనా అవచ్చు, లేదా అజ్ఞానపరంపరైనా అవచ్చు. అది కూడ బ్రహ్మకు అంతకుముందు స్వయంప్రకాశకత, పోగొట్టబడి ఉంటే, నిజానికి బ్రహ్మ స్వయంప్రకాశకత పోగొట్టబడటం అనేదే అసమంజసమైన విషయం. అంతేకాక, జగత్తులో వస్తుప్రకాశానికి కారణంకూడా అదే అవిద్య అని పూర్వపక్షము. కాని ముందు చెప్పబడిన చీకటి ఉదాహరణములో చీకటి అన్ని వస్తువులను కనబడకుండా చేస్తుంది తప్ప కొన్నిటిని కనబడకుండా చేసి, కొన్ని కనబడేటట్టు చేయదు. అంటే ఒక గదిలో చీకటివలన ఆటవస్తువుమాత్రము కనబడి చదువుకొనే పుస్తకం

కనబడలేదంటే అలా చెప్తున్నవాడు సత్యము చెప్పుట లేదు అనే అర్థము. అదే విధముగా, ఈ అవిద్య బ్రహ్మప్రకాశాన్ని పోగొడుతుంది, జగత్తులో వస్తుప్రకాశాన్ని కలిగిస్తుంది అంటే, అలా చెప్తున్నవాడుకూడా సత్యం చెప్పటం లేదనే అర్థం. అంతేకాక, దీపం పెట్టినాకూడా మనకు కళ్ళు లేకపోయినా, నిద్రలో ఉన్నా, మనకు వస్తువులు కనబడవు. అంటే వస్తువులు కనబడటానికి కారణము మన లోని జ్ఞానప్రసారము. దీపము కేవలము సహకారి మాత్రమే. పూర్వపక్షంప్రకారం చీకటి పోయినవెంటనే వస్తువు కనబడాలి. చీకటి భావరూపమైనపుడు అది పోయినను, స్వతస్సిద్ధమైన జ్ఞానప్రసారము లేకపోతే, వస్తువులకు ప్రకాశము కలిగించబడదు. అందువలన అవిద్యపోయినా, పోగొట్టబడిన బ్రహ్మప్రకాశము తిరిగి రాదు.  అంటే, అవిద్యవలన స్వయంప్రకాశకత్వము పోగొట్టబడిన బ్రహ్మ అవిద్య తొలగిపోయినను, స్వయంప్రకాశకత్వమును పొందలేదు.

తరువాత ఈ అవిద్య బ్రహ్మలో ఉండటానికి అవకాశం లేదు. ఎందుకంటే, పూర్వపక్షం ప్రకారం బ్రహ్మ జ్ఞానాశ్రయం కాదు. అందువలన అవిద్య అనే అజ్ఞానాశ్రయంకూడా కాదు. అంతకుముందు చెప్పిన ఉదాహరణములో త్రాడు,పాముల జ్ఞానము అంటే, అక్కడ ఉన్న వస్తువు పాము కాదు, త్రాడు అన్న జ్ఞానము జ్ఞానాశ్రయముకాని తాడులో ఉండదు. జ్ఞానాశ్రయమైన చూచిన వ్యక్తిలో ఉంటుంది. బ్రహ్మ జ్ఞాత కాదు గనుక ఈ అనుమానప్రమాణము వర్తించదు. అవిద్యకు బ్రహ్మ ఆశ్రయము కాదు. కేవలము ఆచ్ఛాదనమే అని చెప్తే ఇంతకు ముందు చెప్పబడిన త్రాడు పాము అనే అనుమానప్రమాణములో త్రాడే పాము అను అజ్ఞానము త్రాటిని ఆవరించదు. తెలుసుకొనే జ్ఞాతను ఆచ్ఛాదిస్తుంది. ఇక్కడ త్రాడుంటే బ్రహ్మే కదా! అంటే బ్రహ్మను అవిద్య ఆచ్ఛాదించలేదు. బ్రహ్మ అవిద్యచేత మూయబడలేదు. ఎందుకంటే, అది త్రాడువలె జ్ఞానమునకు విషయము కాదు. ఏది అవిద్యచేత మూయబడుతుందో, అదే కదా జ్ఞానంవలన తెలియాలి. త్రాడు బదులుగా పాము కనిపించిందంటే దానికి కారణము, త్రాడు అవిద్యచేత మూయబడిందంటున్నాము. అసలు జ్ఞానమువలననే అది తెలియాలి. కాని, అలా తెలియబడితే బ్రహ్మ ప్రమేయము, జడము అయిపోతుంది. అంటే బ్రహ్మ బ్రహ్మే కాదన్నమాట. అదే విధముగా, వాక్యార్థజ్ఞానమువలన అవిద్యపోతుందని చెప్తున్నాం. అంటే, వాక్యార్థజ్ఞానమువలన బ్రహ్మ గోచరమౌతున్నదన్నమాట. అట్లు గోచరమైతే, పూర్వపక్షము ప్రకారము బ్రహ్మ జడము కనుక, బ్రహ్మ బ్రహ్మమే కాదు అన్న విషయం నిరూపించబడుతున్నది.

ఈ ప్రయత్నమంతా, అవిద్యను అనుమానప్రమాణముతో ఋజువు చెయ్యటానికి కదా! అంటే ఉదాహరణకు కొండమీద పొగ ఉన్నది కాబట్టి నిప్పు ఉండవలెను అని చెప్పినపుడు అలా చెప్పడానికి తర్కము, కారణము, ఉత్పత్తి ఉంటాయి. అంటే అవిద్య అనాది కాదు. అనాదికాని అవిద్య అనాదియైన బ్రహ్మను అపరమార్థముగా చేయలేదు. ఈ అవిద్య వాక్యార్థజ్ఞానమువలన నశిస్తున్నదని పూర్వపక్షములో చెప్పబడింది. అంతేకాక, ఈ అవిద్య భావరూపమని కూడా చెప్పబడింది. అట్టి భావరూపమైన పదార్థము యోగశక్తివల్లనో వేరొక శక్తివలనను రూపాంతరము చెందబడుతుంది. ఉదా॥ ఒక కుండపై శక్తిప్రయోగము జరిగినపుడు అది ముక్కలు కాగలదు. అనగా, రూపాన్తరము చెందుట. అంతేకాని శూన్యము కాదు. భావరూపమైన అవిద్యకూడ అదే విధముగా నాశనము కాలేదు. అంతేకాక, కేవలవాక్యార్థజ్ఞానమువలన ఏ భావరూపము నాశనము కాదు. ఈ జగత్తంతా భ్రమ అని చెప్పటంవలన ఆ జగత్తంతా నాశనము కాదు.

# శబ్దప్రమాణముచే అవిద్యానిరూపణము, దాని ఖండనము.

సదేవ సోమ్య ...మున్నగు ఉపనిషద్వాక్యములనుబట్టి బ్రహ్మ ఒక్కడే సత్యమని అందువలన కనబడుతున్న ఈ ప్రపంచమంతా మిథ్య అవాలని తలచి అట్టి మిథ్యాపదార్థమునకు కారణమైనది వేరొక మిథ్యాపదార్థము కావాలని అనుమానించి దానికి అవిద్య అని పేరుపెట్టి "అనృతేన హి ప్రత్యూఢాః" మొదలైన కొన్ని ఉపనిషద్వాక్యములను ఈ అవిద్యను చెప్పినట్లు వర్తింపజేసి ఈ అవిద్యయొక్క ఉనికిని నిరూపించుటకు పూర్వపక్షపు ప్రయత్నం జరిగింది. కాని ఈ ప్రపంచం అంతా మిథ్య అని, దానికి కారణంగా మరొక మిథ్యాభూతమైన అవిద్య భాసిస్తుందని ఏ శబ్దప్రమాణమూ ఘోషించలేదు అన్నది రామానుజుల సిద్ధాంతము. అసలు మిథ్యనుండి మిథ్య వస్తుందని కూడ నిర్ణయించలేము. భ్రాన్తిస్థలములో ఒక వస్తువు వేరొకవస్తువులా తోచడాన్ని వేరు వేరు దర్శనకారులు వేరువేరుగా భావించి వారి వారి అభిప్రాయాలను వివరించేరు. వీటిని ఖ్యాతులు అంటారు. ఖ్యాతి అంటే తెలియబడు విధానమన్నమాట. అందులో ముఖ్యమైనవి సంగ్రహంగా క్రిందని ఇయ్యబడినాయి.

**ఆత్మఖ్యాతి-** యోగాచారులగు బౌద్ధులు పాము త్రాడుగా కనబడటానికి కారణము మనలో ఉండే జ్ఞానమే అనగా ఆత్మయే అని అంటారు. అంటే, అక్కడ పాము లేకున్నను, మనజ్ఞానమునందింతకుముందున్న పాముయొక్క స్మృతివలన త్రాడు పాములా కనబడుతున్నదన్నమాట. దీనినే ఆత్మఖ్యాతి అంటారు.

అసత్ఖ్యాతి- ఆ బౌద్ధులలోనే శూన్యవాదులు అంతా శూన్యమే. అనగా అసత్ అంటారు. ఇది అసత్ఖ్యాతి.

అఖ్యాతి- మీమాంసకులు పాములక్షణములను గుర్తించక, త్రాడని, త్రాడు లక్షణములను గుర్తించక, పాము అని అనుకుంటామని, త్రాడు జ్ఞానము, పాము జ్ఞానమూ రెండూ యథార్థములేనని మీమాంసకులు అంటారు. ఇది అఖ్యాతి.

అన్యథా ఖ్యాతి- త్రాడుబదులుగా పామును తెలుసుకుంటున్నాము కాబట్టి అన్యథా ఖ్యాతి అనేవారు తార్కికులు.

అనిర్వచనీయఖ్యాతి- త్రాడుమీద కనబడుతున్న పాము సత్ అనిగాని, అసత్ అనిగాని నిర్వచించలేమని చెప్పునది శాంకరాద్వైతుల అనిర్వచనీయఖ్యాతి.

**యథార్థఖ్యాతి-** జ్ఞానాలన్నీ యథార్థాలే అని చెప్పు రామానుజీయులది యథార్థఖ్యాతి.

భగవద్రామానుజులు జ్ఞానమంతా యథార్థమే, కనబడే జగత్తుకాని కనబడని ఆత్మకాని పరమాత్మకాని అన్నియు యథార్థములే అని వివరిస్తారు. బహుస్యాం ప్రజాయేయ అని పరమాత్మ సంకల్పించిన తరువాత జరిగిన సృష్టిప్రక్రియలో సృష్టింపబడిన ఈ కనబడుతున్న జగత్తంతాకూడా పాంచభౌతికసమ్మేళనమే. అందువలన ఒక పదార్థముతో కొన్ని పోలికలుగల వేరు పదార్థములు ఉండడం సాధ్యం అవుతుంది. ఎందుకంటే, కొన్ని మూలకాలు కొన్ని పదార్థాల్లో సామాన్యంగా ఉంటాయికదా! అందువలన ముత్యపుచిప్ప వెండిలా మెరుస్తుంది. అంటే, ముత్యపుచిప్పలో రజతత్త్వభావమును మాత్రము మనము గ్రహించడంవల్ల అది వెండిలా కనబడుతుంది. అట్లు కాక, పెళుసుతనము, బరువు మొదలైన లక్షణాలను గ్రహిస్తే అది వెండి కాదు, ముత్యపుచిప్ప అని తెలుస్తుంది. పాము త్రాడులవిషయంలోకూడా జరిగేది ఇదే. సర్వసామాన్యధర్మములున్న ఒక సమూహమును జాతి అంటారు. సజాతీయలక్షణములుమాత్రమే గ్రహింపబడి, విజాతీయ లక్షణములు గ్రహింపబడకపోవటంచేత ఒక వస్తువును వేరొక వస్తువుగా భావించడం జరుగుతుంది. కాని ఆ భావజ్ఞానము, ఆ వస్తువులుకూడా యథార్థాలే అవుతాయి. అనగా, త్రాడును పాము అనుకున్నప్పుడు భయము కలుగుట, ముత్యపుచిప్పను వెండి అనుకున్నప్పుడు సంతోషము కలుగుట యథార్థముగా జరుగుతాయి. అంతేకాక, పాము అక్కడ అప్పుడు లేకున్నను, పాము అనునది యథార్థమే, అది వేరొకచోట, వేరొకసయమములో ఉండవచ్చు. అందువలన జ్ఞానములన్నియు

యథార్థములే అని భగవద్రామానుజుల సిద్ధాంతము. మనము ఇంతకుముందు కలలు అన్ని యథార్థాలే అనియు, మనకు లోకవ్యవహారములో అనుభవమునకు వచ్చు ఎండమావిలోని నీళ్ళు, జపాకుసుమములోని ఎరుపురంగు స్ఫటికములో కనబడుట, అద్దములో ప్రతిబింబము, వేగముగా త్రిప్పబడిన కొరివి నిప్పుచక్రంగా కనబడడం, ఇలా అన్ని జ్ఞానాలూకూడా యథార్థాలని యథార్థకారణజన్యాలని యథార్థవిధానము అనుసరించేవని చెప్పుకున్నాము. ఇదే విధముగా నాగపూర్‌లో ఉన్నపుడు హైదరాబాద్ దక్షిణముగా ఉన్నదని బెంగళూరులో ఉన్నపుడు హైదరాబాద్ ఉత్తరముగా నున్నదని చెప్పినపుడు ఈ చెప్పటంలో భేదమువలన దిక్కులు అయథార్థం అనుకొననక్కరలేదు. ఎందుకంటే ఇట్టి వ్యవహారభేదము ఆయా స్థలాల సాపేక్షతవలన వచ్చినది. అందుకే శ్రుతి దిశః శ్రోత్రాత్ నాభ్యాదాసీత్ అన్తరిక్షం అని ఆకాశానికీ దిక్కులకూ వేరువేరు ఉత్పత్తిస్థానాల్లో చెప్పుతూ దిశః అని దిక్కులు ఒక్కటికాదు అని బహువచనప్రయోగం చేసింది. అందువలన దిక్కులు అయథార్థాలనీ అనన్తాకాశం ఒక్కటేననీ అనుకొననక్కరలేదు.

ఇకముందు భగవద్రామానుజులు పూర్వపక్షముచేత చెప్పబడిన అనేకములైన అవిద్యనుగురించి చెప్పునట్లున్న ఉపనిషద్వాక్యములను ఉదాహరించి, వాటికి పూర్వపక్షవివరణము, తమ సమాధానము క్రమముగా ఉదాహరిస్తారు. వాటిలో కొన్ని మచ్చుకి కొన్ని వాక్యములను ఉదాహరణప్రాయంగా ఇక్కడ చెప్పబడుతున్నాయి.

అనృతేన హి ప్రత్యూఢాః –

**పూర్వపక్షము**–అవిద్యచేత అపహరించబడిపోయినాడు. భూమిలో పాతిపెట్టబడిన ధనంవిషయం తెలియక దారిద్ర్యాన్ని అనుభవించేవాడిలాగ పరబ్రహ్మసాన్నిధ్యంలోనే ఈ జీవులు ఆ విషయం తెలియక ఉన్నారు అని చెప్పబడిన ఛాందోగ్యోపనిషద్వాక్యము.

**సిద్ధాంతం**:– ఇక్కడ ఋతము అనగా భగవదారాధనరూపంగా కర్మలు చేయటం. అందువలన పరబ్రహ్మారాధనరూపంగా కర్మలు చెయ్యకపోవటమే పరబ్రహ్మను పొందలేకపోవటానికి కారణమని ఈ శ్రుతికి అర్థము.

**నాసదాసీత్ నోసదాసీత్ తమ ఆసీత్ తమసా గుఢమగ్రే ప్రచేతమ్– (తై.బ్రా);**

**పూర్వపక్షం**– సృష్టికి ముందు సత్ అసత్ లేవు, తమస్సుఉండి జ్ఞానము దానిచే కప్పబడి ఉన్నది. ఇక్కడ తమస్సు అంటే అవిద్య అన్నమాట.

**సిద్ధాంతం**:– ఈ వాక్యము **అవ్యక్త మక్షరం లీయతే, అక్షరం తమసి లీయతే, తమః పరే దేవే ఏకీ భవతి** అని ప్రళయసమయమును చెప్పుతూన్న సందర్భంలోనిది. అప్పుడు సత్ అనగా విడివిడిగా ఉన్న వ్యష్టిరూపములోనున్న ఆత్మలు. అసత్ అనగా వ్యష్టిరూపములోనున్న అచిత్పదార్థములు. ప్రళయసమయంలో చివరకు ఇవన్నీ పరబ్రహ్మములో లీనమవుతాయి అని అర్థం. ఇక్కడ తమస్సు అంటే అచిత్తు సమష్టిరూపము. అంటే ప్రకృతి అన్నమాట. అందువలన ఇక్కడ అవిద్యకాని అవిద్య బ్రహ్మను కప్పడంకాని చెప్పబడలేదు.

**మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరం ()**

**పూర్వపక్షం:–ప్రకృతి అనగా మాయ** అనగా మిథ్య అని తెలుసుకొనవలెను. అట్టి మిథ్యకు కారణము అవిద్య అవాలి కదా!

**సిద్ధాంతం**– మాయ అనగా మిథ్యకాదు. అనూహ్యమైన విచిత్రమైన వస్తువులను చేష్టలను కల్పించేది మాయ అని అంటారు ప్రకృతిలో వచ్చే మార్పులు కాని ప్రకృతి సృష్టివిచిత్రమునుకాని అనూహ్యము కనుక ప్రకృతిని మాయ అని అంటారు. అంతే తప్ప మాయ అంటే లేనిది, మిథ్య అనీ అర్థం కాదు. శ్రీమద్రామాయణంలో

ఇంద్రజిత్తు మాయా యుద్ధం చేయటంవల్ల వానరసేన అంతా మూర్ఛపడిపోయి, రామలక్ష్మణులు బంధింపబడినారు అన్నప్పుడు, మాయ అంటే మిథ్యయే అంటే ఇంద్రజిత్తు యుద్ధమే చేయలేదన్నమాట. అలాంటప్పుడు వానరసేన మూర్ఛపోవటం, రామలక్ష్మణులు బంధింపబడటం జరుగకూడదు కదా!

జ్యోతీంషి విష్ణుః భువనాని విష్ణుః ... సర్వం యదస్తి యన్నాస్తి చ (విష్ణుపురాణం)

పూర్వపక్షం: సూర్యచంద్రులు లోకములు, వనములు పర్వతములు, దిక్కులు, నదులు, సముద్రములు ఇలా ఉన్నదీ లేనిదీ కూడా బ్రహ్మమే అనగా బ్రహ్మ ఒక్కటే ఉన్నది తక్కినదంతయు మిథ్యయే.

సిద్ధాంతం: ఈ శ్లోకమునందు యదస్తి అనగా చైతన్యమున్న ఆత్మలు, యత్ నాస్తి అనగా, చైతన్యము లేని ప్రకృతి. ఆత్మలయందు ప్రకృతివస్తువులయందుకూడా పరబ్రహ్మ అంతర్యామిగా ఉన్నాడని ఈ శ్లోకమునకు అర్థము.

జ్ఞానస్వరూపో భగవాన్... శైలాబ్ధిధరాదిభేదాన్ జానీహి విజ్ఞానవిజృంభితాని,

పూర్వపక్షం పరబ్రహ్మము జ్ఞానస్వరూపుడు అనగా, జ్ఞానము ఆయనకు గుణముగా వేరుగా లేదు. ఈ ప్రపంచము అంతా ఆయన ఆకారమే. కాని అవిద్యమూలంగా ఇది పర్వతం, ఇది సముద్రము, అను భేదములు ఈ పరబ్రహ్మములో విలసిల్లుతున్నాయి.

సిద్ధాంతం పరబ్రహ్మ జ్ఞానము స్వరూపముగా గలవాడు అని చెప్పినంతమాత్రమున జ్ఞానము గుణముకాదని కాదు. జ్ఞానము పరబ్రహ్మకు గుణమని చెప్పిన శ్రుతులు ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఈ శ్లోకమునకు అర్థము పరబ్రహ్మముయొక్క సంకల్పజ్ఞానముచే పర్వతములు సముద్రములు మొదలైన భేదములతో సృష్టితమైన ప్రపంచములో వీటన్నిటియందు ఆయనే అంతర్యామిగా ఉంటాడు అని ఈ శ్లోకమునకు అర్థము.

యదా తు శుద్ధం నిజరూపి సర్వం కర్మక్షయే జ్ఞానమపాస్తదోషమ్

పూర్వపక్షం ప్రతిబంధకాలైన కర్మలు నశిస్తే అవిద్యపోయి పరిశుద్ధమైన జ్ఞానము తన స్వాభావికమైన రూపంలోకి వస్తుంది. అందువలన కర్మలు ప్రతిబంధకాలని పరబ్రహ్మ అను భావానికి బ్రహ్మవిచారం అవసరం లేదని, అవిద్య వాక్యార్థజ్ఞానంవల్ల పోవటం వల్ల పరిశుద్ధమైన బ్రహ్మానుభవం కలుగుతుందని తెలుస్తోంది.

సిద్ధాంతం – ఇక్కడ పరబ్రహ్మముచేత సృష్టించబడిన జీవులనిగురించి వర్ణిస్తున్నారు. జీవుడు స్వతస్సిద్ధముగా జ్ఞానైకాకారమైనను దేవమనుష్యాదిశరీరాలలో ఉండడంవలన ఆ శరీరాలు తానే అనుకొని లౌకిక కర్మలలో కాలం గడుపుతున్నాడు. అట్టి లౌకికకర్మలు వదలి బ్రహ్మోపాసన చెయ్యటంవల్ల స్వస్వరూపావిర్భావం కలిగి పరమాత్మను పొందుతాడు అని ఈ విష్ణుపురాణవాక్యానికి అర్థం.

వస్త్వస్తి, కిము పుత్ర చిదాదిమధ్య పర్యన్తహీనం సతతైకరూపం ()వి.పు

పూర్వపక్షం ఆదిమధ్యాంతములు లేనిది ఎల్లకాలము ఒకే విధంగా ఉండేదీ అయిన వస్తువు ఎక్కడైనా ఉన్నదా? ఏదైనా మరోవిధంగా మారుతూ, ఆకప్రకారంగా ఉండదు. మట్టి కుండ అవుతుంది, కుండ పెంకులు అవుతుంది, పెంకులు పిండి అవుతుంది, పిండి అడవులు అవుతాయి. ... అని ఈ శ్లోకాల్లో వస్తుభేదం అసత్యమని నిరూపించేరు.

సిద్ధాంతం– ఇక్కడ ఆత్మలకు ప్రకృతికి ఉన్న భేదాన్ని చెపుతున్నారు. ఆత్మ ఆదిమధ్యాంతరహితముగా ఎప్పుడూ ఏకాకారంగా ఉంటే ప్రకృతి పరిణామశీలం కలిగి ప్రవాహతోనిత్యంగా ఉంటుంది. అని ఈ శ్లోకానికి అర్థం.

తస్మాత్ న విజ్ఞానం మృతేస్తి కిఞ్చిత్...

పూర్వపక్షము విజ్ఞానం అనగా బ్రహ్మ తప్ప వేరుగా ఏవస్తువులు ఎక్కడా లేవు. అదొక్కటే ఉన్నది. కర్మభేదంవల్ల భేదమున్న మనస్సులవారిచేత అనేకవిధములుగా గ్రహించబడుతున్నది. అని ఈ శ్లోకంలో బ్రహ్మ ఒక్కటే సత్యమనిన్నీ, కర్మవిచారము బ్రహ్మానుభవానికి ప్రతిబంధకమని చెప్పేరు.

సిద్ధాంతము– ప్రకృతి ఎప్పుడూ మారుతూంటుంది కనుక అచిత్పదార్థములు ఎప్పుడూ ఎక్కడా అస్తి అని చెప్పమని, తాను ఇంతకుముందు చేసిన  కర్మలను బట్టి జన్మపరంపర సిద్ధిస్తుందని అది తెలుసుకొనుటయే స్థిమితమైన ఆత్మనిశ్చయమని, ఇట్లు మాటిమాటికీ మారే ప్రకృతి విషయము తెలుసుకొని బ్రహ్మోపాసనమార్గంలో ప్రవర్తించాలని ఈ శ్లోకాలకి అర్థం.

జ్ఞానం విశుద్ధం విమలం విశోకం.... (విపు)

పూర్వపక్షం: అజ్ఞానము లేనిది, భేదజ్ఞానము లేనిది, దుఃఖము లేనిది, కామక్రోధాదులతో సంబంధము లేనిదీ, ఒక్కటే అయినదీ, జన్మాదులు లేనిదీ, గొప్పదీ, అయిన జ్ఞానమే వాసుదేవుడు – అని ఈశ్లోకంలో జ్ఞానమొక్కటే ఉన్నదని చెప్పేరు.

సిద్ధాంతము– ఆత్మస్వరూపానికి కర్మలకీ సంబంధంలేదని అందుచేత అది ప్రకృతిస్పర్శలేదని, కామక్రోధాదులతో దానికి సంబంధము లేదని జన్మాదులు దానికి ఉండవని, పరబ్రహ్మకు ఈ ఆత్మ శరీరంగా ఉంటుందనీ ఈ శ్లోకతాత్పర్యం.

తద్భావ ఏవం భవతో మయోక్తః యథా సత్యం అసత్యమన్యత్... ( )

పూర్వపక్షం జ్ఞానం సత్యమనీ మిగిలినదంతా అసత్యమనీ లోకవ్యవహారాలకి విషయం అవిద్య అని దీని తాత్పర్యము.

సిద్ధాంతంఆ చిత్పదార్థం జ్ఞానాకారమని మాటలతో పిలవడానికి సాధ్యంకాదనీ అన్ని ఆత్మలూ ఒకేవిధంగా ఉంటాయనీ, వాటికి స్వరూపభేదాలు లేవనీ కర్మచేత అది ధరించిన వివిధదేహాలు అలా వ్యవహరించటానికి తగినట్లుగా దాన్ని చేస్తున్నాయని  మిగిలిన జగత్తంతా అచైతన్యమనీ, ఇలా చిత్తు అచిత్తులతో నిండి ఉన్న జగత్తంతా పరబ్రహ్మశరీరమేనని ఈ శ్లోకాలకు అర్థం. ఈ సందర్భంలో మనము ఈ శ్లోకాలు విష్ణుపురాణంలో మైత్రేయునికి పరాశరుడు ఈ సృష్టివివరాలు చెప్పుతున్నప్పుడు చెప్పబడిన శ్లోకాలని తెలుసుకొనవలెను. మొత్తం సృష్టివివరాన్నీ చెప్పినతరువాత, గంభీరమైన ఉపదేశంమధ్య నేను చెప్పినదంతా మిథ్యే అని ఎవరూ చెప్పరు గదా! తరువాతి శ్లోకాలలో కూడా విష్ణ్వాధారం  ఇత్యాదిశ్లోకాలలో ఈ లోకాలన్నింటికీ విష్ణువే ఆధారమని జ్ఞానము స్వాభావికస్వరూపం కనుక ప్రధానమని, అచిత్తు కర్మనిమిత్తంగా మారుతుంది కనుక అప్రధానమని చెపుతాయి. కనుక, అవిద్య పైన చెప్పబడిన శ్రుతిపురాణవాక్యాలలో ఎక్కడా అవిద్య ప్రసక్తియే లేదు కనుక శబ్దప్రమాణముచేత అవిద్య నిరూపించబడలేదు.

# నివర్తకానుపపత్తి

తత్త్వమసి మొదలైన మహావాక్యాల అర్థజ్ఞానం తెలుసుకొనటంచేత, బ్రహ్మ నిర్విశేషమని, బ్రహ్మము తప్ప వేరొకటి లేదని, అనగా చేతనాచేతనములతోభాసించుచున్న ఈ జగత్తంతా మిథ్య అనియు, దీనికి కారణము అవిద్య అను అజ్ఞానమనియు, ఆ వాక్యార్థజ్ఞానం అవిద్యానివర్తకమౌతుందని పూర్వపక్షమునందు చెప్పబడినది. దీనిని సమర్థించుకొనుటకు 'తత్త్వమసి' అను వాక్యమునకు **తత్** అనగా సజాతీయ,విజాతీయ,స్వగతభేదములులేని

నిర్విశేషబ్రహ్మమని, **త్వం** అనగా అవిద్యచేత నీవు అనబడు అజ్ఞానావృతమైన బ్రహ్మమని, ఆ నిర్విశేషబ్రహ్మమే నీవు, అని తెలుసుకొనడం అవిద్యానివర్తకమౌతుందని, తత్త్వమసివాక్యార్థంగా పూర్వపక్షమునందు చెప్తారు.

కాని బ్రహ్మనిర్విశేషమని ఆ జ్ఞానము కలిగినంతమాత్రమున మోక్షమని చెప్పెడు పూర్వపక్షము సరికాదు. ఎందుకంటే మోక్షం ఎలా వస్తుందో చెప్పిన కొన్ని శ్రుతులు బ్రహ్మను సవిశేషమనే చెప్పుతాయి. ఉదా 'వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్। తమేవం విద్వానమృత ఇహ భవతి నాన్యః పన్థా విద్యతేయనాయ' (తై.ఆ.3-12), అనగా సూర్యునివలె భాసిస్తూ ప్రకృతికి ఆవలనున్న గొప్ప పురుషుడిని నేను ఉపాసిస్తున్నాను. అతనే ఈ లోకంలో ఇలా ఉపాసించేవాడు ముక్తుడవుతున్నాడు, దీనికి వేరొక మార్గము లేదు అని బ్రహ్మకు రంగు గొప్పదనము మొదలైన విశేషాలు చెప్పబడ్డాయి. 'సర్వే నిమేషా జజ్ఞిరే విద్యుతః పురుషాదధి'(తై.ఆ.10-1), 'న తస్యేశే కశ్చన తస్యనామ మహద్యశః' (తై.ఆ.10-2), 'య ఏనం విదురమృతాస్తే భవన్తి'(తై.ఆ.10-2) మెరుపువంటి శరీరవర్ణము కలవానినుండి కాలము ఉద్భవించింది. అతనిని నియమించేవాడు మరొకడు లేడు ఆయన పేరు మహద్యశః. అతనిని ఇలా ఎవడు ఉపాసిస్తాడో వాడు ముక్తుడౌతాడు. అని ఆ బ్రహ్మముయొక్క రంగు, పేరు, గొప్పదనము మొదలైన విశేషాలు చెప్పబడినాయి. అందువలన పరబ్రహ్మము నిర్విశేషమనుట సరి కాదు.

తత్త్వమసి అను వాక్యమునకు పూర్వపక్షులు చెప్పు అర్థము సందర్భపరముగాను, వ్యాకరణపరముగను కూడా కుదరదు. ఎందుకంటే ఈ వాక్యము మనము ఇంతకు ముందు చెప్పుకున్న ఛాందోగ్యోపనిషత్తులోని సద్విద్యాప్రకరణములోని ఉపసంహారవాక్యము. అంతకు ముందువాక్యాల్లో బ్రహ్మ ఉన్నాడని చెప్తూ ఆయన సృష్టికి సంకల్పించేసేడని, తదైక్షత బహుస్యాం ప్రజాయేయ అని చెప్పేరు. ఇక్కడ చెప్పబడిన **సత్** సంకల్పమాత్రమున సృష్టికార్యమును నిర్వహించిన పరబ్రహ్మ, సత్యసంకల్పుడు, సర్వజ్ఞుడు అయి ఉండాలి. ఇట్లు సృష్టించిన తరువాత పరబ్రహ్మ దానిలో ప్రవేశించి **సత్** అనబడు చేతనపదార్థముగాను, **త్యత్** అనబడు అచేతనపదార్థముగాను అయినట్లుగా తత్సృష్ట్వా, తదేవానుప్రావిశత్, తదనుప్రవిశ్య సచ్చ త్యచ్చ అభవత్ అని చెప్తారు. ఆ పరబ్రహ్మ అనుప్రవేశముచేత, ఆ చేతనాచేతనములన్నియు నామరూపవ్యాకరణములు కలిగి వ్యవహారయోగ్యములుగా అయినాయని అనేన జీవేన...వ్యాకరవాణి అన్న వాక్యం చెప్తుంది. అంటే ఈ జగత్తులో చేతనాచేతనాలన్నింటికి అంతర్యామిగా పరబ్రహ్మమే ఉంటుంది. 'నేను మనుష్యుడను' అన్నపుడు నేను అన్నపదము, మనుష్యత్వమున్న నేనుచే తెలుపబడిన ఆత్మ, మనుష్యత్వమును తెలుపు శరీరమునకు ఎలా వర్తిస్తోందో, తత్ అను పదముచే చెప్పబడిన అంతర్యామిగా ఉన్న పరబ్రహ్మము త్వం అను పదముచే చెప్పబడిన ఆ పరబ్రహ్మమునకు శరీరమైన చేతనాచేతనములకు వర్తిస్తుంది. అనగా, 'నేను మనుష్యుడను' అన్నప్పుడు శరీరమునకు సంబంధించిన మనుష్యత్వము, నేను అని చెప్పబడిన ఆత్మలో ఎలా పర్యవసిస్తున్నదో, అదే విధముగా త్వం అను పదముచే చెప్పబడిన ఆత్మత్వము, తత్ అని చెప్పబడే తదంతర్యామియైన పరబ్రహ్మములో పర్యవసిస్తుంది. ఎందుకంటే, శరీరి-శరీరముల సంబంధము అపృథక్సిద్ధము. అనగా, అవి విడిగా ఎప్పుడూ ఉండవు. శరీరమనగా ఆత్మనే ఆశ్రయించి, ఆత్మప్రయోజనమునకే ఉండి నియతవిశేషణత్వము కలిగి అనగా శరీరవాచకవిశేషణములు ఆత్మకు చెందుతూ, ఆత్మకు అతిశయాన్ని ఆవిష్కరిస్తూ ఆ ఆత్మలేకుండా ఉండలేనిది శరీరము. పరబ్రహ్మమునకు చేతనాచేతనములకు గల సంబంధము ఇట్టి శరీరశరీరిసంబంధమే. ఇందువలన నీవు ఆ పరబ్రహ్మాత్మకుడవే అనగా, ఆ పరబ్రహ్మమును ఆత్మగా గలిగి, దానివలననే సత్త అనగా ఉనికిగలవాడవు అని చెప్పడమే తత్త్వమసి వాక్యమునకు ప్రయోజనము. అట్లుకాక, పూర్వపక్షమునందు చెప్పినట్లు దోషరహితము, జ్ఞానస్వరూపము

అయిన పరబ్రహ్మము, అజ్ఞానాశ్రయమైన జీవుడు, ఒక్కటే అని చెప్పుట సమంజసము కాదు. దీనికి సమాధానముగా పూర్వపక్షి, మదరాసులో ఉన్న దేవదత్తుడు, బెంగళూరిలోని దేవదత్తుడే. 'అప్పుడు మదరాసులో ఉన్న దేవదత్తుడే ఈ దేవదత్తుడు' అని చెప్పినట్లు ఆ దోషరహితము, జ్ఞానస్వరూపము అయిన పరబ్రహ్మమే ఈ దోషపూరితుడైన జీవుడు అని ఎందుకు చెప్పకూడదు? అని పూర్వపక్షి సమర్థించుకుంటాడు. కాని ఈ ఉదాహరణము ఇక్కడ సరిపడదు. ఎందుకంటే, మదరాసులోని దేవదత్తుడిని, మన ఎదురుగానున్న దేవదత్తుడితో పోల్చి చెప్పినప్పుడు రెండు సందర్భములలోను దేశకాలపరిస్థితులు వేరు. అందువలన ఆ ఉదాహరణము చూపి జీవబ్రహ్మైక్యతను సమర్థించుకొనలేము.

**తత్, త్వమ్** అను ఈ పదములు ఈ వాక్యములో సర్వనామములు. అనగా ఇంతకు ముందు చెప్పబడిన పరబ్రహ్మము, అంతకు ముందు తదైక్షత మొదలైన వాక్యములయందు సత్యసంకల్పత్వము, సర్వజ్ఞత్వము, అన్తర్యామిత్వము మొదలైన గుణములుకల పరబ్రహ్మ చెప్పబడినది. వ్యాకరణము ప్రకారము సర్వనామముతో ఒక వస్తువునుగాని, వ్యక్తినిగాని సంబోధించవలసివచ్చినపుడు, ఆ వ్యక్తిగాని, వస్తువుగాని విశేషములు కలిగి, అట్టి విశేషములుగల ఆ వస్తువో, ఆ వ్యక్తియో సంబోధించబడాలి. అందువలన **తత్** అనే సర్వనామముతో చెప్పబడిన పరబ్రహ్మము నిర్విశేషము కాజాలదు.

రెండు వస్తువులుగాని, ఇద్దరు వ్యక్తులుగాని వారి సంబంధమును చెప్పవలసివచ్చినపుడు వాటిలో ఒక్కటైనా ముఖ్యార్థాన్ని బోధించితీరాలి. ఆ రెంటికీ, అముఖ్యార్థం చెప్తూ లక్షణావృత్తిపదములతో వాటి సంబంధము నిర్వహించటం కుదరదు. ఉదాహరణకు 'రాముడు సింహము' అని చెప్పినపుడు 'రాముడు' అన్నపదము నేరుగా వ్యక్తిని బోధిస్తుంది. 'సింహము' అను పదము లక్షణావృత్తిద్వారా సింహమువంటి శౌర్యము కలవాడు అన్న విషయాన్ని చెప్తుంది. ఇదే విధముగా, 'లక్ష్మిముఖము పద్మము' అన్నపుడు లక్ష్మిముఖము అన్నపదం ముఖ్యార్థాన్ని చెప్తుండగా, పద్మము అన్నపదము గౌణముగా అందమైనది అను విషయాన్ని చెప్తుంది. ఈ వాక్యంలో, **తత్ త్వం**, రెండూ కూడా లాక్షణికపదాలైతే వాటి ఐక్యత చెప్పలేము. కనుక, పూర్వపక్షమునందు చెప్పబడినట్లు లాక్షణికంగా తత్ అనగా, జ్ఞానస్వరూపబ్రహ్మమని, త్వం అనగా అజ్ఞానావృతమైన బ్రహ్మమనీ చెప్పి వాటి ఐక్యతని చెప్పడం సాధ్యం కాదు. దీనికి సమాధానంగా పూర్వపక్షులు 'ఇది వెండికాదు ముత్యపు చిప్పయే' అని చెప్పినట్లు 'నీవు జీవుడవు కావు బ్రహ్మనివే' అని అర్థంచెప్పుకోవాలి' అంటారు. కాని 'ఇది వెండి కాదు ముత్యపుచిప్పే' అన్నవిషయం ప్రత్యక్షప్రమాణం వల్ల తెలిసింది. కాని జీవుడు జీవుడు కాడు బ్రహ్మే అన్న విషయం ఏ ప్రమాణంవల్లా తెలియదు. అంతేకాక ముత్యపుచిప్పను వెండిగా ముందు అనుకొనడానికి, తరువాత వెండి కాదని తెలుసుకొనడానికీ హేతువులు ముందు కనబడిన ముత్యపుచిప్పయొక్క మెరిసే లక్షణము, తరువాత అది వెండి కాదని, తరువాత తెలిసిన దానికి గల తెలుపుదనము అనే లక్షణము. కాని లక్షణములేలేని బ్రహ్మను ఏ లక్షణాలను బట్టి వస్తువుతో లేదా వ్యక్తితో ఐక్యత చెప్పగలము? ముత్యపుచిప్ప ఉదాహరణలో ముత్యపుచిప్ప వెండి కాదన్నవిషయం తెలుస్తున్నది తెలుసుకుంటున్న జ్ఞాతకితప్ప ముత్యపుచిప్పకి కాదు. పూర్వపక్షం ప్రకారం బ్రహ్మ జ్ఞాతకాడు గనుక బ్రహ్మకు భ్రాన్తి కలగడం, దాని నివారణం, రెండూ కుదరవు.

రాముడే కృష్ణుడు అని చెప్పవలసివచ్చినప్పుడు రాముడి లక్షణములన్నియు కృష్ణుడిలో ఉండాలి. ఇక్కడ బ్రహ్మకు లక్షణములే లేవు. జీవుడికి అవిద్య అనే దోషం ఉన్నది. అంటే అది విశేషమే కదా! అందువలన ఆ రెంటికీ ఐక్యత చెప్పలేము. తమ వాదాన్ని సమర్థించుకొనేందుకు పూర్వపక్షులు క్రిందచెప్పబడిన శ్రుతివాక్యాలని ఉదాహరిస్తారు.

సర్వం ఖల్విదం బ్రహ్మ - అంటే ఇదంతా బ్రహ్మమే. వేరొకటి లేదు. అని పూర్వపక్షం. దీనికి సమాధానం - ఈ సమస్తము బ్రహ్మాత్మకమే.

ఈ శ్రుతి తరువాతి వాక్యము తజ్జలాన్ ఇతి శాన్త ఉపాసీత. అనగా దేనియందు పుట్టి, రక్షించబడి, లయమవుతుందో, అట్టి బ్రహ్మను శాన్తచిత్తుడై ఉపాసించాలి అని అర్థం. ఉపాసనము అని చెప్పినపుడు ఉపాసించే వాడు, ఉపాస్యము అని రెండు ఉన్నట్లే గదా, అందువలన రెండు ఒకటే అని చెప్పటం కుదరదు.

ఐతదాత్మ్యమిదం సర్వమ్ అన్న శ్రుతివాక్యానికి ఇదంతా ఆత్మయే అని పూర్వపక్షులు అర్థం చెప్పుతారు కాని ఈ శ్రుతికి అర్థము- కనిపించే జీవుడితోకూడిన ఇదంతా, ఆ పరమాత్మనే ఆత్మగా కలది అని తెలుసుకొనవలెను.

ఇలాగే సన్మూలాః సోమ్య ఇమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః అని అంటే వివిధశరీరములుగల జీవులందరూ బ్రహ్మమునే మూలకారణముగా గలవారు, బ్రహ్మమునే ఆధారముగా గలవారు, బ్రహ్మమునందే లయమును పొందువారు అని అర్థము.

ఇట్టి శ్రుతులమూలముగా జీవబ్రహ్మల అపృథక్సిద్ధసంబంధము నిరూపణమౌతోంది.

పరబ్రహ్మన్ని చేతనాచేతనపదార్థములకు అంతర్యామిగా చెప్పటంవల్ల తత్త్వమసివాక్యార్థాన్ని సిద్ధాంతంలో సాధించడం అయింది. కాని, పరమాత్మ అంతర్యామిత్వాన్ని శ్రుతులు స్పష్టంగా నిరూపిస్తున్నాయా అని ప్రశ్న. దీనికి సమాధానంగా, క్రింది శ్రుతివాక్యాలు ఉదాహరించబడుతున్నాయి. అంతఃప్రవిష్టః శాస్తా జనానామ్ సర్వాత్మా అన్న శ్రుతి పరబ్రహ్మము లోపల ప్రవేశించి జనమును నియమనం చేస్తున్నాడుగనుక ఇతడు సర్వమునకు ఆత్మ అని చెప్తున్నది. యః పృథివ్యాం తిష్ఠన్...అన్తర్యామీ అమృతః అన్న శ్రుతి ఎవడు పృథివియందున్నవాడై పృథివిలోపలనుండి పృథివిచే తెలుసుకొనబడక పృథివిని శరీరముగా కలవాడో అతడు ఈ ఆత్మ, అంతర్యామియు, అమృతుడును- అని పరమాత్మను చెప్పుచున్నది. అదే విధముగా య ఆత్మని తిష్ఠన్ అన్న శ్రుతివాక్యము ఎవడు ఆత్మయందున్నవాడై, ఆత్మలోపలనుండి, ఆత్మచే తెలుసుకొనబడక, ఆత్మను లోపలనుండి నియమించు చున్నాడో, వాడే ఆత్మయు, అంతర్యామియు అమృతుడును అని చెపుతుంది. ఈ విధముగా అంతర్యామిబ్రాహ్మణము నందు అనేకోదాహరణములతో పరబ్రహ్మముయొక్క అంతర్యామిత్వము నిరూపించబడినది. అట్టి పరబ్రహ్మము, సర్వభూతాన్తరాత్మా అపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణః అని ఆయనే సర్వభూతములకు అంతరాత్మయని, అపహతపాప్ముడనియు, ప్రకృతిసంబంధము లేనివాడును ఒక్కడును అగు నారాయణుడు అని నిర్వచిస్తున్నది. ఈ విధముగా పరబ్రహ్మముయొక్క అన్తర్యామిత్వమును శ్రుతులన్నీ కంఠరవేణ ఘోషిస్తున్నాయి.

తత్త్వమసివాక్యార్థము చెప్పుటకు పూర్వపక్షములో ఇంతకు ముందు అనుకున్నట్లుగా కుండ, కుంభము ఒక్కటే అని చెప్పినట్లు ఐక్యసామానాధికరణ్యం ప్రకారము తత్ అనబడే పరబ్రహ్మ, త్వం అనబడే జీవుడు ఒక్కటియే అని చెప్పుటకు ప్రయత్నించబడింది. కాని **తత్, త్వం** అను పదములు కుంభము, కుండవలె పర్యాయపదములు కానందువలన ఐక్యసామానాధికరణ్యము ఇచ్చట చెల్లదు. ఇంతకుముందు అనుకున్నట్టుగానే ఇక్కడ కూడా విశేషణవిశేష్యసామానాధికరణ్యముగానే తీసుకొనవలెను. అంటే, విశేష్యమైన పరమాత్మకు శరీరమైన జీవాత్మ విశేషణమౌతుంది. కాని, తెల్లబట్ట, నల్లకుండ అన్నప్పుడు బట్టకు, కుండకు విశేషణముగా ఒక ధర్మమో, గుణమో మనం చూస్తాం. అలా కాకుండా ఈ తత్త్వమసివాక్యంలో పరమాత్మకు ఆత్మ విశేషణమంటే ఒక ద్రవ్యమునకు వేరొకద్రవ్యము విశేషణమౌతోంది అన్నమాట. ఈ విధంగా విశేషణవిశేష్యసామానాధికరణ్యం

చెప్పవచ్చునా అని ప్రశ్న దీనిని ఒక ఉదాహరణంద్వారా వివరించుకుందాం. తెల్లని కేశములున్నవాడు రంగు వేసుకున్నందువల్ల నల్లని వేశములు గలవాడైనాడు. ఇక్కడ కేశములు ద్రవ్యమే విశేషణము కూడ అవుతుంది. అందువల్ల ద్రవ్యము విశేషణముగా ఉండుట తప్పుకాదు. కాని, శరీరమే విశేషణముగా ఉండవచ్చా అని మరియొక సందేహము. ఈ జీవుడు పుణ్యకర్మచేత దేవశరీరాన్ని, పాపకర్మచేత తిర్యచ్ఛరీరాన్ని పొందేదు అంటే, అక్కడ జీవుడికి శరీరం విశేషణమే గదా! అదే విధముగా పరమాత్మకు జీవాత్మ విశేషణమౌతుంది. కాని దండి అన్నపదంలో దండము అన్న పదం దండముకల వ్యక్తియందు పర్యవసించదు. ఎందుకంటే దండము ఆ వ్యక్తిని విడచి వేరుగా ఉండ గలదు. కాని శరీరశరీరిసంబంధమునందు అనగా ఆత్మపరమాత్మలసంబంధమునందు అవి రెండూ వేరుగా ఉండలేవు గనుక ఆత్మత్వము పరమాత్మయందు పర్యవసిస్తుంది. అందువలన తత్త్వమసివాక్యమునకు విశేషణవిశేష్యసామానాధికరణము వర్తిస్తుంది.

## తత్త్వమసివాక్యము విశిష్టాద్వైతపరంగానే సాధించబడుతుంది.

ఈ తత్త్వమసివాక్యాన్ని జీవబ్రహ్మల అభేదముతో సాధించలేమని ఇంతవరకూ చూసేము. అయితే. భాస్కరులు యాదవప్రకాశులు చెప్పిన భేదాభేదసిద్ధాంతప్రకారముగాని, ద్వైతసిద్ధాంతప్రకారముగాని ఈ వాక్యవివరణము సాధింపసాధ్యమా అని మరియొక ప్రశ్న.

భాస్కరులు జీవబ్రహ్మలకు భేదము ఔపాధికమని, అనగా, ఒక ఉపాధివలన కలిగిందని, ఆ ఉపాధి నశించినప్పుడు జీవబ్రహ్మలకు భేదం లేదని చెప్తారు. అనగా, కుండపరిధినిబట్టి ఒక కుండలో ఉన్న ఆకాశానికి, వెలుపలనున్న ఆకాశానికీ భేదముంటుంది. కాని ఆ కుండ నాశనమైనపుడు ఆ భేదము ఉండదు. ఈ విధముగా కుండవెలుపలనున్న ఆకాశమే కుండలోపలనున్న ఆకాశమని చెప్పినట్లు తత్త్వమసివాక్యమునకు భాస్కరీయులు **తత్ త్వం** అను పదములకు చెప్పబడిన పరబ్రహ్మమునకు, జీవుడికి అభేదమును చెప్తారు. కాని బ్రహ్మమే ఉపాధి వలన జీవుడైతే, ఆ బ్రహ్మలోనే జీవునికి మనము చెప్పుకొనే దోషములు ఉన్నట్లవుతుంది. అట్లైన దోషములు లేని పరమాత్మే జీవుడు అని చెప్పడం అసంబద్ధమైనది. అందువలన భాస్కరీయుల మతముప్రకారము తత్త్వమసివాక్యార్థనిర్వహణము కుదరదు.

ఈ భేదాభేదవాదులలో ఒకరైన యాదవప్రకాశులు బ్రహ్మము ఒకటియే అనియు దానినుండి చిదచిదీశ్వరులు మూడు అంశములు ఏర్పడినవనియు, ఈ మూడు అంశములకు కారణమైన బ్రహ్మము వేరనియు, ప్రళయదశలో ఈ మూడును బ్రహ్మములో లయమగుటవలన ఏకద్రవ్యముగా ఉండుటచే అభేదమనియు చెప్తారు. అనగా, ఒక పెద్ద మట్టిముద్దనుండి, కుండలు, ప్రమిదలు, చేయబడినప్పుడు ఆ మట్టిముద్దకు కుండలకు ప్రమిదలకు భేదముంటుంది. మళ్ళీ తిరిగి ఆ కుండలు ప్రమిదలు మన్ను అయిపోయి మట్టిముద్దలో కలిసిపోతే అభేదమే. ఈవిధముగా మట్టిముద్దయే కుండ అన్నట్టుగా తత్, త్వం పదవాచ్యులైన బ్రహ్మ, జీవులకు అభేదము అని ఈ వాక్యములను యాదవప్రకాశీయులు వివరించారు. కాని ఇది కూడా కుదరదు. దీనికి సమాధానముగా భగవద్రామానుజులు బ్రహ్మ స్వయంగా జీవుడు అవుతున్నాడు అంటే బ్రహ్మలో దోషాలు ప్రవేశిస్తాయి కనుక, బ్రహ్మజీవైక్యము కుదరదని చెప్పుచు అన్ని శ్రుతులకును ముఖ్యార్థమునే చెప్పవలెను కాని లాక్షణికపద్ధతిని గ్రహింపరాదని, అట్లు అన్ని శ్రుతులను నిర్దుష్టమైన సమన్వయము ఎట్లు చెయ్యవలెనో ఆ వివరాలను తమ సిద్ధాంతమునందు విశదీకరిస్తారు. వాటిలో కొన్ని వివరాలు క్రిందను ఈయబడినాయి.

కొన్ని శ్రుతులు అచిత్పదార్థమునకు, చేతనవర్గమునకు పరబ్రహ్మమునకు భోగ్యత్వమునుబట్టి, నియంతృత్వమునుబట్టి, పరస్పరస్వరూపభేదమున్నట్టు తెలుపుతున్నవి. ఉదాహరణకు అస్మాన్ మాయీ సృజతే

విశ్వం ఏతత్ తస్మింశ్చ అన్యః మాయయా సన్నిరుద్ధః (శ్వే.4-9), మాయ అనగా మూలప్రకృతికలవాడైన పరబ్రహ్మము. దానిచే ఈ విశ్వమునంతను సృష్టించుచున్నాడు. అందులో నొకడు ఆ మాయచే బద్ధుడై తనశక్తినే కోల్పోయినాడు. మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరం (శ్వే.4-10) మాయ అనగా మూలప్రకృతి. దానికి ఆశ్రయమై దానిని మహాశక్తివంతుడైన పరబ్రహ్మ నియంత్రిస్తున్నాడు. క్షరం ప్రధానం అమృతాక్షరం హరః, క్షరాత్మనా వీశతే దేవః ఏకః(శ్వే.1-10) క్షరము అయినది వికారాస్పదమైన ప్రకృతి, ఆ ప్రకృతిలోని ఫలములను ఆస్వాదిస్తూ జీవుడు అక్షరుడు. ఆరెండినీ నియమించు ఈశ్వరుడు ఒక్కడే. ఈ శ్రుతి వాక్యములు జీవబ్రహ్మల భేదాన్ని చూపుతున్నాయి. స కారణం కరణాధిపో అధిపః నచాస్య కశ్చిత్ జనితా నచాధిపః అన్న శ్రుతి పరబ్రహ్మ వేరనియు, ఆయన సర్వకారణమనియు, జీవుడుకూడ అధిపుడు నియామకుడు అనియు, ఆ పరబ్రహ్మమునకు వేరే సృష్టికర్తగాని, నియామకుడు కాని లేడనియు చెప్పుతున్నది. ప్రధానక్షేత్రజ్ఞపతిః అన్న శ్రుతివాక్యము ప్రకృతికిని, క్షేత్రజ్ఞుడనబడు జీవునికిని, పరబ్రహ్మ రక్షకుడై నియామకుడని చెప్పుతున్నది.

పతిం విశ్వస్య ఆత్మేశ్వరం శాశ్వతం శివం అచ్యుతం అన్న మంత్రం పరబ్రహ్మమే సమస్తప్రపంచమునకు శేషి అని, ఆయన తనకు తానే శేషి అనియు, ఆయనపై మరొక స్వామి లేడని, తెలుపుతున్నది. శాశ్వత, శివ, అచ్యుత, పదములు నిత్యత్వమును, శుభాస్పదత్వమును, స్వరూపపరిణామాదిరాహిత్యమును పరబ్రహ్మకు విశేషణములుగా తెలుపుతున్నవి. జ్ఞాజ్ఞౌ ద్వా వీశనీశౌ (శ్వే.1-9) అను శ్రుతివాక్యము సర్వజ్ఞుడైన ఈశ్వరుడు ఒకడని, అజ్ఞుడు, అనీశుడు, అయిన జీవుడు మరొకడని, వీరిద్దరూ పుట్టుక లేనివారని చెప్పుతూ జీవేశ్వరభేదమును చెప్పుతున్నది. నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానాం (శ్వే.6-13, కఠ.5-13) అను వాక్యము, నిత్యులు అనేకులు అయిన చేతనులకు నిత్యుడు చేతనుడు అయిన పరమాత్మ ఒక్కడే కామములను తీర్చుచున్నాడు అనుటచేత జీవేశ్వరభేదము స్పష్టమైనది. భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా (శ్వే.1-1) అన్న వాక్యము జీవునిలో భోక్తృత్వమును, ప్రకృతిలో భోగ్యత్వమును, ఈశ్వరునిలో ప్రేరకత్వమును చెప్పి, ఇట్లు చిదచిదీశ్వరులకు స్వరూపభేదమును తెలుపుచున్నవి. ద్వా సుపర్ణా సయుజా సఖాయా (ముం.3-1-1, శ్వే.4-6) రెండు పక్షులు ఒక చెట్టుమీద వాలి ఉన్నవని, అందులో ఒక పక్షి అనగా జీవుడు ఫలములను అనుభవించుచు, అశక్తుడై ఉన్నాడనియు మరొకపక్షి అనగా ఈశ్వరుడు, ఆ ఫలములను అనుభవించక ఉజ్జ్వలముగా ప్రకాశిస్తున్నాడని. తెలుపుచు జీవేశ్వరభేదమును నిరూపిస్తుంది. పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా (శ్వే.1-6) అన్న వాక్యము జీవాత్మకన్న పరమాత్మ విలక్షణుడని, ఆ జీవాత్మకి అంతర్యామి అనియు తెలుసుకొని ఉపాసించుటవలన ఆ జీవుడు ఆయనచే అనుగ్రహించబడి మోక్షమును పొందుతాడని చెప్పబడింది. ఇచ్చట పృథక్పదము జీవేశ్వరుల భేదమును స్పష్టముగా మోక్షమునిచ్చువాడొకడు, దానిని స్వీకరించువాడు వేరొకడు అని నిరూపిస్తున్నది. అజా మేకాం (తై.12-5) అను శ్రుతివాక్యము గుణత్రయాశ్రయమైన ప్రకృతిని దాని ఫలితమును ఆస్వాదించి, దుఃఖమును పొందెడి జీవుని; ఆఫలములను అనుభవించక, అతనికంటె భిన్నముగా నున్న ఈశ్వరుని; చెప్పుచు వారి భేదమును నిర్ధారిస్తున్నది. భూమిరాపః... అహంకార ఇతీయం మే ... ఇతస్త్వన్యాం ప్రకృతిం...జీవభూతాన్ ... ధార్యతే జగత్ అను భగవద్గీతా శ్లోకములలో కృష్ణభగవానుడు తన అంశముగా అష్టవిధప్రకృతిస్వరూపములు, తద్భిన్నముగా నున్న జీవరాశి స్వరూపములను తెలిపి, ఆ జగత్తునంతయు నేనే భరించుచుంటిని అని చెప్పుటవలన జీవప్రకృతులకు పరబ్రహ్మమే ఆధారమని, శేషి అని, తెలుస్తోంది. అదే భగవద్గీతలో సర్వభూతాని కౌన్తేయ... ప్రకృతేర్వశాత్ అను శ్లోకములలో కల్పక్షయమునందు సర్వప్రాణులు నాలో లీనమగునని, తిరిగి కల్పాదిలో నేనే నానుండి వెలికి తీసి సృష్టింతుననియు, ఇట్లు సృష్టిప్రళయములను చేయుచున్నను, ప్రకృతిం స్వాం అవష్టభ్య

అని నాలో ఎట్టి మార్పులు కలుగవని, మయాధ్యక్షేణ .. జగద్ధి పరివర్తతే అను శ్లోకమున సర్వాధ్యక్షుడనైన నేను ఈ ప్రకృతిని చరాచరరూపముగా సృష్టించుచున్నానని, ఆకారణముచే చేతనాచేతనాత్మకజగత్తులో మార్పు కలుగుతుందనిగాని, నాలో ఏమార్పు లేదని కృష్ణభగవానుడు చెప్పుచున్నాడు.

ప్రకృతిం పురుషంచైవ అను శ్లోకమునందును, మమ యోనిర్మహద్బ్రహ్మ అను శ్లోకమునందును చేతనాచేతనములు రెండును అనాదిపదార్థములేనని స్పష్టీకరించి జీవరాశిని ప్రకృతితో కలిపి దేవతిర్యఙ్మనుష్యాది వివిధసృష్టిని నేనే చేయుచుంటినని జగత్తునంతటికిని మూలకారణమైన అచేతనప్రకృతియందు జీవరాశి యను గర్భమును చేర్చి తద్వారా దేవాదిస్థావరాంతరములైన సర్వపదార్థములను తానే సృష్టించుచుంటినని కృష్ణభగవానుడు తెలిపియున్నాడు. ఈ శ్లోకములవలన పరబ్రహ్మమే చేతనాచేతనాత్మకమైన జగత్తునకు కారణము అన్న విషయం తెలుస్తున్నది.

ఈవిధముగా అనేకశ్రుతిస్మృతిపురాణవాక్యములతో జీవేశ్వరుల భేదాన్ని, నిత్యత్వాన్నీ స్పష్టీకరిస్తూండడంచేత ఉపాధినాశంవల్ల కాని పరిణామంవల్ల కాని జీవేశ్వరులు ఒక్కటే అని చెప్పుట సాధ్యము కాదు. అలా కాకుండా జీవేశ్వరులు పూర్తిగా వేరే అని చెప్పు ద్వైతసిద్ధాంతమందు జీవేశ్వరుల సంబంధాన్ని తెలిపే తత్త్వమసివాక్యము సమన్వయము కాజాలదు. అందువలన ఈ మహావాక్యము విశిష్టాద్వైతపరముగా చెప్పబడు జీవేశ్వరుల శరీరశరీరిసంబంధముతోనే అన్వయము చేసుకొని అర్థమును చెప్పుటయే సమంజసము.

# నివృత్త్యనుపపత్తి

మహాపూర్వపక్షమునందు బ్రహ్మాత్మైకత్వవిజ్ఞానముచేత అనగా ఈ జీవుడు బ్రహ్మస్వరూపుడేగాని వేరుగాదు అను వాక్యార్థజ్ఞానముచేత భేదభ్రాన్తికి హేతువైన అవిద్యాదోషము నివర్తించునని చెప్పబడియున్నది. అట్లైన పుణ్యపాపకర్మనిమిత్తముచేత సంప్రాప్తమైన దేవమనుష్యాదిశరీరములును, వాటిచేత కలుగు సుఖదుఃఖాదులుకూడ మిథ్య అవాలి. అంటే కర్మసిద్ధాంతము, దానిప్రకారము నడిచే సమాజవ్యవస్థ మొత్తము అతలాకుతలమౌతుంది.

అంతేకాక ఉత్పత్తిగల ప్రతివస్తువు అర్థక్రియాకారి అనగా ఒక ప్రయోజనార్థమే గనుక సత్యమే అవుతుంది. అట్టిదానిని మిథ్య అనుటకు వీలులేదు. సత్యమైన పదార్థము ఏదైనను జ్ఞానముచేత నివర్త్యముకాదు అనగా, ఒక పాము, కేవలజ్ఞానముచేత లేకుండాపోదు. కఱ్ఱతో కొట్టినప్పుడే అది పోతుంది. ఇదేవిధముగా సంసారబంధము, సుఖదుఃఖములు కూడ అర్థక్రియాకారిత్వమును కలిగియుండటవలన యథార్థములే అయి అందువలన కేవలజ్ఞానముచేత నివర్తింపబడవు. అవి నివర్తింపబడటానికి పరమాత్మానుగ్రహశక్తి అవసరము. ఈ సంసారబంధము భక్తిరూపాపన్న-ఉపాసనాత్మకమైన జ్ఞానముచే ప్రసన్నుడైన భగవంతునియొక్క అనుగ్రహముచేత నివర్తించబడుతుందని ఇంతకుముందు చెప్పుకొని యున్నాము. అట్లుకాక చెప్పబడిన జీవేశ్వరుల ఐక్యము అయథార్థమే కావలెను. అట్టి జ్ఞానముచే సంసారబంధము తొలగుటకు అవకాశము లేదు.

విష్ణుపురాణమునందు మిథ్యైతత్ అన్యద్ద్రవ్యం హి నైతి, తద్ద్రవ్యతాం యతః అని ఒక వస్తువు వేరొక వస్తువుతో ఐక్యత పొందదు గనుక భిన్నస్వరూపస్వభావములు గల రెండు వస్తువులకు ఐక్యమును చెప్పుట సరి కాదు అని చెప్పబడినది. భగవద్గీతలోకూడ శ్రీకృష్ణభగవానుడు ఉత్తమః పురుషస్త్వన్యః అనియు, పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా అనియు జీవబ్రహ్మల భేదమును వివరించియున్నాడు.

పూర్వపక్షము ప్రకారము బ్రహ్మతప్ప తక్కినదంతయు మిథ్యయేగనుక తత్త్వమసి మున్నగు వాక్యార్థజ్ఞానముకూడ, మిథ్యయే కావలెను. అట్లైనచో దాని యందలి మిథ్యాత్మను నివర్తించుటకు వేరొక ప్రమాణము కావలెను. ఈ రకంగా ఇది యొక అంతులేని సంకెల అవుతుంది. ఈ నివర్తకజ్ఞానము అవిద్యానివృత్తిచేసిన

పిదప, తానుకూడా నాశనమైపోవాలి. ఒకపదార్థము తనంతతాను నాశనము కాలేదు. కనుక, దానిని తొలగించటానికి వేరొకటి అవసరమౌతుంది. మళ్ళీ అట్టి దానిని తొలగించుటకు మరియొకటి అవసరమౌతుంది. ఇది కూడా తర్కాతీతమైన విషయమే.

నివర్తకజ్ఞానము బ్రహ్మ, జీవుడు, ఒక్కటే అన్న ఐక్యతను కదా బోధిస్తుంది! అలా బోధించేది బ్రహ్మకే అయితే, ఆ బ్రహ్మ జ్ఞాత అవుతాడు. అంటే బ్రహ్మకూడా మిథ్యే. అలా కాకుండా అది భ్రాన్తి అనుకుంటే, దానికి కారణమైన మరొక అవిద్య అవసరమౌతుంది. దానిని నివర్తించటానికి వేరొక అవిద్య అవసరమౌతుంది. ఇది కూడా కుదరదు. బ్రహ్మయందలి అవిద్యను నివృత్తిచెయ్యటానికి వచ్చిన నివర్తకజ్ఞానము ఆ అవిద్యను నివృత్తిచేసి తానుకూడ లేకుండా అయిపోవాలి. ఇది ఎలా ఉంటుందంటే, దేవదత్తుడు భూతలమున సర్వపదార్థమును ఛేదించెను అని అన్నప్పుడు ఎవడైనను స్వప్రయోజనమునకై ఇతరులను ఛేదించునుగాని, తనను, తన ఛేదనసామగ్రియైన ఖడ్గమును, ఛేదించుకొనునా? అట్లు ఛేదించుకొనుట సంభవమా? స్వవినాశముకూడ పురుషార్థమగునా? ఈ విధముగా, ఇట్టి స్థితి అసంభవమే అవుతుంది. అందువలన సంసారబంధము, పుణ్యపాపకర్మములు సత్యమే అయినందున వాటిని కేవలవాక్యార్థజ్ఞానము నిర్తింపజేయలేదు.

## జిజ్ఞాసాధికరణవిషయము

అనాదియగు కర్మప్రవాహముచే ఏర్పడిన స్వస్వరూప, పరబ్రహ్మస్వరూపాదులయొక్క అజ్ఞానముచేత యథార్థమైన సంసారబంధము ఏర్పడినందువలన దీనిని తొలగించుటకు ఉపాసనాత్మకజ్ఞానముచే ఫలాపేక్షారహితముగా విహితకర్మలను పరబ్రహ్మారాధనారూపముగా అనుష్ఠించుటవలన ఆ పరబ్రహ్మము యొక్క అనుగ్రహమువలన ఈ సంసారబంధమునుండి విముక్తికలిగి మోక్షము సిద్ధించును అని భగవద్రామానుజుల సిద్ధాంతము. ఇట్టి కర్మానుష్ఠానము లేకున్న బ్రహ్మజ్ఞానముగాని మోక్షముగాని సిద్ధించనందున కర్మవిచారానంతరమే ముక్తిహేతువగు బ్రహ్మవిచారమును చేయవలెనని **అథ, అతః** అను రెండు పదములను భగవద్రామానుజులు తమ భాష్యములో వివరిస్తున్నారు. **అథ** అనగా కర్మస్వరూపవిచారానంతరము. **అతః** అనగా ఆ కర్మలే ఫలాభిసంధి-రహితములై బ్రహ్మజ్ఞానోత్పత్తి సాధనములైనందున- అని ఈ పదములకు తాత్పర్యము. ఈ విధముగా భగవద్రామానుజులు పూర్వపక్షమున చెప్పబడిన అన్నివిషయములను యుక్తులతోను, ప్రమాణములతోను ఖండించి తమ సిద్ధాంతమును ప్రతిపాదించిరి.

ఇంతవరకు పూర్వపక్షమున చెప్పబడిన విషయములు, వాటికి సమాధానముగా సిద్ధాంతభాగమున భగవద్రామానుజుల సమాధానమును ఈ సూత్రభాష్యమున వివరింపబడినవి. ఈ సూత్రమును ఒక అధికరణముగా జిజ్ఞాసాధికరణమని అంటారు అధికరణమనగా అయిదు అంగములు ఉండును.

**శ్లో॥ విషయః విశయశ్చైవ పూర్వపక్షః తథోత్తరమ్।**
**ప్రయోజనంచ పఞ్చైతాన్ ప్రాఞ్చో౽ధికరణం విదుః॥**

అనగా, అధికరణమునకు విషయము, విశయము, పూర్వపక్షము, దాని సమాధానము, ప్రయోజనము, అను అయిదు అంగములు ఉంటాయి. ఏ అంశమును గురించి చర్చ జరుగుచున్నదో దానిని విషయము అంటారు. విశయము అనగా సంశయము. పూర్వపక్షము, దాని సమాధానములను మనము ఇంతకుముందు చూచేము. ఇచట చర్చకు ఫలమేమో అది ప్రయోజనమని చెప్పబడుతుంది. ఈ జిజ్ఞాసాధికరణములో బ్రహ్మవిచారమే విషయము. బ్రహ్మవిచారము చేయవలెనా, వద్దా అని సంశయము. దానిపై అంతకుముందు ఉన్న అభిప్రాయము

పూర్వపక్షము. యుక్తియుక్తముగా ఆ పూర్వపక్షమును సంస్కరించి చెప్పబడునది సిద్ధాంతము. ఇట్లు ఈ చర్చపై తేలిన ఫలితము బ్రహ్మవిచారము తప్పక ఆరంభించవలెనని అదియే ప్రయోజనము.

ఈ విధముగా బ్రహ్మవిచారము ఆవశ్యకమా? అన్న ప్రశ్నకు కొందరు పూర్వమీమాంసకులు బ్రహ్మవిచారము అవసరమే లేదని చెపుతారు. అందులో ప్రభాకరమతమునను సరించువారు విధినిషేధవాక్యములు లేక కర్తవ్యబోధకములు కాని విషయములకు ప్రాధాన్యత ఉండదు కనుక, బ్రహ్మవిచారమునందు బ్రహ్మమును గూర్చి ఆ బ్రహ్మముయొక్క గుణవిశేషములనుగూర్చి తెలుసుకొనుటవలన ప్రయోజనములేదని అంటారు. ఉదాహరణకు పారిస్‌నగరమునందు కల ఐఫిల్ టవర్‌యొక్క ఎత్తు, అందు ఉపయోగించబడిన సామగ్రివివరములు, తెలిసికొనుటవలన మనకు ఏమియు ప్రయోజనము లేదు. అదే విధముగా ఎక్కడో పరమపదమున ఉన్న పరంబ్రహ్మను గురించి, దాని గుణవిశేషములను గురించి, తెలిసికొనుటకన్న ప్రయోజనము లేదని వారి అభిప్రాయము. అయమాత్మా బ్రహ్మ, సర్వం ఖల్విదమ్ బ్రహ్మ మొదలైన వాక్యములు మనకు ఏవిధముగను ఉపయోగపడవని వారి అభిమతము. 'ఇది పుస్తకము' అన్న వాక్యముకంటె 'ఈ పుస్తకమును చదువుము' అన్న వాక్యమునకు ప్రాధాన్యత ఉంటుంది. 'ఇది పుస్తకము' అన్న వాక్యమునకు దానితో సంబంధము లేనపుడు, ఆ వాక్యమునకు ప్రయోజనము లేదు. అంటే, ఒక పనిని చెప్పని వాక్యములకు ప్రయోజనము మృగ్యము. అందువలన వేదము పూర్వభాగమునందు చెప్పబడిన జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత మున్నగు వాక్యములు ప్రయోజనము కలిగినవి గనుక, అట్టి విధినిషేధవాక్యములకే ప్రాధాన్యతనీయవలెను. దీనికి సమాధానముగా భాట్టమతమువారు విధినిషేధము కాకున్నను, కొన్ని వాక్యములు ప్రయోజనమును కలిగి ఉంటాయి అని చెప్పుదురు. ఉదాహరణకు 'నీకు కుమారుడు కలిగెను' అన్న వాక్యము విధినిషేధము కాకున్నను, ప్రయోజనకారకమై ఆ చెప్పబడిన వ్యక్తి ముఖవికాసహేతువగును కదా అని వారి వాదము, దీనికి సమాధానముగా ప్రాభాకరులు అట్టి సంతోషమునకు కారణము సుఖప్రసవమా? మంచి లగ్నమునందు జన్మించుటయా? అను అనేక కారణములను ఊహించుటకు అవకాశమున్నందున ఆ ముఖవికాసహేతువునుబట్టి పుత్రుడు కలిగెను అను అర్థము మాత్రమే బోధించునని నిర్ణయించుటకు వీలు లేదు గనుక అట్టి వాక్యములకు ప్రయోజనము లేదు అని చెపుతారు. వాచస్పతిమిశ్రులవారు ఒకపని జరగడానికి ఆకాంక్ష, అవకాశము, ప్రమాదము లేకుండుట, అవసరమని; అందువలన కోరిక కలిగినపుడే కార్యము జరుగుతుందని; కనుక కార్యతాబుద్ధియే ప్రధానమని తెలిపేరు.

పూర్వమీమాంసలో "అక్షయ్యగ్ం హవై చాతుర్మాస్యయాజినస్సుకృతం భవతి" ఇత్యాది వాక్యములయందు చెప్పబడిన చాతుర్మాస్యాదియజ్ఞములవలన అనన్తస్థిరఫలప్రాప్తి కలుగుతుంది గనుక ఎవరికిని సంపూర్ణంగా తెలియని బ్రహ్మను విచారము చేయుట అనవసరమని పూర్వమీమాంసకుల పక్షము. అంతేకాక, ఏదైన ఒక పని చెయ్యాలంటే దానికి కారణము అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తి అవాలి. ఈ అనిష్టనివృత్తి ఇష్టప్రాప్తి పూర్వమీమాంసలో చెప్పబడిన కర్మలవలన అభిస్తుంది. అందువలన విషయవైశద్యమునకు అనుకూలముకాని బ్రహ్మమును గూర్చి విచారము అనావశ్యకము.

ఒక కార్యము చేసినపుడు ఆ కార్యమునకు పడు శ్రమకంటే, ఆ కార్యమువలన ప్రయోజనము అధికముగా ఉన్నపుడే ఆ కార్యమునందు ప్రవర్తనము కలుగుతుంది. బ్రహ్మవిచారసందర్భమునందు చేయవలసిన కార్యము భగవత్కైంకర్యము లేదా భగవదుపాసనము. దీనివల్ల ప్రయోజనము కూడ భగవత్కైంకర్యము, భగవదుపాసనమే అవుతాయి. పది రూపాయలు పెట్టుబడి పెట్టి పనిచేసినవానికి తిరిగి పదిరూపాయలే ప్రయోజనమైతే అట్టి కార్యమునందు ప్రవర్తించుటకు ఎవరికిని కోరిక ఉండదు. కనుక బ్రహ్మవిచారము ఆవశ్యకము కాదని పూర్వపక్షము.

**సిద్ధాంతము:** కేవలము విధినిషేధవాక్యములకే ప్రయోజనమున్నది అనుట సమంజసముకాదు. ఇతడు నీ తండ్రి, ఈమె నీ తల్లి మొదలగు వాక్యములు విధినిషేధవాక్యములు కాకున్నను, ప్రయోజనాన్ని సాధిస్తాయి.

శబ్దార్థపరిజ్ఞానవ్యుత్పత్తి వేరొకవిధముగాకూడ గ్రహించుటకు అవకాశముంటుంది. ఉదాహరణకు. హస్తచేష్టలతో ఒక విషయమును చెప్పినపుడు కూడ ఆ విషయానికి ప్రయోజనము సిద్ధిస్తుంది.

జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత అన్నవాక్యములో స్వర్గమంటే కల్పాంతమందు లయమయే స్వర్గముతప్ప ఎల్లప్పుడు ఉండే పరమపదము కాదు. అదే విధముగా అక్షయ్యం అను శ్రుతియందు క్షయముకాని సుఖానుభవం కలుగుతుందంటే అక్కడ క్షయముకాని అన్న పదము సాపేక్షము తప్ప నిత్యమని కాదు. ఉదాహరణకు ప్రభుత్వోద్యోగము శాశ్వతమైనది అని అంటే, దాని అర్థము ఎప్పుడూ ఉంటుందని కాక, కొంతవయస్సువరకూ కొన్ని నియమాలతో పరిమితమై ఉంటుంది అనిమాత్రమే అర్థము. అందువలన పూర్వమీమాంసయందు చెప్పబడిన కర్మలు అనంతస్థిరఫలాన్ని ఇయ్యలేవు.

మనము కోరుకొనేది అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తియే అయినను, నియోగముకాని క్రియకాని చెప్పు వాక్యములు ఈ అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తి ఇయ్యకపోవచ్చు.

యజ్ఞయాగాదులు చేసేటప్పుడు ఆ కర్మవలననే ఫలము సిద్ధించును అని చెప్పుటకూడ సరికాదు. ఎందుకనగా యజ్ఞము చేసినవెంటనే వానికి ఆఫలము సిద్ధించుట లేదు. దీనికి పూర్వపక్షములో ఆ యజ్ఞమువలన అపూర్వమను ఒక పదార్థము ఉత్పత్తిచెంది ఆ అపూర్వము తరువాతి కాలములో ఆ యజ్ఞము చేసినవారికి ఇష్టప్రాప్తికలిగించును అని సమాధానం చెపుతారు. కాని ఇట్లు చెప్పుటకు ఆధారమేమియును లేదు. సత్యమేమనగా, అట్టి యజ్ఞయాగాదుల వలన ముఖవికాసమునందిన పరబ్రహ్మము అనుగ్రహించి ఆ యజ్ఞయాగాదుల ఫలమును ఆ వ్యక్తియొక్క కర్మల ననుసరించి అనుగ్రహిస్తాడు. అంటే కర్మల ఫలముకూడా పరబ్రహ్మానుగ్రహమే అగును. కాని యజ్ఞయాగాది కర్మలు వేరువేరు దేవతలనుద్దేశించి చేయబడినపుడు ఆయా దేవతలు అనుగ్రహించి ఫలమునిస్తారుకదా అని ఒక ప్రశ్న. కాని ఆయాదేవతలకు అంతర్యామిగానున్న పరబ్రహ్మమే ఫలాన్నిస్తాడని భగవద్గీత మొదలైన గ్రంథాల్లో చెప్పబడింది. అంతేకాక, **ఫలమత ఉపపత్తేః** అను 3-2-36సూత్రములో భగవద్బాదరాయణులే ఈ విషయాన్ని నిరూపించేరు. ఇంతేకాక, బ్రహ్మవిచారమునందు విధినిషేధవాక్యములు లేవు అన్న అభిప్రాయము సరి కాదు. ఆత్మా వా అరే ద్రష్టవ్యః..ఇత్యాది వాక్యములు విధివాక్యములే. బ్రహ్మవిచారము నందు ఆ విచారముచే కలుగు ఫలము అనంత-నిత్యనిరవధిక-ఆనందమని ఈ బ్రహ్మసూత్రములలోనే వివరించబడినది. ఆ వివరములు సాకల్యముగా ఈ బ్రహ్మసూత్రములలో చెప్పబడినవి. ఈ కారణములవలన బ్రహ్మవిచారము చేయవలసినదే అని భగవద్రామానుజులు అనుగ్రహించేరు.

కార్యముకన్న ముఖ్యమైనది కారణము. అనగా బంగారము లేకుండ బంగారపువస్తువు చెయ్యటానికి సాధ్యము కాదు. ఈ సమస్తజగత్తునకు ఈ జగద్వ్యవహారకార్యములకు మూలకారణమైనవాడు పరబ్రహ్మము. కనుక పరబ్రహ్మవిచారము ఆవశ్యకమే.

బ్రహ్మవిచారపు ఆవశ్యకత మొదటి సూత్రములో నిరూపించినతరువాత తరువాతి సూత్రములో ఆ బ్రహ్మ ఎట్టిదని వివరిస్తున్నారు.

# ॥ జన్మాద్యధికరణము ॥ 1-1-2 ॥

## ॥ జన్మాద్యస్య యతః ॥ 1-1-2 ॥

అనగా **అస్య**= ఈ ప్రపంచమునకు **జన్మాది**= సృష్ట్యాదులు **యతః**= దేనినుండియో (అది బ్రహ్మ). అంటే కనబడుతున్న ఈ జగత్తునకు సృష్టి, స్థితి లయములు దేనినుండి కలుగుచున్నవో అదియే బ్రహ్మ.

ఈ సూత్రమును జన్మాద్యధికరణమని బ్రహ్మసూత్రములయందు రెండవ అధికరణంగా చెప్పుదురు.

అచిన్త్యవివిధవిచిత్రరచనతో కూడుకొని యున్నట్టియు, నియతములగు దేశకాలఫలభోగములతో కూడుకొని యున్నట్టియు, సమస్తచేతనాచేతనములతో కూడి యున్నట్టియు ఈ జగత్తుయొక్క జన్మ,స్థితి,లయములు హేయగుణరహితుడును సత్యసంకల్పుడును జ్ఞానానందాది అనన్తకల్యాణగుణాకరుడును, సర్వజ్ఞుడును, పరమకారుణికుడును, పరుడును అయిన ఏ పురుషునిచే కలుగుచున్నవో అట్టివాడు బ్రహ్మమని ఈ సూత్రమునకు అర్థము. ఇచ్చట సృష్టిస్థితిసంహారాదులు మూడును కలవాడు బ్రహ్మయని చెప్పే అర్థంలో **తద్గుణసంవిజ్ఞాన-బహుబ్రీహిసమాసం** వర్తిస్తుంది. కలవాడు-కలది; లేనివాడు-లేనిది; అని చెప్పబడినపుడు దానిని బహుబ్రీహిసమాసము అని అంటారు. లంబకర్ణః అన్నపుడు పొడుగుగా వేలాడుతున్న చెవులు కలవాడు అని అర్థము. లంబకర్ణుని తీసుకొని రమ్ము అంటే అట్టి చెవులు కలవాడు, ఆ చెవులతోకూడ వస్తాడు. ఎందుకంటే ఆ చెవులు అతనిని విడిచి వేరుగా ఉండవు. కాని చిత్రగుని - అనగా చిత్రములైన గోవులు కలవానిని - తీసుకొని రమ్ము అన్నప్పుడు ఆవులు కాక ఆ వ్యక్తిమాత్రమే వచ్చిన చాలును. ఎందుకంటే ఆవులు ఆ వ్యక్తిని విడచి యుండగలవు అన్నమాట. ఇట్టి సమాసమును **అతద్గుణసంవిజ్ఞానబహుబ్రీహిసమాస**మని అంటారు. పరబ్రహ్మమునకు జగజ్జన్మాదులతో సంబంధము ఎల్లప్పుడు ఉండునది గనుక ఇక్కడ తద్గుణ...బహుబ్రీహిసమాసం వర్తిస్తుంది అని చెప్పుతున్నారు. ఈ సూత్రముయొక్క భాష్యార్థము సంవాదరూపమునందు చెప్పబడిన చతుస్సూత్రిసంగ్రహమున ఇయ్యబడినది. ఆ వివరము పాఠకులు చూడగలరు.

తైత్తిరీయోపనిషత్తులో భృగువల్లిలో నున్న భృగువరుణసంవాదమునందు గల యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి, యత్ప్రయన్త్యభిసంవిశన్తి, తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి అను మంత్రమున్నది. బ్రహ్మమును గురించి ఉపదేశమునకు తనకుమారుడైన భృగువు ప్రార్థింపగా ఆయన తండ్రియైన వరుణుడు సకలభూతములు ఎవనినుండి పుట్టి జీవించుచు అంతమున ఎవనిలో ప్రవేశించుచున్నవో, వానిని బ్రహ్మముగా తెలిసికొనుము అని ఉపదేశించెను.

ఈ వాక్యము ద్వారా బ్రహ్మము ఇట్టి లక్షణములతో నున్నదని తెలిసికొనుట శక్యమా అని ఇచ్చట **సంశయము**. ఏలనన 1. ఇచట జన్మాదులు బ్రహ్మమునకు విశేషణములు కనుక బ్రహ్మస్వరూపమును తెలుపనేరవు. 2. జన్మస్థితినాశనములు వేరు వేరు విశేషణములగుటచేత వేరువేరు విశేష్యములను - అనగా సృష్టికి ఒక బ్రహ్మ, స్థితికి ఒక బ్రహ్మ, లయములకు వేరొక బ్రహ్మ, ఇట్లు అనేక బ్రహ్మలకు అవకాశము నిస్తుంది. 3.సృష్టిస్థితి- లయములు బ్రహ్మనుండి కలుగుతున్నాయి. అంటే, అది బ్రహ్మకు ఉపలక్షణమే అగునుగాని స్వరూపలక్షణము కాదు. ఎందుకంటే సృష్టిస్థితిలయాలు క్రియలు అగుటచేత కాలపరిమితి గలవి. అంటే ఒక

సారసపక్షి ఉన్న పొలము అంటే సారసపక్షి ఆ పొలమునందు పరిమితమైన(కొంత) కాలమే ఉండవచ్చును. తరువాత అది వేరొక పొలమునకో, వృక్షమునకో వెళ్లిపోవచ్చును. అలాంటప్పుడు సారసపక్షి వాలడం అనేది, ఆ పొలముయొక్క ముఖ్యలక్షణమై ఇదమిత్థమని నిర్ణయించలేదు. ఉపలక్షణమనగా ఒక విషయము తెలిసిన తరువాత ఆ విషయముయొక్క ఇతరలక్షణములను తెలుపుట. అనగా పై ఉదాహరణమునందు పొలము తెలిసినతరువాత సారసపక్షి ఎచటనున్నదో చెప్పుటకు అక్కడ సారసపక్షి వాలియున్న పొలము అని చెప్పుట జరుగుతుంది. కాని పొలమును ఇదమిత్థమని గుర్తించడం కాదు. 4. సృష్టిలయములు పరస్పరవ్యతిరేకకార్యములు గనుక ఆ రెండు కార్యములు ఒకే బ్రహ్మకు వర్తిస్తాయా అని యొక సంశయము. 5. సత్యం జ్ఞానం అనన్తం బ్రహ్మ అను శ్రుతివాక్యము బ్రహ్మస్వరూపమును తెలియజేస్తుంది. కనుక దానిని లక్షణవాక్యమనవచ్చును. అట్టిచో యతోవా... అను వాక్యమునుకూడ లక్షణవాక్యమనిన ఈ రెంటికిని అన్యోన్యాశ్రయదోషము కలుగును. అనగా సత్యత్వాది ఆకారము ముఖ్యలక్షణమైనచో జన్మాదుల కారణము అనునది ఉపలక్షణము కావలెను. జన్మాదుల కారణము అనునది ముఖ్యలక్షణమైన, సత్యత్వాది ఆకారము ఉపలక్షణము కావలెను.

**సమాధానము** 1. ఇంతకుముందు చెప్పినట్లుగా పరబ్రహ్మమునకు జగజ్జన్మాదులతో సంబంధము అపృథక్సిద్ధము గనుక ఇక్కడ విశేషణము విశేష్యమువరకు పర్యవసిస్తుంది. అందువలన జగజ్జన్మాది కారణము అను విశేషణము పరబ్రహ్మమును నిర్ణయించి చెప్పుతుంది. 2. వేరువేరు విశేషణములు ఒకే వ్యక్తికి సంభవము. నల్లని జుత్తు, ఎఱ్ఱని కళ్ళు ఉన్న దేవదత్తుడు అన్నపుడు రెండు విశేషణములు ఒకే దేవదత్తునికి వర్తిస్తాయి. 3. జగత్తుయొక్క సృష్టిస్థితిసంహారములను ఉపలక్షణముగా తీసుకొనికూడ బ్రహ్మమును తెలిసికొనవచ్చును. ఉపలక్షణాకారముకంటే, ఆ ఉపలక్షణముచేత తెలుపబడిన వస్తువుయొక్క ఆకారముకంటె, వేరగు మరియొక ఆకారము తెలియబడనప్పుడు ఈ వాక్యమువలన బ్రహ్మమే తెలియవచ్చును. బ్రహ్మశబ్దము బృహద్ధాతువువలన ఏర్పడినదగుటచే బ్రహ్మము మితిలేని అతిశయముగల గొప్పశక్తి గలది అనేఅర్థాన్ని ఇస్తుంది. అప్పుడు సృష్టిస్థితిలయములును, బ్రహ్మమును ఒకే వ్యక్తియందు పర్యవసిస్తాయి గనుక బ్రహ్మమునకు ఉపలక్షణముగా తీసుకొనవచ్చును. 4. సృష్టి లయాలు వ్యతిరేకకార్యములైనను వేర్వేరు సమయములలో జరుగును కనుక, వాటికి పరస్పరవ్యతిరేకత లేదు. 5. సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ అను శ్రుతివాక్యము యతోవా ఇమాని భూతాని... ఇత్యాది కారణవాక్యమువలన తెలియవచ్చినదియు, జగజ్జన్మాదికారణభూతములగు బ్రహ్మముయొక్క స్వరూపము మిగిలిన వస్తువుల స్వరూపముకంటె విలక్షణమైనదనియు తెలుపుచున్నది. ఎట్లైన సత్యమనుపదము బ్రహ్మము ఎట్టి ఉపాధిని అపేక్షించని సత్త కలిగినదనియు, జ్ఞానమను పదము బ్రహ్మమెల్లప్పుడును జ్ఞానము స్వరూపముగా కలదనియు, అనన్తపదము బ్రహ్మము దేశకాలవస్తుపరిచ్ఛేదములు లేనిదనియు తెలుపుటవలన పరబ్రహ్మస్వరూపము తక్కిన చేతనాచేతనములకంటె విలక్షణమైనదని సత్యజ్ఞానాదివిశేషణములు నిర్ధారిస్తున్నాయి. ఇక్కడకూడా సత్యము, జ్ఞానము, అనన్తము అను వేరువేరు విశేషణములు ఇంతకుముందు చెప్పుకొనినట్లు ఒకే పరబ్రహ్మమునకు వర్తించుటకు అభ్యన్తరమేమియు లేదు. జగజ్జన్మాదికారణముగా యతోవా అను వాక్యమున తెలుపబడు పరబ్రహ్మమే సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ అను వాక్యముచేత స్వేతరసమస్తవస్తువిలక్షణమైనదిగా తెలుపబడుటచేత ఇచ్చట అన్యోన్యాశ్రయదోషము లేదు.

పరబ్రహ్మము నిర్విశేషమని సమర్థించు అద్వైతమతములో అట్టి బ్రహ్మము తెలియగోరుటయు, అట్టి బ్రహ్మము జగజ్జన్మాదులకు కారణమగునని చెప్పుటయు అసంగతమౌతుంది.

బ్రహ్మమనగా, అంతకుమించినదేమియు లేనట్టి మహత్త్వశక్త్యాదులు కలది అని చెప్పినప్పుడు బ్రహ్మమునకు నిర్విశేషము సిద్ధించదు కదా! ఈ సూత్రమందు చెప్పబడినట్లు జగజ్జన్మాదులు దేనివలన కలుగుచున్నవో అది బ్రహ్మము అని చెప్పినపుడుకూడ నిర్విశేషత్వము సిద్ధించదు. నిర్విశేషత్వమును సాధించుటకు దేనినుండి జగజ్జన్మాదిరూపమగు భ్రమ కలుగుచున్నదో అది బ్రహ్మము అని సమర్థించుకొనదలచినను భ్రమకు మూలభూతమైనది అజ్ఞానము. ఆ అజ్ఞానమునకు సాక్షి కావలెను. సాక్షి అనగా తననుగాని ఇతరపదార్థములనుగాని వ్యవహారయోగ్యములుగా చేయవలెను. అట్టిచో అది సవిశేషమే కావలెను. సవిశేషముకాని వస్తువు సాధించబడక కుందేటికొమ్మువలె అయథార్థమే కావలెను. కనుక ఈ సూత్రమున జగజ్జన్మాదులకు కారణభూతమైనదిగా పరబ్రహ్మమును చెప్పుటవలన పరబ్రహ్మముయొక్క సవిశేషత్వము నిరూపించబడినది.

# ॥ శాస్త్రయోనిత్వాధికరణము ॥ 1-1-3 ॥

జగజ్జన్మాదులకు కారణభూతమైన బ్రహ్మము వేదాన్తశాస్త్రములవలన తెలియదగినదని ఇంతకుముందు ప్రతిపాదించబడినది. అట్లుకాక బ్రహ్మము ప్రత్యక్ష, అనుమానప్రమాణములచే ఏల ప్రతిపాదించబడరాదు? అను సంశయమునకు సమాధానముగా, ఈ అధికరణము ఉద్దేశించబడినది.

## సూ॥ శాస్త్రయోనిత్వాత్ ॥ 1-1-3 ॥

అనగా **శాస్త్రయోనిత్వాత్** = బ్రహ్మము శాస్త్రముచేతనే తెలుపదగినది అగుటచేత. అంటే బ్రహ్మము శాస్త్రప్రమాణముచేతనే తెలుపదగినది అని తాత్పర్యము.

ఈ సూత్రార్థవివరణము సంవాదరూపమున చెప్పబడిన చతుస్సూత్రిసంగ్రహమునందు ఉట్టంకించబడినది. పాఠకులు ఆ వివరణమును అచ్చట చూడగలరు. అందలి ముఖ్యవిషయములు మాత్రము ఈ క్రిందనీయబడినవి. ముందు చెప్పబడిన సంశయము ప్రకారము బ్రహ్మమును తెలిసికొనుటకు ప్రత్యక్షానుమానప్రమాణములను ఇచ్చట పరిశీలించెదము.

**ప్రత్యక్షప్రమాణము**– ప్రత్యక్షమనగా రెండువిధములు

1. ఇంద్రియ సంభవము, అనగా ఇంద్రియములచే తెలిసికొనుట. బాహ్యేంద్రియములు కాని అంతరింద్రియమైన మనస్సుగాని సృష్టిలోనున్న పరిసరవిషయములను, సుఖదుఃఖములను తప్ప అప్రాకృతికమైన పరబ్రహ్మస్వరూపమును తెలుపలేదు.

2. యోగసంభవము. యోగము అనగా భావన చేయుటవలన కలుగునది. ఇంద్రియగ్రాహ్యముకాని విషయమును భావన చేయుట అనగా దానిని భ్రమ అనే పరిగణించాలి. పరబ్రహ్మము ఇంద్రియగ్రాహ్యము కానందున పరమార్థమైనందున యోగమువలన బ్రహ్మమును నిర్ణయించలేరు.

**అనుమానప్రమాణము**– అనుమానప్రమాణము కూడ రెండువిధములు.

**విశేషతోదృష్ట**మనగా విశేషమునుబట్టి విశేష్యమును తెలిసికొనుట. ఉదాహరణమునకు ఒక ఆవునకు తోక అనెడి విశేషణమును ముందు చూచి యున్నపుడు అట్టి తోకయున్న జంతువును చూచి ఆ జంతువు ఆవు అని తెలుసుకొనుట అన్నమాట. కాని పరబ్రహ్మవిషయంలో ఆయన విశేషణములు కూడ ప్రత్యక్షగోచరములు కావు కనుక విశేషతోదృష్టరీతిలో పరబ్రహ్మమును తెలిసికొనలేము.

**సామాన్యతోదృష్ట**మనగా ఒక సందర్భమునందు రెండు వస్తువుల సంబంధాన్ని చూచుటవలన వేరొక సందర్భమునందు ఒక వస్తువుయొక్క అస్తిత్వాన్నిబట్టి రెండవ వస్తువుయొక్క ఉనికిని తెలిసికొనవలెను. అనగా, వంట ఇంటిలో నిప్పు ఉండి, పొగవచ్చుటనుబట్టి ఒక కొండపై పొగ ఉన్నప్పుడు అక్కడ నిప్పు ఉన్నదని తెలిసికొనుట. కాని సమస్తజగజ్జన్మాదులకు కారణమైన పరబ్రహ్మమును ఈ విధముగా తెలుసుకొనుటకూడ పొగనుబట్టి నిప్పును గుర్తించినట్లు సాధ్యము కాదు.

## అనుమానప్రమాణము విషయములో సంశయములు, వాటి సమాధానములు.

**సంశయము.** మన లోకవ్యవహారములో ప్రతి కార్యానికీ ఒక కర్త ఉన్నట్లు చూస్తున్నాము. అంటే ఒక కుండ ఉంటే దానిని చేసిన కుమ్మరి యుండాలి. అదే విధముగా ఈ జగత్తు అనే కార్యానికి కారణభూతమైన పరబ్రహ్మమొకటి ఉండే ఉండాలి. అను అనుమానప్రమాణముచేత పరబ్రహ్మ అస్తిత్వాని ్న నిర్ణయించవచ్చును గనుక శాస్త్రప్రమాణము ఆవశ్యకమా? అని సంశయము. అనగా సామాన్యమైన సామర్థ్యము, అల్పజ్ఞానముగల ఒక జీవుడు సామాన్యమైన కుండ, తలుపువంటి వస్తువులను సృష్టించినట్లు అంతకంటె ఎక్కువ సామర్థ్యము జ్ఞానము కల వేరొకడు ఈ అసామాన్యమైన జగత్తునకు కారణము అని అనుమానప్రమాణముచే చెప్పవచ్చును కదా అని ప్రశ్న. అయితే, విత్తనమునుండి మొక్క వచ్చుట, సుఖదుఃఖములు కలుగుట వంటి కార్యములకు కారణము లేదుకదా అన్న శంకకు వీటి అన్నింటికి కూడా కారణముగా ఒక పరమచేతనుడు ఉన్నట్లు అనుమానప్రమాణమువలన తెలిసికొనవచ్చును అని ఆ శంకాపరిహారము చెపుతారు.

**సమాధానము:** ఒక కుండని చెయ్యటానికి ఒక కుమ్మరి, ఒక తలుపును చెయ్యటానికి ఒక వడ్రంగి, ఒక విమానమును చేయుటకు వైమానిక శాస్త్రజ్ఞుడు ఇట్లు వేరువేరు వస్తువులను చేయుటకు వేరువేరు కర్తలు ఉన్నట్లు లోకవ్యవహారంలో తెలుస్తున్నది. అందువలన పై అనుమానప్రమాణమువలన ఒకే బ్రహ్మ ఈ సమస్తజగజ్జన్మాదులకు కారణమని నిర్ణయించలేము.

ఈ కుండలవంటి వస్తువులు ఒక జీవుడివలన తయారవుతున్నాయి కనుక ఈ విశాలవిశ్వాన్ని వేరొక జీవుడు లేదా జీవుళ్ళు తయారు చేస్తున్నారు అని అనుమానప్రమాణముచేత నిర్ణయించుకుంటే మరి పరబ్రహ్మప్రసక్తే రాదు.

చేతనులు పనిచేయటానికి సత్త్వరజస్తమోగుణాలు కారణముగా ఉంటాయి. పరబ్రహ్మవిషయంలో ఇలాంటి గుణాలే కారణమౌతాయా లేక వేరే ఒక కారణమౌతుందా అన్నవిషయము అనుమానప్రమాణముచేత నిర్ణయించలేము.

లోకవ్యవహారములో ఒక అచేతనము ఒక చేతనము అధీనములోనున్నట్లు కొన్ని సందర్భాల్లో చూస్తాం. కాని ఒక చేతనము, దాని పుట్టుక, మరణించుట, సుఖదుఃఖములు, జరావ్యాధులు మొదలైనవి కాని, శరీరవికారములు మనోవ్యాపారములును కాని, వేరొక చేతనుని అధీనములో ఉన్నట్లు చెప్పలేము. ఇదే విధముగా ఈ చేతనాచేతనసమస్తమెల్లా వేరొక చేతనుని అధీనంలో ఉన్నట్లు అనుమానప్రమాణముచేత చెప్పుట సాధ్యము కాదు.

కుమ్మరికాని మరే ఇతర కర్తయైనా ఆయా కార్యములు చెయ్యటానికి నిమిత్త ఉపాదానకారణముల అవసరముంటుంది. బ్రహ్మవిషయంలో అనుమానప్రమాణమువలన ఈ విషయము నిర్ణయించలేము.

ఒక కుమ్మరి కుండ చెయ్యటానికి ఏదో ఒక కారణం ఉంటుంది. ధనార్జనకో లేదా ప్రతిష్ఠకో. ఇలా ఏదో ఒక కారణము లేనిచో, కార్యము చేయుట లోకవ్యవహారములో గోచరించదు. పరబ్రహ్మవిషయంలో ఇట్టి

ప్రయోజనమును నిరూపించలేము.

అనుమానప్రమాణములు ప్రత్యక్షముతో నిర్ధారింపబడకుండా సత్యములు కానక్కరలేదు. ఉదా: చీకటిలో అడవిలో నడుస్తున్న బాటసారికి తేజోద్రవ్యము కనిపించి అక్కడ నిప్పు ఉండి ఉంటుందని, ఆ నిప్పును ఉపయోగించు కొనే మనుష్యులు ఉండి ఉంటారని, అనుమానప్రమాణముతో అక్కడికి వెళ్లిన బాటసారికి అచ్చట నిప్పుకాని మనుష్యులుకాని కనబడక, భాస్వరమున్న ఎముకలవంటి పదార్థములు కనబడి ఉండవచ్చు. అట్టి పరిస్థితిలో అతడి అనుమానప్రమాణము సరికాదు.

జగత్తులో శరీరములేకుండ ఏ కార్యమును చేయుట జరగదు. అయితే జగత్కారణమైన బ్రహ్మమునకు– శరీరము, అవయవాలు ఉంటాయనుకుంటే, శరీరము అవయవాలు నశిస్తూంటాయి కాబట్టి పరమాత్మ నిత్యత్వానికి భంగం వస్తుంది. అంతేకాక లోకవ్యవహారంలో శరీరమునకు కర్మలు కారణమౌతాయి. పరబ్రహ్మశరీరానికి కారణమును అనుమానప్రమాణము నిర్ణయించలేదు అట్లుకాక పరబ్రహ్మశరీరానికి కారణం పరబ్రహ్మమే అంటే, ఆ శరీరం రాకముందు పరబ్రహ్మస్వరూపాన్ని నిర్ణయించలేము. వేరే శరీరంతో ఉండి పరబ్రహ్మం ఈ శరీరానికి కారణమైనాడంటే ఆ శరీరం ఎలా వచ్చింది అన్న ప్రశ్న వస్తుంది. అట్లు కాక, పరబ్రహ్మకు శరీరమే లేదంటే, అనుమానప్రమాణం ప్రకారం శరీరంలేని కర్త ఏ వ్యాపారమూ చేయలేడు కనుక, పరబ్రహ్మముకూడా జగత్సృష్ట్యాదులు చెయ్యలేడు. అట్లు కాక, పరబ్రహ్మము శరీరేంద్రియములతోకాక కేవలసంకల్పముచేత జగత్సృష్టి చేసేడంటే, కేవలం సంకల్పంచేత లోకవ్యవహారముల కార్యనిర్వహణము జరుగదు కనుక, ఈ విషయమును అనుమానప్రమాణముచేత నిరూపించలేము.

లోకవ్యవహారములో వేరువేరు వస్తువులు వేరువేరు కాలాల్లో వేరువేరు దేశాల్లో చేయబడతాయి. పరమాత్మవిషయంలో ఒకే పరబ్రహ్మము అనేకప్రదేశములలో ఒకే కాలములో కార్యములు కల్పించినట్లు అనుమానప్రమాణము చెప్పలేదు.

అనుమానప్రమాణము ప్రత్యక్షముగా గోచరమైన విషయమునకు తర్కము జోడించడంవల్ల నిర్ణయము చేస్తుంది. అప్రాకృతికమైన పరబ్రహ్మము ప్రత్యక్షప్రమాణముచేత గోచరము కాదు. అంతేకాక, తర్కమును ప్రతిపాదించు వ్యక్తి జ్ఞానము భ్రమ, ప్రమాదము, అశక్తి, మొదలైన లోపములచేత పరిమితమైయుండుటవలన అట్టి నిర్ణయము దోషదూషితమై ఉంటుంది. కనుక అనుమానప్రమాణము పరబ్రహ్మను నిర్ణయించలేదు.

లోకవ్యవహారమునందుగల ప్రత్యక్ష, అనుమానప్రమాణములవలన గ్రహించబడిన వస్తువ్యవహారముచేత పరబ్రహ్మము గ్రహింపబడలేదు గనుక, ఇతరప్రమాణాలచేత తెలియబడే వాటికన్న విలక్షణుడిగా సర్వజ్ఞత్వాది గొప్పగుణములు కలవానిగా హేయగుణములు లేనివానిగా పరబ్రహ్మమును గురించి తెలిసికొనుట శాస్త్రప్రమాణమువలననే సాధ్యము అని ఈ సూత్రార్థము.

# ॥ సమన్వయాధికరణము ॥ 1-1-4 ॥

ముందు అధికరణమునందు పరబ్రహ్మము శాస్త్రప్రమాణముచే తెలిసికొనవలెనని చెప్పబడినది. కాని బ్రహ్మము సిద్ధవస్తువు. శాసతీతి శాస్త్రమ్ అను నిర్వచనమును బట్టి ప్రవృత్తినివృత్తిపరమైనది శాస్త్రము. అట్టిచో ప్రవృత్తినివృత్తిపరమైన శాస్త్రము సిద్ధవస్తువైన పరబ్రహ్మప్రతిపాద్యము ఎట్లగును అను ప్రశ్నకు సమాధానముగా ఈ సమన్వయాధికరణము వచ్చినది.

## సూ॥ తత్తు సమన్వయాత్ ॥ 1-1-4 ॥

అనగా **తు**= శంక అయుక్తము. **తత్** = ఆ శాస్త్రము (బ్రహ్మమును ప్రతిపాదింపదగినది ఏల ననగా) **సమన్వయాత్** = శాస్త్రవాక్యములన్నియు బ్రహ్మము ప్రతిపాదించుటయందు సమన్వయించుటవలన. అంటే

శాస్త్రవాక్యములన్నియు పరబ్రహ్మమును ప్రతిపాదించుటయందు సమన్వయించునవే కనుక శాస్త్రము పరబ్రహ్మమును ప్రతిపాదించదగినది. కావున శాస్త్రముచే పరబ్రహ్మము ప్రతిపాదించబడునా అను శంక అయుక్తము. ఇంతకుముందు అధికరణములో చెప్పుకొనినట్లు పరబ్రహ్మస్వరూపాన్ని శ్రుతులు సమగ్రంగా నిర్వచించి తదుపాసనాధ్యానాన్ని ఫలములను వివరించేయి. ఉదాహరణకు తైత్తిరీయోపనిషత్తుయందలి యతోవా అన్న శ్రుతివాక్యము దేనినుండి ఈ భూతములు జన్మస్థితిలయములను పొందుచున్నవో అది బ్రహ్మము అని బ్రహ్మమును నిర్వచించింది.

ఛాందోగ్యోపనిషత్తునందలి సదేవసోమ్య అను శ్రుతివాక్యము ఈ సృష్టికి పూర్వము సత్తు ఒక్కటే ఉందని, రెండవది లేదనియు, దానివలన సృష్టిప్రక్రియ జరిగినదనియు చెప్పినది.

బృహదారణ్యకములో బ్రహ్మ వా ఇదం ఏక ఏవ అగ్ర ఆసీత్ అను శ్రుతివాక్యము సృష్టికి పూర్వము బ్రహ్మఒక్కటే ఉన్నదని, సృష్టికర్త బ్రహ్మయేనని నిర్ణయించినది.

ఐతరేయోపనిషత్తులో ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ అను శ్రుతివాక్యములో ఆ బ్రహ్మమే ఆత్మపదముతో పరామర్శించబడినది.

తైత్తిరీయోపనిషత్తులో తస్మాద్వా ఏతస్మాత్ అను శ్రుతివాక్యము దీనినుండే ఆకాశాదులు పుట్టినవని చెప్పింది.

మహోపనిషత్తులో ఏకో హ వై నారాయణ ఆసీత్ అని ఆయనే నారాయణుడు అన్న విషయాన్ని చెప్పింది.

తైత్తిరీయోపనిషత్తులో ఆ పరబ్రహ్మస్వరూపాన్ని విశేషములను సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ, ఆనన్దోబ్రహ్మ మొదలైన వాక్యాల్లో వివరించింది. ఈ విధముగా అనేకశాస్త్రవాక్యములు అఖిలజగజ్జన్మాదులకు కారణభూతమును అఖిలహేయప్రత్యనీకమును, కల్యాణగుణవిశిష్టమును, ఆనందస్వరూపమును అయిన పరబ్రహ్మమును సమగ్రముగా వివరించింది. కనుక శాస్త్రము ప్రవృత్తినివృత్తిపరముగనే ఉంటుందని అట్టివాక్యములే ప్రయోజనము కలవని భావించుట యుక్తము కాదు. ఉదాహరణమునకు విధినిరోధవాక్యములుకాని "నీకు కుమారుడు కలిగెను" అను వాక్యమువలన సంతోషమును, "ఇచ్చట పాము ఉన్నది" అను వాక్యమువలన భయమును, కలుగుచున్నవి గదా!- అని ఈ సూత్రముయొక్క తాత్పర్యము.

కాని కేవలము నీకు కుమారుడు కలిగెను అను వాక్యముచేత నిజముగా కుమారుడు కలుగకుండ సంతోషము కలుగదు. అందువలన క్రియలేక ప్రయోజనము కలుగదు గనుక, ఒక వస్తువుయొక్క యాథాత్మ్యమును

తెలిపినంతమాత్రమున ప్రయోజనము సిద్ధించదుకదా అని ఒక సంశయము. అంతేకాక, ఒక విషయమును తెలిసికొనుటకుకాని ఒక కార్యమునందు ఉద్యమించుటకుకాని తత్ప్రయోజనము అత్యంతావశ్యకము. రాజునాశ్రయించుము అను వాక్యమునకు ప్రయోజనము సిద్ధించదు. కాని ధనము కావలెనన్న రాజునాశ్రయించుము అని చెప్పుటవలన ప్రయోజనము సిద్ధించును. కాని బ్రహ్మ ఉన్నదని అది ఒక్కటే ఉన్నదని అది సృష్టిచేసినదని దాని స్వరూపగుణవిశేషాలు ఇలా ఉంటాయని, ఆ బ్రహ్మమునే నారాయణుడు అంటారని మొదలైన వాక్యవిషయములవలన ప్రయోజనము సిద్ధించదు గనుక అట్టి శాస్త్రవాక్యములు ప్రమాణములుగా చెప్పలేము.

అట్లుకాక బ్రహ్మ ఉన్నట్లు తెలియుటవలన దానిగురించి ప్రయత్నము చేయుట, చివరకు ప్రయోజనము కలుగుట, జరుగుతుందంటే ఇది కుమారుడు కనబడకుండ, 'నీకు కుమారుడు కలిగేడు' అన్నమాటలాగే ఉంటుంది. ఎందుకంటే 'నీకు కుమారుడు కలిగేడు' అను వాక్యము వినిన పిదప ఆ కుమారుని ఉనికి ప్రత్యక్షప్రమాణముచేత తెలుసుకొనటం జరుగుతుంది. కాని బ్రహ్మవిషయంలో మన ఇంద్రియాలకు ప్రత్యక్షంగా బ్రహ్మ గోచరించదు. అందువలన "నీకు కుమారుడు కలిగెను" అన్న వాక్యము వినిన పిదప ఆ కుమారుడు కనబడకపోయినపుడు ' నీకు కుమారుడు కలిగెను' అన్న వాక్యము ఎంతప్రామాణ్యమును ప్రయోజనాన్నీ ఇస్తుందో ఇన్ద్రియగోచరముకాని బ్రహ్మ ఒకటి ఉన్నదని చెప్పు శాస్త్రవాక్యముకూడ అంతే ప్రామాణ్యతనీ, ప్రయోజనాన్నీ కలిగి ఉంటుంది. కనుక అట్టి శాస్త్రవాక్యములు బ్రహ్మను ప్రతిపాదించలేవుగదా అని సంశయము.

ఈ విధముగా, విధినిషేధాలు లేకుండా ప్రయోజనము ఇదమిత్థమని నిర్ణయించబడని వేదాంతవాక్యములు బ్రహ్మను ప్రతిపాదించవు అని ప్రభాకరాది పూర్వమీమాంసకులు చెప్తారు. ఈ సూత్రభాష్యమునందు పూర్వపక్ష సిద్ధాంతవాదములు క్రొత్తరకంగా ఉంటాయి. పైన చెప్పబడిన మీమాంసకుల వాదములకు ప్రపంచము ప్రాతిభాసికము సాధనవలన దానిని లేనట్లు గుర్తించి అంటే నిష్ప్రపంచీకరణము చేసికొని మోక్షము సాధించవలెనను భర్తృప్రపంచవాదముచేత ముందు సమాధానము చెప్పబడుతుంది. దీనిని పూర్వమీమాంసకవాదము తిరస్కరిస్తుంది. దానికి బ్రహ్మసత్యము అని ధ్యానము చేయుటవలన మోక్షము కలుగునను మండనమిశ్రుల వాదముచేత అటుపిదప సమాధానము ఇయ్యబడుతుంది. మండనమిశ్రులవాదమునకు వాక్యార్థజ్ఞానమువలన మోక్షము కలుగునను శాంకరాద్వైతముచేత తదనంతరము ఉత్తరమీయబడుతుంది. చివరకు ఆ వాదమునందు మండనమిశ్రుల వాదము నెగ్గుతుంది. తరువాత యాదవప్రకాశులు, భాస్కరులు ప్రవచించిన భేదాభేదవాదము మండనమిశ్రులవాదమునకు సమాధానము చెప్పప్రయత్నిస్తుంది. కాని నెగ్గలేకపోతుంది. తిరిగి పూర్వమీమాంసక వాదము మండనమిశ్రులవాదమునకు సమాధానము చెప్పి జయిస్తుంది. అటుపిమ్మట చివరగా భాష్యకారులు భగవద్రామానుజులు తమ సిద్ధాంతమును ప్రతిపాదించి పూర్వమీమాంసకుల వాదమునుకూడ ఖండిస్తారు. ఈవిధంగా వివిధములైన వాదములతో ఒకదానిచే వేరొకదానిని ఖండించి చివరకు తమ సిద్ధాంతమునందు శ్రుతులన్నియు సమన్వయము చేసికొని బ్రహ్మను తెలిసికొనవలెనని దానికి ప్రయోజనము బ్రహ్మయేనని భగవద్రామానుజులు వివరిస్తారు.

ఈ వివరములన్నియు వేరువేరు పాత్రలచేత సంభాషణరూపముగా సంవాదరూపచతుస్సూత్రియందు అందించబడినవి. ఇందు పాత్రలపేరులు ఆయాదర్శనకారులనామములననుకరించియే ఈయబడినవి. ఉదాహరణకు భర్తృప్రపంచవాదమును భర్తృహరి అను పాత్ర, మండనమిశ్రునివాదమును మిశ్రా అను పాత్ర, భాస్కర యాదవప్రకాశులు ప్రవచించిన భేదాభేదవాదమును యదుభాస్కర్ అను పాత్రయు, శాంకరాద్వైతమును శంకరరావు అను పాత్రయు, నిర్వహిస్తాయి. ఈ సూత్రమునందు పూర్వమీమాంసకులవాదము నేను అన్న పాత్ర చేత

అందించబడినది. భగవద్రామానుజుల సిద్ధాంతమును అమ్మ అను పాత్ర ప్రసాదిస్తుంది. పాఠకుల సౌలభ్యము కొరకు పైవివరములు ఇచట నీయబడినవి. పాఠకులు ఆ చతుస్సూత్రిసంగ్రహమునందు ఈ వివరములు గ్రహించగలరు.

సంగ్రహముగా ఈ వాదముల సారాంశము ఇచ్చట నీయబడినది.

ఇంతకుముందు చెప్పినట్లు వేదాంతవాక్యములు బ్రహ్మస్వరూప,రూపగుణవిశేషములను చెప్పినను విధినిరోధములనుగాని తత్ప్రయోజనానుభవమునుగాని ఇదమిత్థమని తెలియచెప్పకపోవుటవలన బ్రహ్మ-ప్రతిపాద్యములు కావు అను పూర్వమీమాంసవాదమునకు నిష్ప్రపంచీకరణనియోగవాదులైన భర్తృప్రపంచ-మతానుయాయుల సమాధానము సంగ్రహముగా క్రిందివిధముగా నుండును

## భర్తృప్రపంచనియోగవాదము

ఈ చేతనాచేతనాత్మకమైన ఈ ప్రపంచము అయథార్థము.బ్రహ్మయొక్కటే సత్యమైనది. అయినను బ్రహ్మ అనాదిగానున్న అవిద్యకు వశపడుటవలన ఈ ప్రపంచమంతా కనబడుతున్నది. సాధనద్వారా ఈ ప్రపంచాన్ని తొలగించుకొనే ప్రయత్నాన్ని చెయ్యాలి. అంటే నిష్ప్రపంచీకరణము చెయ్యాలన్నమాట. ఇలా ప్రపంచరాహిత్యాన్ని చెయ్యడమనే వేదాంతవాక్యముల తాత్పర్యము. నదృష్టేః ద్రష్టారం పశ్యే అంటే జ్ఞానముకంటే వేరుగా జ్ఞాతను చూడవద్దు, నమతేః మన్తారం మన్వీథాః మననముకంటే వేరుగా మననము చేసేవాడిని భావించవద్దు, ధ్యాయీత ఉపాసీత మొదలగు విధినిషేధవాక్యములుకూడ ఈ విషయాన్నే చెప్తాయి.

దీనికి సమాధానముగా పూర్వమీమాంసకులు క్రింది విషయాలను చెప్తారు.

## నిష్ప్రపంచీకరణవాదమునకు పూర్వమీమాంసకుల సమాధానము

ఈ కనబడుతున్న ప్రపంచమంతా అయథార్థమని, వేదాంతము చెప్పలేదు. అలాగే ఈ ప్రపంచాన్ని నిష్ప్రపంచీకరణం చేసుకొనాలనికూడా శాస్త్రాలు చెప్పలేదు.

ఈ ప్రక్రియకు సాధనమైన నిష్ప్రపంచబ్రహ్మమే ఫలముకూడా అవుతోంది. ఇది అసమంజసము ఉదాహరణకు స్వర్గకామో యజేత అన్నప్పుడు సాధనము యజ్ఞము, తత్ఫలము స్వర్గమూ అవుతాయి. అలా కాకుండా పండుకావాలంటే పండు తినాలి అన్నట్లు చెప్పే నిష్ప్రపంచీకరణము చేసుకుంటే నిష్ప్రపంచీకరణం లభిస్తుంది అని చెప్పుట సరికాదు. అట్టి సాధనమునకు అంగములను, అధికారలక్షణమును, నిర్వచించుటకు సాధ్యము కాదు. అట్టి పరిస్థితుల్లో తత్ఫలమైన నిష్ప్రపంచీకరణమైన తరువాత కలిగే మోక్షస్థితికూడా తాత్కాలికమే అవుతుంది. పై ఈ వాదములో నిష్ప్రపంచీకరణం చేస్తున్నది వేదాంతవాక్యములే అయితే ఆ వాక్యములలో చెప్పబడిన ధ్యాన, మనన నిదిధ్యాసములకు ఆవశ్యకతే ఉండదు.

దీనికి సమాధానముగా జ్ఞానయోగవాదులైన మండనమిశ్రమతానుయాయులు ఈ క్రిందివిధముగా సమాధానమును చెపుతారు.

## మండనమిశ్రమతానుయాయుల సమాధానము

ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మన్తవ్యః నిదిధ్యాసితవ్యః అని ,య ఆత్మా.సోన్వేష్టవ్యః తద్విజిజ్ఞాసితవ్యః, ఆత్మా ఇత్యేవముపాసీత, ఆత్మానమేవ లోకముపాసీత అని శ్రుతివాక్యాలు ధ్యానాన్ని చెప్తాయి. ఇట్లు ధ్యానము చేయు వస్తువును సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ , సదేవ సోమ్య అనిన్నీ అనేకశ్రుతివాక్యములు తెలుపుతాయి. నేహ నానాస్తి కించన మొదలైన వాక్యములు బ్రహ్మమొక్కటే సత్యమని, తదితరమైనదంతా మిథ్య అని తెలుపుతాయి.

ఈ విషయాన్ని తెలిసికొని ధ్యానము చేయవలెను. కాని ధ్యానము చేయుటవలన వెంటనే మోక్షము సిద్ధించదు. మోక్షసిద్ధికి ముందుగా నియోగము అనబడు ఒక స్థితి మధ్యలో ఉంటుంది. ఈ నియోగమువలన ఆత్మాపరోక్ష–జ్ఞానము కలుగుతుంది. అంటే బ్రహ్మ ఒక్కటే సత్యమని, కనబడుతున్న ఈ చేతనాచేతనజగత్తంతా మిథ్య అని జ్ఞానము కలుగుతుంది. దానివలన మోక్షము సిద్ధిస్తుంది. ఈ రకంగా అశరీరస్వరూపమైన మోక్షము జ్ఞానముచేత సాధింపబడుతుంది. అట్లుకాక, చేసిన కర్మలు సురనరతిర్యక్స్థావరశరీరాలతో సంబంధం కలిగించే ఫలాలను మాత్రమే ఇస్తాయి. ఈ విషయాన్నే న హ వై స శరీరస్య సతః క్రియాక్రియయోః అపహతీ అస్తి, అశరీరంవా, సంతం న ప్రియాప్రియే సుశకః – దేహసంబంధాలున్నంతవరకూ మోక్షము కలుగుటకు ఆటంకము ఉంటుంది. శరీరం పోయినపుడే సుఖదుఃఖాలు పోతాయి. ఆ సుఖదుఃఖాలు కలిగించే కర్మలు చేసి మోక్షము సంపాదించే అవకాశం లేదు అని శ్రుతులు చెప్తాయి.

దీనికి సమాధానముగా శాంకరాద్వైతులు ఈక్రిందివిధముగా సమాధానము చెప్తారు.

## శాంకరాద్వైతుల వాదము.

అశరీరత్వమనగా, ఆత్మస్వరూపంతో ఉండటం అని అర్థం. అశరీరం శరీరేషు అన్న శ్రుతివాక్యము శరీరసంబంధము లేనిదైన ఆత్మస్వరూపము తెలిసినవాడు దుఃఖములను పొందడు అని అశరీరత్వరూపమైన మోక్షము నిత్యమని తెలుపుతుంది.

మనచేత సాధింపబడే పదార్థాలు నాలుగువిధములుగా – ఉత్పత్తివలన– అనగా మట్టినుంచి కుండ పుట్టినట్లుగా; ప్రాప్తివలన అనగా, స్వర్గము పొందుట మొదలైనవి; వికృతివలన అనగా పాలు పెరుగుగా మారినట్లుగా; సంస్కృతివలన అనగా మురికిబట్టనుండి మురికి తొలగించబడినట్లుగా; సాధ్యమౌతాయి. బ్రహ్మము ఎప్పుడూ పరిశుద్ధము, నిత్యము, నిర్వికారము గనుక, పై విధంగా సాధించుటకు అవకాశం లేదు. అందుచేత ధ్యానమనే ఒక విధిని కల్పించుకొని దానిద్వారా మోక్షాన్ని సాధించాలనటం సరికాదు. ఎందుకంటే మోక్షమంటే ఆత్మస్వరూపమే. అది ఎప్పుడూ సిద్ధమయే ఉంటుంది. మహావాక్యాల అర్థజ్ఞానంవల్ల అవిద్యానివృత్తి కలుగుతుంది. అదే మోక్షము. ఉదాహరణకు బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి, తమేవం విదిత్వా అతిమృత్యుమేతి మొదలైన శ్రుతి వాక్యములు బ్రహ్మజ్ఞానం కలుగగానే మోక్షమే అన్న విషయాన్ని తెలుపుతున్నాయి. అందువలన శ్రవణం, మననం, ధ్యానం, నిదిధ్యాసము అటుపిమ్మట నియోగమనే మధ్యాన్తరస్థితి, ఇలా వీటన్నింటికీ వ్యవధి లేదు, వీటిని కల్పించవలసిన అవసరమూ లేదు. కనుక మోక్షమునకు వాక్యార్థజ్ఞానమే సరిపోతుంది.

బ్రహ్మని తెలిసికొని బ్రహ్మను ధ్యానించవలెనన్నచో కర్త, కర్మ, అని రెండు వేరువేరు వస్తువులు ఉంటాయి. బ్రహ్మమొక్కటే ఉన్నది గనుక అట్టి ఉపాసనకు అవకాశము లేదు. అట్లైనచో శ్రోతవ్యః మన్తవ్యః..., ఆత్మేత్యేవముపాసీత, మొదలైన శ్రుతివాక్యములను ఏవిధముగా అర్థము చేసుకొనవలెనని సంశయము కలుగవచ్చును. ఇట్టి వాక్యముల ప్రయోజనము, పరిపరివిధములుగా ప్రవర్తించే మనస్సులకు దానిని అన్నిటినుండి మరల్చి తత్కారణంగా వాక్యార్థజ్ఞానాన్ని కలుగజేయడమే. వాక్యార్థజ్ఞానము కలిగిన తరువాత శరీరమున్నాకూడా, అట్టి స్థితి, మోక్షమే. ఎందుకంటే, శరీరము కనబడుతున్నాకూడా, అది లేనిదే కదా! అందువలన శరీరము వేరుగా పడిపోనక్కరలేదు. ఇట్టి స్థితిని జీవన్ముక్తి అంటారు.

శాంకరాద్వైతులవాదమును ధ్యాననియోగవాదులు అంగీకరించక క్రిందివిధముగా సమాధానం చెప్తున్నారు

## శాంకరాద్వైతులకు ధ్యాననియోగవాదుల సమాధానము

తత్త్వమసి మున్నగు వాక్యముల అర్ధము తెలియగనే భేదజ్ఞానము, బంధము పోవడం, మోక్షం కలగడం అసంభవము. ఎందుకంటే, ఈ వాక్యార్థాలను తెలిసికున్న తరువాతకూడా, ఈ భేదజ్ఞానము ఉంటూనే ఉంటుంది. అంటే బ్రహ్మ సత్యము అన్న వాక్యార్థము తెలిసినప్పటికీ ఈ చరాచరజగత్తుకాని, మనకున్న శరీరముకాని గోచరమౌతూనే ఉంటాయే తప్ప, అనుభవంలోంచి తొలగిపోవుట జరుగదు. వాక్యార్థజ్ఞానము కలిగినవెంటనే మోక్షము సిద్ధించుట లోకవ్యవహారంలో చూడము.

## శాంకరాద్వైతుల సమర్థనము

మోక్షము ఒక భావపదార్థము కాదు. బంధ,భేదముల భ్రాన్తి తొలగుటయే మోక్షము. ఉదాహరణకు పాముకానితాడును ముందుగా పాము అనుకొని, అటుపిమ్మట పాము కాదని తెలిసికొనినతరువాత, లేని పామును నాశనము చేయుట అవసరము లేదు. అదేవిధముగా ఈ జగత్తు శరీరము మొదలైనవి, అయథార్థములని తెలిసికొనిన తరువాత మోక్షమునకు వేరుగా వాటి నాశనము అవసరము లేదు. ధ్యాననియోగవాదులు చెప్పే ధ్యానమువలన మోక్షార్థజ్ఞానము కలిగి తద్వారా కూడా మోక్షము సిద్ధించవచ్చును.

## ధ్యాననియోగవాదుల సమాధానము

ఇంతకుముందు చెప్పబడిన తాడు పాము ఉదాహరణలో ఒకడు త్రాడును పాము అని భ్రమపడినప్పుడు వేరొకడు అది పాము కాదు, త్రాడు అని చెప్పినను, అతని భయము పూర్తిగా తొలగుట, ఆ పదార్థము కదలదు, కరవదు కనుక, పాము కాదని చూచినప్పుడే. కనుక కేవలవాక్యార్థజ్ఞానమువలన మోక్షము తక్షణము సిద్ధింపదు.

ఇంతకుముందు చెప్పినట్లు ధ్యానము వాక్యార్థజ్ఞానమును కలుగజేసి, తద్వారా మోక్షం వస్తుందంటే ఆ ధ్యానమును చేయుటకు ప్రాతిపదిక వాక్యార్థజ్ఞానమే కావాలిగనుక అన్యోన్యాశ్రయదోషం వస్తుంది. అనగా, ధ్యానము లేకుండ వాక్యార్థజ్ఞానము కలుగదు. వాక్యార్థజ్ఞానము లేకుండ ధ్యానము కుదరదు. కనుక ఇట్టి వాదము అంగీకృతము కాదు.

అట్లుగాక ధ్యానము, వాక్యార్థజ్ఞానము, వేరువేరు అని అంటే, వాక్యార్థజ్ఞానము లేకుండ, ధ్యానము చేయుటకు విషయము ఉండదు. వాక్యర్థజ్ఞానమువలన వేరొకవిషయముపై ధ్యానము చేయుట అనిన అదికూడ బ్రహ్మవిషయమే అంటే, అదికూడా వాక్యార్థజ్ఞానమే కావాలి. బ్రహ్మవిషయం కాకపోతే, దానివలన బ్రహ్మ సత్యమని జగత్తు మిథ్య అనిన్నీ, తెలియదు.

మోక్షమనగా ప్రపంచబంధములోనుండి, శరీరమునుండి, విడివడుట అని అర్థము. అట్లుకాక తమ ఆలోచనలో శరీరముతో సంబంధము పోయినదనుకున్నంతమాత్రమున మోక్షము సిద్ధిస్తుందని శ్రుతి చెప్పలేదు. ఉదాహరణకు తస్య తావదేవ చిరమ్ యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే శరీరవియోగము కలుగనంతవరకుమాత్రమే మోక్షమును పొందుటకు ఆలస్యము. అనంతరము అతడు బ్రహ్మమును పొందును. అనగా, శరీరమున్నంతవరకు మోక్షము సిద్ధించదు అనియే శ్రుతిప్రోక్తము.

ధ్యాననియోగమువలన మనసు నిర్మలమౌతుంది. దానివలన మోక్షము సిద్ధించుట సాధ్యమౌతుంది. కనుక ధ్యానము ఆవశ్యకము. నేదం యదిద తం ఉపాసతే అను శ్రుతివాక్యము బ్రహ్మ ఉపాస్యము కాదని చెప్పినట్లు అర్థము చేసుకొనరాదు. ఏది, వాక్కుచేత ప్రకాశింపబడడానికి అశక్యమైనదో, దేనిచేత వాక్కు

ప్రకాశింపబడుతుందో అది బ్రహ్మ అని మాత్రమే ఈ శ్రుతివాక్యమునకు అర్థము. కనుక ధ్యానమే మోక్షసాధనము. ఈ వాదములను భాస్కరయాదవప్రకాశులు ప్రవచించినవాదము క్రిందివిధముగా, తిరస్కరిస్తుంది.

## భేదాభేదవాదము

పదార్థములన్నియు భిన్నములుగాను అభిన్నములుగాను కూడా ఉంటాయి. ఉదాహరణమునకు మట్టినుంచి తయారైన కుండలు, ప్రమిదలు మొదలైనవాటిలో మట్టివిషయంలో అభేదము, ఆకారప్రయోజనాల విషయంలో భేదము కనబడుతుంది. అదే విధంగా ఒక మొండి ఆవును, కుంటి ఆవును, తీసుకుంటే వాటిలో గోలక్షణము సామాన్యము. కనుక అభేదము. కాని అవయవనిర్మాణములో భేదముంటుంది. ఇదే విధంగా జీవుడు బ్రహ్మము కంటే భిన్నమైనవాడు. కాని బ్రహ్మయొక్క అంశమే అవటంవల్ల అభేదంకూడా వర్తిస్తుంది. అంటే లౌకికస్థితిలో భేదముంటుంది, పారమార్థికస్థితిలో భేదముండదు. బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి అన్న శ్రుతివాక్యంలో బ్రహ్మను గ్రహించినవాడు బ్రహ్మయే అవుతాడు అని చెప్పినప్పుడు ఈ విషయమే తెలిసికొనబడాలి. ఇదే విధముగా, సోశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా అను వాక్యమునకు గుణములతో సహా బ్రహ్మను అనుభవించు చున్నాను అని అర్థం చెప్పటంవలన మోక్షస్థితిలో జీవబ్రహ్మలకు అభేదం తెలుస్తుంది. ఇలాగే, ఒక కుండలోని ఆకాశానికి, పైనున్న ఆకాశానికి కుండ అనే ఉపాధివలన భేదము కలుగుతుంది. ఆ ఉపాధి పోయినపుడు అభేదము కలుగుతుంది.

## భేదాభేదవాదమునకు ధ్యాననియోగవాదుల సమాధానము

ప్రపంచమునందు రెండు పదార్థములు భిన్నముగాను, అభిన్నముగాను ఉండుట సాధ్యముగాదు. ఈ భిన్నత్వమునందు, ఉపాధివలనను, వికారమువలనను వచ్చినదనుకుంటే బ్రహ్మకు దోషముందునన్నమాట. కనుక ఆ బ్రహ్మకు బ్రహ్మత్వము సిద్ధించదు. జీవుడు పరమాత్మఅంశ అయితే, అంశ అని దానిలో భాగమే అంటే, జీవాత్మకున్న దోషాలు పరమాత్మకూ వర్తిస్తాయి. అట్లుకాక వేరుగా అంటే అప్పుడు బ్రహ్మ వేరు, జీవుడు వేరు అని భిన్నత్వమే సిద్ధిస్తుంది, అందువలన అన్నిపదార్థములలోను భేదాభేదాలు ఉంటాయి అన్నది సరికాదు. అందువలన ధ్యానవిధివలన బ్రహ్మస్వరూపము తెలుస్తుంది.

## పైవాదములకు పూర్వమీమాంసకుల సమాధానము.

విధినిషేధవాక్యములు బ్రహ్మస్వరూపవాక్యాలతో ఏకీభవించేయా, లేక స్వతంత్రమైనవా? అని ప్రశ్న. బ్రహ్మస్వరూపవాక్యాలు విధివాక్యములతో ఏకీభవించినప్పుడు అవి స్వరూపాన్ని చెప్పేవి కావు. అట్లుకాక, అవి స్వతంత్రమైన వాక్యాలైతే ఆ వాక్యాలు ప్రమాణములు కావు. ఉదాహరణకు గోవు నాలుగు కాళ్ళది అన్నప్పుడు గోవు నాలుగుకాళ్ళది అన్నదే తెలుస్తుంది. గోవును ధ్యానం చేయుము అన్నప్పుడు గోవు స్వరూపం తెలియదు. నాలుగుకాళ్ళ జంతువును గోవును ధ్యానం చేయుము అన్నప్పుడు వాక్యభేదము అను వ్యాకరణదోషముకలుగుతుంది. అనగా ధ్యానము చేయవలసినది నాలుగుకాళ్ళ జంతువా లేక గోవా అన్నది ఈ వాక్యంలో నిర్ధారించబడలేదు. బాగా చదువుకో, పడుకో అన్నప్పుడు విధి స్పష్టముగా నిర్ధారించబడలేదు. అట్టి వాక్యములకు వాక్యభేదము ఉన్నదని వైయాకరణులు చెప్తారు. అట్టి వాక్యములు విషయనిర్దేశము చేయలేవు. ఇందువలన వేదాంతవాక్యాలు ధ్యానవిధికి అంగాలుగా ఉన్నా, ఇది చెయ్యి, అది చెయ్యద్దు అనే విధినిషేధాలు చెప్పటంలేదుకాబట్టి, ఆ ధ్యేయవస్తువు ఉనికికి ప్రమాణం కావు. స్వతంత్రంగా బ్రహ్మగురించి చెప్పేవాక్యములవలన ప్రయోజనము లేకుండుటవలన బ్రహ్మ అస్తిత్వము ప్రతిపాద్యము కాదు. కనుక, బ్రహ్మశాస్త్రప్రమాణముచేత తెలుపబడునని చెప్పుట కుదరదు.

## భగవద్రామానుజసిద్ధాంతము

విధివాక్యమైనా, స్వర్గకామో యజేత అనగా స్వర్గకాముడు యాగమును చెయ్యవలెను అని అన్నచో, ఆ స్వర్గమును గురించి తెలియనప్పుడు, అందులో ఏ బాధలుంటాయో, ఏ కష్టాలుంటాయో తెలియకపోతే ఆ విధివాక్యపాలనము చెయ్యడం కుదరదు. అందువలన వేదాంతవాక్యములు కొన్ని బ్రహ్మస్వరూపనిర్ణయంచేస్తే అంటే ఆయన సమస్తకల్యాణగుణాకరుడని, సర్వజగద్రక్షకుడని, ఆనందనిలయుడని, ఆపహతపాప్మా అని ఆయన చెప్పబడటాన్ని తెలుసుకోడం జరుగుతుంది. అప్పుడు ఆ పరబ్రహ్మను పొందే విధానము ఏమిటి అని ప్రశ్నవస్తే బ్రహ్మవిదాప్నోతి పరమ్ అనగా, బ్రహ్మమును ఉపాసించేవాడు పరమపదమును పొందుతున్నాడని అట్లు ఉపాసించుట ఎట్లనిన ఆత్మానమేవ లోకముపాసీత అని ఒక వాక్యములో ఆ పరబ్రహ్మమునే ప్రాప్యము, ప్రాపకము అని తెలుసుకొని ఉపాసించాలని తెలుస్తుంది. పుట్టు పూర్వోత్తరాలు తెలియని మనకు యతో వా ఇమాని మొదలైన వాక్యములద్వారా ఈ సమస్తజగత్కారణమైన పరబ్రహ్మమును గురించి చెప్పి ఆయన నీకోసం ఎదురు చూస్తున్నాడు, నీవు ఆయనతో సంబంధం తెలుసుకుంటే నిన్ను చేరదీసి నిత్యనిరతిశయమైన ఆనందాన్నిస్తాడు అని శాస్త్రము చెప్పుతుంది. ఈవిధముగా శ్రుతి వాక్యములన్నియు పరమప్రమాణములే గనుక వాటిని సక్రమంగా సమన్వయం చేసుకొనటంవలన బ్రహ్మప్రతిపాదనము తెలిసికొనబడును.